# చైతన్యం

సంకల్ప బలం


ఆగస్టు 2019

రూ. 20

## సామాజిక విలువల మాసపత్రిక




ISRO
INDIA


THE FLIGHT PLAN
Chandrayaan-2
Lunar Transfer Trajectory
Mid-Course correction
Mid-Course correction
Injection into Lunar Pre-Landing Orbit
Lunar Orbit (Hcir=100km)
Injection into Lunar Orbit
Lunar Pre-Landing Orbit
Breaking and Landing
Orbiter seperation
Earth Parking Orbit (Hp=100km, Ha=24,000 km)
Injection into Lunar Orbit
Launch
Injection into EPO
Orbiter propulsion ignition, Injection into LLT



వ్యవస్థాపక సంపాదకురాలు
**తీగవరపు శాంతి**

# చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -8 ఆగస్టు 2019 సంచిక -11

## ఈ సంచికలో

### ధారావాహికములు:

| | |
|---|---|
| మానససరోవర యాత్ర | 6 |
| ప్రేమంటే ఇంతే | 20 |
| తెలుగు పద్య రత్నాలు | 30 |
| మా ఊరి నందుల కథ | 35 |
| ప్రహేళిక | 45 |

### ప్రత్యేక ఆకర్షణలు

| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| మువ్వన్నెల రెపరెపలు | 11 |
| మన మొదటి రాష్ట్రపతి ........ | 12 |
| అంకెలు,సంఖ్యలు: మూడు | 16 |
| పత్రికా విలేఖర పితామహుడు ...... | 32 |
| ఒకటే వృత్తి | 33 |
| బెత్తెడు స్వర్గం | 39 |
| మోక్షమంటే | 42 |
| గట్టి పకోడీలు | 44 |
| కృష్ణం వందే జగద్గురుం | 46 |

రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# ఆర్టికల్ 370, 35 A

జమ్మూ, కాశ్మీర్ లొల్లిని పాకిస్థాన్ ఐక్యరాజ్య సమితి చర్చలవరకూ తీసుకెళ్లి, అక్కడ భారత దేశాన్ని దెబ్బ తీయాలని చూసింది కానీ అక్కడ భంగపాటు తప్పలేదు పాకిస్తాన్ కి.
పాకిస్థాన్ ఎన్ని ఎత్తులు వేసినా, భారత్ ఇంకా పై ఎత్తులు వేసి, చిత్తు చేయడం భారత ప్రజలను సంతోషంలో ముంచింది. మోదీ ఎన్నికల మానిఫెస్టోలో వాగ్దానం చేసినట్లుగానే జమ్మూ, కాశ్మీర్ విషయం తేలుస్తాడని ప్రజలు ఊహించారు, కానీ ఇంత తొందరగా అని ఎవరూ అనుకోలేదు.ప్రస్తుతం ప్రధాన అంశంగా చర్చించుకుంటున్న అంశం రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, దానికి తోడు 35A. ఎందుకు అంత ప్రధాన అంశంగా చర్చించబడుతోందంటే ఆర్టికల్ 370,35A : "కాశ్మీర్ కు ప్రత్యేకం"!

జమ్మూ కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించడం కోసం రాజ్యాంగంలో ఆర్టికల్ 370 పేరిట చేర్చిన తాత్కాలిక నిబంధన ఇది. 1947 అక్టోబర్ 26న కాశ్మీర్ ను భారత యూనియన్ లో విలీనం చేశారు. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు అనే మూడు అంశాలకే విలీనం పరిమితమైంది. విలీనం విధి విధానాలు అప్పటికింకా ఖరారు కాలేదు. వీటిపై 1949 జులైలో 'నేషనల్ కాన్ఫరెన్స్' అగ్రనేత షేక్ అబ్దుల్లా భారత ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించారు. పర్యవసానంగా ఆర్టికల్ 370 ని రాజ్యాంగంలో చేర్చారు. దీని ప్రకారం రక్షణ, విదేశీ, ఆర్థిక కమ్యూనికేషన్ వ్యవహారాలూ తప్ప మిగిలిన వాటిలో కాశ్మీర్ కు స్వయం ప్రతిపత్తి ఉంటుంది. ఈ రాష్ట్రంలో ఇతర చట్టాలను అమలు చేయాలంటే రాష్ట్ర సమ్మతిని పార్లమెంట్ తీసుకోవలసి ఉంటుంది. పౌరసత్వం, ఆస్థిపై హక్కు ప్రాథమిక హక్కుల విషయంలో రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక చట్టాలుంటాయి. అందువల్ల ఈ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల వారు భూములను కొనలేరు. ఆర్టికల్ 360 కింద ఈ రాష్ట్రంలో కేంద్ర ఆర్థిక ఎమర్జెన్సీని విధించలేరు.

అసలు కాశ్మీర్ నివాసి అంటే! ఎవరవుతారో ? తెలుసుసుకోవాలి

కాశ్మీర్ శాశ్వత నివాసి ఎవరు? అన్నదానిని రాజ్యాంగం నిర్వచించింది. 1954 మే 14వ తేదీ కన్నా ముందు లేదా ఆ తేదీ నాటికి రాష్ట్రంలో జన్మించిన వ్యక్తి లేదా 10 సంవత్సరాల పాటు నివసించిన వ్యక్తి కాశ్మీర్ శాశ్వత నివాసి అవుతాడు. ఆ వ్యక్తి ఆ రాష్ట్రంలో స్థిరాస్తులను కలిగి ఉండవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం, ప్రభుత్వం కల్పించే స్కాలర్ షిప్పులు ఇతరత్రా సహాయాలు ప్రత్యేక ప్రయోజనాలు పొంద వచ్చు. దీర్ఘకాలం రాష్ట్రంలో స్థిరనివాసం ఎవరో నిర్వచించడం కోసం చట్టాలు చేసే అధికారాన్ని జమ్మూ, కాశ్మీర్ అసంబ్లీకి ఆర్టికల్ 35 గా కట్టబెట్టింది. అయితే ఈ నిర్వచనాన్ని మూడింట రెండింతలు మెజారిటీతో అసంబ్లీ మార్చచ్చు. కాశ్మీరీ మహిళ కాశ్మీరేతరుల్ని పెళ్లి చేసుకుంటే మాత్రం ఈమె ఈ రాష్ట్రంలో స్థిరాస్తుల్ని కలిగి ఉండడానికి వీల్లేదు. ఆమె పిల్లలకూ ఆ ఆస్థిపై హక్కు ఉండదు. పిల్లలకు శాశ్వత నివాసి సర్టిఫికెట్ కూడా ఇవ్వరు.

ఏడు దశాబ్దాలుగా నడుస్తున్న యుద్ధ పోరాటాలలో అనేకమంది సైనికులు బలైపోతూనే ఉన్నారు. ప్రజల గుండెలు పగిలి పోతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి. వీరమరణం పొందిన వారి కుటుంబాలకు సానుభూతి దొరకడమే కష్టమైపోతోంది. యుద్ధాలలో వీరమరణం పొంది, అప్పటికి మాత్రమే వారి సానుభూతిని పొంది, సైనికులు వీరజవాన్లగా మిగిలిపోతుంటే, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రభుత్వం వారికి అండదండగా నిలబడాలి. అలాగే ఆర్థిక అసమానతలు పోగొట్టడానికి ప్రజలకు పనికల్పించాలి, దేశాన్ని పారిశ్రామికంగా ముందుకు తీసుకుని వెళ్ళాలి. కానీ, ప్రజలు పన్నుల రూపంలో కట్టిన సొమ్మును పేదవారికంటూ ఉచితంగా ఇవ్వకూడదనేది ప్రజల వాదన. ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని కోరుకుంటోంది చైతన్యం సంకల్పబలం.

భారత్ మాతాకు జై -------- వందే మాతరం.

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

సర్వాంగ సుందరంగా వెలువడిన జూలై సంచిక చాలా బాగా వుంది. మీ సంపాదకీయం మీ పత్రికకే హైలైట్. మీకు అభినందనలు.
వేంకటనారాయణ, తిరుపతి

మానససరోవర యాత్ర చదువుతుంటే ఎప్పుడెప్పు ఆ యాత్ర చేస్తామా అనిపిస్తోంది. కళ్ళకు కట్టినట్టుగా ఉన్న వర్ణన, అంతకన్నా కన్నుల పండుగగా ఉన్న యాత్ర వీడియోలు - నిజంగా మా ప్రేక్షక లోకం మీకు ఎంతో ఋణపడివుంటుంది అని అనటంలో అతిశయోక్తి లేదనుకుంటాను. మీకు మరొకసారి ధన్యవాదాలు.
శీను, వేణు, రాజా, రమేష్, సతీష్, సుబ్బారావు, సౌజన్య, రాజేశ్వరి - విజయవాడ.

బుచ్చిరాజు గారి వారు వీరౌతారు కథ బావుంది. సహవాసాల ప్రభావం చెడుకెంత దారితీయవచ్చో, మంచికీ అంతే దారితీయవచ్చని చక్కగా చెప్పారు రచయిత.
సుబ్రహ్మణ్యం - రాజమహేంద్రవరం

అంకెల గురించి కూడా ఎంత చక్కగా చెప్పవచ్చో వేమూరి వేంకటేశ్వరరావు గారి రచనలు చూస్తే అర్థమవుతుంది. రచయితకు నమస్సులు.
లక్ష్మీపతి, రమణి - తణుకు

అంతర్జాతీయ యోగా దివస్ ను పురస్కరించికుని డాలస్ లో యోగా శిబిరం గురించి మీరు ఇచ్చిన వ్యాసం బాగుంది.
శ్రీరాం - తార్నాక

దంతుర్తి శర్మ గారు వ్రాస్తున్న పద్యరత్నాలు నిజంగా మీ పత్రికకే రత్నాలు. చిన్నప్పుడు స్కూలులో తెలుగు మేష్టారు చెప్పినట్టు చక్కగా చెప్తున్నారు శర్మ గారు.
మార్కండేయ శాస్త్రి, వనజ - గుంటూరు

ద్వా నా శాస్త్రి గారి గురించి తుమ్మూరి వారి వ్యాసం చాలా బాగుంది. ఆయనను కలుసుకునే అదృష్టం నాకు కూడా ఒకసారి లభించింది. నిజంగా ఆయనకు సాహిత్యంపై గల పట్టు చాలా గొప్పది. ఆయన లేకపోవటం తెలుగు సాహిత్యరంగానికి పెద్ద లోటు.
సుబ్బారావు, అమలాపురం

రిపార్టీ ప్రక్రియపై చిలకమర్తి వారి వ్యాసం అద్భుతం. చాలా ఆనందం వేసింది చదువుతుంటే. ఈ రచయిత నుంచి మరిన్ని రచనలు మేము ఆశించవచ్చా?
సాయి రమేష్ , సత్య - బెంగళూరు

ఆదూరి హైమవతి గారి మిత్రద్రోహి కథ బావుంది. పిల్లలకు ఇలాంటి కథలు ఉపయోగపడతాయి. అలాగే ఇంద్రకంటి వారి ప్రేమంటే ఇంతే బాగా ఆసక్తికరంగా ఉంటోంది. సీరియల్ కు ఇంకా ఎక్కువ పేజీలు కేటాయిస్తే బాగుంటుంది.
శంకరరావు,భవాని - అనకాపల్లి

నందుల ప్రభాకరశాస్త్రి గారి మాఊరి నందులకథ చాలా బావుంటోంది. పల్లెటూరి వాతావరణం కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తున్నారు.
రమణారెడ్డి, సరోజినీ - పొద్దటూరు

పమ్మి భారతీ శర్మ గారి కథానిక చాలా బావుంది. ముఖ్యంగా వయసులోకి వస్తున్న ఆడపిల్లలు(మగ పిల్లలు కూడా) తప్పక చదవాల్సిన వ్యాసం ఇది.
చారులత, సుచరిత, లీల - కుకట్ పల్లి

తెలుగులో సైన్స్ ఫిక్షన్ కథలు కరవు అవుతున్న ఈ రోజులలో, పింగళి గోపి గారు చేస్తున్న కృషి శ్లాఘనీయం. అటువంటి రచనలు ఎంకరేజ్ చేస్తున్నందుకు మీకు కూడా ధన్యవాదాలు. వుయ్ వాంట్ మోర్!
ప్రసాద్, కుమార్, కృష్ణ, సురేష్ - హైదరాబాదు

ప్రహేళిక ఈసారి కొంచెం తేలికగా అనిపించింది. తెలుగులో ఇది కొంచెం వినూత్న ప్రయోగం అని నాకు అనిపిస్తుంది. ఏది ఏమైనా మాకు నచ్చింది. అలాగే కొత్త రామానందం గారు రథయాత్ర గురించి ఎన్నో తెలియని సంగతులు చెప్పారు. రచయితకు మా నమస్కారాలు .
వాణి - ఖమ్మం

# కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర

ఊరికి ఓ నాలుగైదు మైళ్ళ దూరంలో ఉన్న చెక్ పోస్ట్ దగ్గరకు చేరాం. అక్కడ అప్పటికే నాలుగైదు వాహనాలు ఆగి ఉన్నాయి. ఏమైందో అని మా బస్ డ్రైవర్, మా గైడ్ దిగి చెక్ పోస్ట్ కేసి నడిచారు. 'సాగా' కి వెళ్ళే రోడ్డు అసలు బాగాలేదట. రోడ్డు చాలా చోట్ల వరద ఉద్ధుతానికి కొట్టుకు పోయిందట. కనీసం 24 గంటలు పడుతుందట బాగు చేయటానికి. అందుకని మమ్మలనందరినీ వెనక్కి వెళ్ళిపొమ్మని చెక్ పోస్ట్ వాళ్ళు ఆదేశాలిచ్చారు అని చెప్పారు. ఈ అనుకోని అవాంతరానికి మేమందరం కొంచెం అవాక్కయ్యాం. ఎందుకంటే శ్రావణ పౌర్ణమి నాటి రాత్రి మేము మానససరోవర తీరంలో గడపాలని మా 'ఒరిజినల్ ప్రోగ్రాం'. కానీ ఇప్పుడు ఒకరోజు మనకు పోతోంది ఏమీ ఆక్టివిటీ లేకుండా. దీనిని ఎలా 'కాంపెన్సేట్' చెయ్యాలా అని మా ప్రోగ్రాం గైడ్లలో మేధో మథనం మొదలయ్యింది. సరే ఇప్పుడు ఇక్కడ చేసేదేమీ లేదుగా అని చెప్పి నెమ్మదిగా వెనక్కి హోటలుకు బయలుదేరాము. చెక్ పోస్ట్ దగ్గర ఉన్న కొద్దిపాటి సమయంలో చాలామంది ఔత్సాహికులు ఫోటోలు తీసుకున్నారు.



కన్నుల పండువుగా ఆ మంచు కొండలు, ప్రకృతి అందాలు అందరూ కెమెరాల్లో బంధించుకున్నాం. ఈ జ్ఞాపకాల్ని మదిలో పదిలపరచుకోటానికి అందరూ ఎంతో ఉబలాటపడ్డారు. అలా హోటలుకి చేరాము. మళ్ళీ ఎవరి రూములకు వాళ్ళే వెళ్ళిపొండి అని గైడ్లు చెప్పటంతో, మా రూమ్ కీస్ రిసెప్షన్ లో తీసుకుని మా పాత రూములకి వెళ్ళిపోయాము. ఇది ప్రోగ్రాం లో లేని హోటల్ స్టే కనక బహుశా రూమ్ రెంట్ మేము కట్టవలసి రావచ్చు. సరే ఆ సంగతి తరవాత చూసుకోవచ్చులే అనుకున్నాం. కింద రిసెప్షన్ దగ్గర గైడ్లు సమావేశం ఏర్పాటు చేశారు. చర్చించే విషయం ఏమిటంటే ఈ ఒక రోజు నష్టం ఏవిధంగా పూడ్చాలా అని.

మా ఒరిజినల్ ప్రోగ్రామ్ ప్రకారం మేము కైలాస పర్వత పరిక్రమ ముగించుకున్న తరవాత పౌర్ణమి నాటికి మానససరోవరం చేరటం, ఆ రాత్రి అక్కడ గడపటం. అంటే, ఆగస్టు 24, 25 తారీకుల్లో మొదటి రెండు రోజుల పరిక్రమ చేసి, 26 వ తేదీ, అంటే పౌర్ణమి నాడు, మూడవ రోజు పరిక్రమ చేసి, ఆ రోజు మధ్యాహ్నం కల్లా మానససరోవరం చేరుకోవాలని. కానీ ఇక్కడ ఒకరోజు వృధా అవటం వల్ల, మేము పౌర్ణమి నాడు పరిక్రమలోనే ఉంటాము. మమ్మల్ని గైడ్లు అడిగారు 'మీకు పౌర్ణమి నాడు మానససరోవరం దగ్గర గడపటం ఎంత ముఖ్యం?'. అందరూ ముక్త కంఠంతో చాలా ముఖ్యం అన్నాము. దాంతో గైడ్లు ఏం చెప్పారంటే మనం పరిక్రమ రెండు రోజులలో ముగించేస్తే,

పౌర్ణమి నాటికి మానససరోవరం చేరుకోగలం. ఇది మీకు అమోదమైతే అలా చేద్దాం అన్నారు. అందరూ సరేనన్నాం.

ఆ రోజంతా చెదురు మొదురుగా వర్షం పడుతూనే ఉంది. మేం ఎక్కువగా హోటల్ రూమ్ లోనే గడిపాం. అల్లాగే తడుస్తూనే భోజనాలు చేసి వచ్చి రూమ్ లోనే ఉండిపోయాం. సాయంత్రం కొంచెం తెరిపి ఇస్తే అలా ఊళ్ళో తిరిగివచ్చాం. సరదాగా గుర్తుగా ఉండటానికోసం ఒక పెన్ను, ఒక నైల్ కట్టర్ కొనుక్కున్నాం. ఇంకా చాలా కొందామనిపించింది గానీ ఎదురుగా పెద్ద ప్రయాణం ఉంది కదా, ఎక్కడ డబ్బులు అవసరమవుతాయో తెలియదు కదా! అని కొంచెం పొదుపుగానే ఉన్నాం.

మర్నాడు పొద్దున్నే లేచి తయారయిపోయి, రూములు ఖాళీ చేసి బస్ ఎక్కి కూర్చున్నాం. చెక్ పోస్ట్ దగ్గర బస్సులు ఆపట్లేదు, పోనిస్తున్నారు అని తెలిసింది. హమ్మయ్య! ఇక్కడ నుంచి బయటపడ్తున్నాంలే అని హాయిగా ఊపిరి పీల్చుకున్నాం.

మా గైడ్ వచ్చి అందరూ వచ్చారా? అని లెక్కబెట్టుకుని, 'రైట్' చెప్పాడు. జయ జయ నినాదాల మధ్య బస్సు బయలుదేరింది. అప్పుడు సమయం పొద్దున్న 9 గంటల 10 నిముషాలు అయింది. మన భారతదేశపు సమయం 6 గంటల 40 నిముషాలు అయ్యుంటుంది. ఎందుకంటే టిబెట్ టైం మనకన్నా 2 1/2 గంటలు ముందు ఉంటుంది. అన్నట్టు చెప్పటం మరచిపోయాను, మా బస్ తో పాటు ఒక టెంపో వ్యాన్ కూడా మాతోనే వస్తోంది. అందులో మా బ్యాచ్ లో వాళ్ళే నలుగురు, షెర్పాలు, కొన్ని సప్లైలు, అంటే మంచినీళ్ళు, స్నాక్ ఐటమ్స్ ఇలా, అందులో వచ్చాయి.



మనసులో ఆ పరమశివుని స్మరించుకుంటూ మా ఆగస్ట్ 23 వతేదీ ప్రయాణం 'సాగా' కి మొదలయ్యింది. ఈ దూరం సుమారు ఒక వంద కిలోమీటర్లు ఉంటుంది. అంతా సవ్యంగా సాగితే ఓ అయిదు గంటలలో చేరుకోగలం.

అలా ఓ పావుగంట ప్రయాణం సాగింది. ఇంతలో బస్ 'స్లో' అవసాగింది. మళ్ళీ ఏం అవాంతరం వచ్చిందా అని అందరం బస్ లోంచి బయటకు చూసాం. అక్కడ కొండల మీదనుంచి



వస్తున్న నీటి ప్రవాహ వేగానికి రోడ్డు బాగా గుంతలు పడింది. అప్పటికే అక్కడ హైవే మెయింటెనెన్స్ వాళ్ళు పక్క నుంచి రాళ్ళు తీసుకొచ్చి అక్కడ ఉన్న గుంతలు పూడుస్తున్నారు. మా డ్రైవర్ కూడా రాళ్ళు మోయటం ప్రారంభించాడు. దాంతో మేంకూడా దిగి వాళ్లకు చేయూత నిచ్చాము. ఓ పది పదిహేను నిముషాల్లో పని పూర్తయింది. ఎందుకైనా మంచిదని డ్రైవర్ బస్ లోంచి అందరినీ దిగమన్నాడు. బస్ ఒకటే జాగ్రత్తగా ఆ పరచిన రాళ్ళ మీదనుంచి అవతలకి తీసుకెళ్ళాడు. మేం ఆ రాళ్ళ మీద నుంచి నడిచివెళ్ళి బస్ ఎక్కాము. బస్ మళ్ళీ బయలుదేరింది. ఓ అయిదు నిముషాలు గడవగానే మళ్ళీ బస్ స్లో అయింది. అక్కడ జెసిబిలతో పనులు చేస్తూ మనుషులు కనబడ్డారు. దగ్గర దగ్గర ఒక వంద



మీటర్ల మేర రోడ్డు నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయింది. కానీ అప్పటికే ఒరిజినల్ రోడ్డు పక్కనే కొండను కొంచెం తొలిచి ఓ కచ్చా రోడ్డు ఏర్పాటు చేసారు. నిన్న దీనికోసం మన బస్సుని ఆపేసిఉంటారు. యాత్రికులకు ఏ ఇబ్బందీ రాకుండా ఉండటంకోసం నిన్నటినుంచి కష్టపడి, రోడ్డు ఒక రోజు సమయంలో తయారు చేసారంటే వాళ్ళని మెచ్చుకోవాలి. డ్రైవర్ జాగ్రత్తగా ఆ కచ్చా రోడ్డు మీదనుంచి బస్సును తీసుకెళ్ళాడు. హమ్మయ్య! ఈ గండం గట్టెక్కింది అని అందరూ అనుకున్నాం. కానీ ఆ ఆనందం ఎక్కువసేపు ఉండలేదు. ఓ పది నిముషాలు ప్రయాణం చేసామో లేదో, ఇంకో చోట బస్ మళ్ళీ స్లో అయ్యింది. కారణం ఓ 30 మీటర్ల రోడ్డు కోసుకుపోయి, ఒక అఘాతం ఏర్పడింది. ఇంకా రిపేర్లు నడుస్తున్నాయి. మేం అంతా బస్ దిగి ఫోటోలు తీసుకున్నాం. ఓ అరగంట తరవాత, కొత్తగా వేసిన తాత్కాలిక రోడ్డు మీంచి బస్ వెళ్ళటానికి అనుమతి లభించింది. వెళ్ళటానికి ప్రమాదకరంగా ఉంది కాబట్టి, బస్ లోని





ప్రయాణీకులందర్నీ, ఆడవాళ్ళతో సహా, దింపేశారు. కుదుపులకి బస్ అటు ఇటు ఊగిపోతున్నా, డ్రైవర్ చాలా చాకచక్యంగా బస్సుని ఆవలికి చేర్చాడు. మేం అందరం జాగ్రత్తగా నడచుకుంటూ అవతలికి చేరి మళ్ళీ బస్ ఎక్కి కూర్చున్నాం.

ఈసారి బస్ ప్రయాణం కొంచెం సాఫీగానే సాగింది. దగ్గర దగ్గర రెండున్నర గంటల పాటు ఏ అడ్డంకులు లేకుండా బస్ వెళ్తూనే వుంది. మధ్యలో ఓచోట మాత్రం రిఫ్యూయలింగ్ మరియు వాష్ రూమ్ సౌకర్యం కోసం పది నిముషాలు ఆగాం.

కొండలు ఎక్కుతూ సాగిపోతూ, మన మానససరోవర యాత్రలో అన్నిటికన్నా ఎత్తైన పర్వత శిఖరం మీదకి చేరింది బస్సు. దీని ఎత్తు 5,120 మీటర్లు, అంటే సముద్ర మట్టం నుంచి 16,900 అడుగులు అనమాట. తలచుకుంటే వొళ్ళు గగుర్పొడుస్తోంది కదూ! టిబెట్ దేశయాత్రికులు ఇక్కడ ఆగి జండాలు కట్టి వెడతారు.

మధ్యాహ్నం 2 గంటల 30 నిముషాల ప్రాంతాల్లో టూరిస్ట్ బస్సులు అన్నీ ఒకచోట ఆగిపోయి కనపడ్డాయి. అక్కడ ఓ రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేస్తున్నారు. దాంతో వెహికిల్స్ వెళ్ళటానికి ఒక డైవర్షన్, అంటే ఒక తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసారు. నిజానికి అది రోడ్డు కాదు పొలాలు, ఖాళీ స్థలాల లోంచి దారి మళ్ళించారు. వర్షాలు బాగా పడుతున్నాయేమో, రోడ్డంతా కొంచెం బురదలాగా తయారయింది. మట్టి మెత్తగా ఉండటంతో చాలా బస్సుల టైర్లు మట్టిలో కూరుకుపోయాయి. డ్రైవర్ మా బస్ ఓ పక్కకి ఆపాడు. సమయం దొరికింది కదా అని మా అందరికీ ముందే ప్యాక్ చేయబడ్డ లంచ్ ఇచ్చారు. రెండు చపాతీలు, బంగాళాదుంప కూర, ఓ ఆపిల్ పండు, ఒక సాఫ్ట్ డ్రింక్ ( మాజా లాంటిది), వాటర్ బాటిల్ ఇచ్చారు. ఆ చల్లారిపోయిన చపాతీలు తినలేకపోయాం. ఏదో మమ అనిపించి, ఆ





పండు తిని, సాఫ్ట్ డ్రింక్ తాగాం. నైట్ హాల్ట్ ఉన్నప్పుడు భోజనం బాగుంటోంది కానీ, ఈ ప్రయాణాల మధ్యలో ఇచ్చే ప్యాక్ లంచ్ లతో కొంచెం కష్టమే. కానీ కైలాస మానససరోవరం లక్ష్యం ఒక్కసారి గుర్తు చేసుకోగానే, ఈ కష్టాలన్నీ 'హుష్.. కాకీ' అయిపోయాయి. లంచ్ అయిన తరువాత మా డ్రైవర్ బస్సును ఆ సాఫ్ట్ సాయిల్ (మెత్తటి బురదలాంటి మట్టి) లోంచి బస్ పోనిద్దామని చూసాడు. ఏముంది షరా మామూలే, మా బస్ టైర్లు కూడా మట్టిలో కూరుకుపోయాయి. ఇప్పుడు ఏ భారీ క్రేన్ లాంటిదో వచ్చి ఈ బురద లోంచి మా బస్సులను లాగితే కానీ, మేం ఎవ్వరం కదలలేము. ఓ పది పదిహేను బస్సులు అక్కడ నిలిచిపోయి ఉన్నాయి. అక్కడ దగ్గరలో రోడ్డు కనష్ట్రక్షన్ లో భారీ క్రేన్ ఉంది కానీ, అది వచ్చి హెల్ప్ చేయాలంటే పోలీసు జోక్యం అవసరం. ఎందుకంటే అవి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు చెందిన క్రేన్లు. ఈ పని గవర్నమెంట్ బాధ్యత.

యాత్రికులందరికీ విసుగు మొదలయ్యింది. షెర్పాలని పట్టుకుని ఏదో ఒకటి చేసి ఇక్కడనుండి బయటపడేయమని పీకేయడం మొదలుపెట్టారు. పాపం వాళ్ళూ నిస్సహాయులే. వాళ్ళంతా పరాయి దేశానికి(నేపాల్) చెందినవారు. ఏవైనా చెయ్యగలిగితే మా లయాజన్ ఏజెంట్ మాత్రమే చెయ్యాలి. అతను ఏదో ఫోన్లు చేస్తూ కనపడ్డాడు. ఈ విధంగా దగ్గర దగ్గర మూడు గంటలు అక్కడ ఉండిపోవలసివచ్చింది. ఎట్టకేలకు చైనీస్ గవర్నమెంట్ పోలీస్ ఆఫీసర్ల జోక్యంతో, క్రేన్ వచ్చి మా బస్ లన్నిటినీ బురదలోంచి బయటకు లాగింది. మళ్ళీ మా ప్రయాణం కొనసాగింది. అయిదు గంటలు పట్టే జర్నీ, పది గంటలయింది, సగం కూడా పూర్తి కాలేదు.

నెమ్మదిగా కొంచెం జల్లులు కూడా మొదలయ్యి వర్షం పెద్దది అవసాగింది. డ్రైవర్ చాలా జాగ్రత్తగా రాత్రి 8 గంటల ప్రాంతంలో మమ్మల్ని 'సాగా' పట్టణానికి చేర్చాడు. బస్ దిగి మాకు కేటాయించిన రూమ్ కీస్ తీసుకుని రూమ్ లోకి చేరాము. ఈసారి మాత్రం నలుగురిని ఒక రూములో పెట్టారు. హోటళ్ళు తక్కువ ఉండటంతో అందరు యాత్రికులకీ ఇలా '4- బెడ్' రూములే ఇస్తారు. హోటల్ ఆవరణలోనే ఉన్న 'మధుబన్' భోజనశాలకు వెళ్లి వేడి వేడి పదార్థాలతో వడ్డించిన భోజనం చేశాం. రూమ్ కి చేరి నిద్రకు ఉపక్రమించాం. సాగా ఊరు సముద్ర మట్టం నుంచి 4,640 మీటర్లు అంటే 15,220 అడుగుల ఎత్తులో ఉంది. కొంచెం ఆల్టిట్యూడ్ సిక్ నెస్ మొదలయిందా అనిపించింది. షెర్పాలు వచ్చి అందరికీ 'డయామాక్స్' మాత్రలు ఇచ్చి వేసుకోమన్నారు.

**(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)**

# పోడూరి శ్రీనివాసరావు




## మువ్వన్నెల రెపరెపలు

ఎగరాలి... ఎగరాలి... ఎంతో ఎత్తుకు మన జండా
ఆనందంతో ఉప్పొంగాలి... ప్రతి పౌరుని హృది నిండా ||ఎగరాలి||

నీలాకాశంలో మువ్వన్నెల జండా
విరాజిల్లుతోంది తన రెపరెపలతో
పలకరిస్తోంది యావద్భారతాన్ని ...
అఖండ భారతదేశాన్ని .....
ఆసేతు హిమాచలాన్ని .....
విజయ దరహాసంతో .......
విశృంఖల కాశ్మీర ప్రజానీకంతో .....
ప్రపంచమంతా విస్మయ దృక్కులతో .... ||ఎగరాలి||

ఎన్నాళ్ళకు చూస్తున్నాము
ఆనంద వీచికలు - కాశ్మీర బాలల్లో ....
ఆప్యాయతలు, అనురాగ భావనలు ....
భయకంపిత రాష్ట్ర ప్రజల్లో .....
భూన భోంతరాళాలు దద్దరిల్లేలా
స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటున్న
కాశ్మీర దేశప్రజల వదనారవిందాల్లో
ప్రస్ఫుటమౌతున్న ఆనంద డోలికలు ||ఎగరాలి||

ఆలకించండి పాక్ ప్రజల ఆర్తనాదాలు
విశ్వలోకపు వ్యతిరేక విధానాలు
వినిపించండి ప్రపంచ ప్రజల శాంతి సందేశాలు
వెలివేయండి ఉగ్రవాద సంఘ సాంప్రదాయాలు
ఎగురుతున్నాయి శాంతి కపోత సమూహాలు
జండా రెపరెపలతో సమానంగా రెక్కల టపటపలు
సమూహ ప్రజల ఆనంద కేళీ కలకలారావాలు
మధురంగా, మనోజ్ఞంగా వినిపిస్తున్న రవళులు ||ఎగరాలి||

ఉప్పొంగిపోతోంది భరతమాత హృదయం
ఒకే దేశం - ఒకే జండా నినాదంతో
యావద్భారతమంతా త్రివర్ణ పతాక రెపరెపలే
ఎర్రకోటలో ఎగురుతున్న త్రివర్ణ పతాక హొయలు
కవాతు చేస్తున్న వివిధ సాయుధ బలగాల కదం చప్పుళ్ళు
వివిధ శాఖల, రాష్ట్రాల శకటాల వర్ణ శోభితాలు
భారతదేశ అమ్ముల పొదిలో చోటు చేసుకున్న క్షిపణులు
వచ్చే సంవత్సరపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు చంద్ర గ్రహ మండలంపై ||ఎగరాలి||


# పాలెపు బుచ్చిరాజు




## మన మొట్టమొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ బాల్యం

రాజేంద్రబాబు బీహారు రాష్ట్రంలో సారన్ జిల్లాలోని 'జీరాదోయి' అనే గ్రామంలో 1884 వ సంవత్సరం డిశంబరు నెల మూడో తేదిన జన్మించాడు. ఆయన తండ్రిగారి పేరు మహాదేవ్ సహాయ్. ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు పుట్టిన తరవాత ఎనిమిదేళ్ళ అనంతరం కడగొట్టు వాడిగా పుట్టిన వాడు కావడంతో రాజేంద్రకి కుటుంబంలో అందరికంటే ఎక్కువ ప్రేమానురాగాలు లభించాయి. ఆ రోజుల్లో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ ఉండడంతో పెద్ద తాతగారు, వారి కుటుంబం, వీరి కుటుంబం అంతా కలిసే ఉండేవారు. అంతమంది కుటుంబ సభ్యుల్లో ఆఖరివాడిగా అల్లారు ముద్దుగా, అతి సుకుమారంగా, కోమల స్వభావం కలవాడిగా పెరిగాడు రాజేంద్ర బాబు. వారిది జమిందారీ కుటుంబం కావడంతో, తండ్రి మహాదేవ్ సహాయ్ ఉద్యోగం చేసే వాడు కాదు. ఊరి వారికి రోగాలు రోచ్చులు వచ్చినప్పుడు ఆయుర్వేద వైద్యం మాత్రం ఉచితంగా చేసి ప్రజా సేవ చేసేవాడు.

రాజేంద్రబాబుకి అయిదేళ్ళ వయసు వచ్చేక అక్షరాభ్యాసం చేయించి, ఇంటి దగ్గరే ఒక ఉపాధ్యాయుడిని పెట్టి రాయను, చదువను నేర్పించారు. ఉన్న ఊరిలో పాఠశాల లేకపోవడంతో, చదువు కోసం దగ్గరలో ఉన్న 'చప్రా' అనే ఊరికి



పంపవలసి వచ్చింది. ఆయన అన్నగారు మహేంద్ర ప్రసాద్ అప్పటికే అక్కడ రెండో క్లాసు చదువుతున్నాడు. రాజేంద్ర బాబుని అదే బడిలో ఎనిమిదో క్లాసులో చేర్పించారు. ఆ రోజుల్లో ప్రారంభ దశలో విద్యా విధానం అలాగే ఉండేది. ముందు ఎనిమిది, తరవాత ఏడూ, ఆ తర్వాత ఆరు, అలా ఒకటో క్లాసుకి వచ్చాక 'ఎంట్రన్సు' పరీక్ష రాస్తే 'ఎఫ్. ఎ' లో చేరవచ్చు. ఆ బడిలో అప్పుడు హిందీతో బాటు ఇంగ్లీషు కూడా నేర్పే వారు. ఈ ఇద్దరన్నదమ్ములు ఇంకా చిన్న వారు కాబట్టి, వారి చేతికి డబ్బు ఇచ్చే వారు కాదు. అలాగే వారు పొరుగూరిలో ఉండడానికి కావలసిన ఏర్పాట్లు కూడా చేయవలసి వచ్చింది. అందు కోసం ఒక ఇల్లు అద్దెకు తీసుకుని, అక్కడ వారికి వండి పెట్టడానికి ఒక నమ్మకస్తుడైన వంటవాడిని పెట్టారు అతనే వారి బాగోగులు కూడా చూస్తూ ఉండేవాడు. వారికి ఏం కావాలన్నా కొని ఇవ్వడమే తప్ప వారి చేతికి డబ్బు ముట్టేది కాదు. అలా చదువు కోసం, అంతమంది కుటుంబ సభ్యులమధ్య అల్లారుముద్దుగా పెరిగిన పిల్లలకి ఉన్న ఊరిని, కన్నవారిని, వదిలిపెట్టి ఉండడం ఒక పెద్ద తపస్సులా అనిపించేది.

మొదట్లో, రాజేంద్రకి ఈ కొత్త జీవితం అంతగా నచ్చేది కాదు. ఇష్టం వచ్చినప్పుడు పడుకుని, ఇష్టం వచ్చినప్పుడు లేచే




బాలుడికి ఇప్పుడు క్రమశిక్షణ పాటించవలసి వస్తోంది. సమయానుసారంగా పాఠశాలకి పోవలసి వస్తోంది. తన ఇల్లూ, అమ్మా, నాన్నా, పెద్ద తండ్రి, తాతగారు, అక్కలు అంతా గుర్తుకి వచ్చి రోజులు ఉదాసీనంగా గడిపేవాడు. అల్లాంటి సమయంలో పెద్దవాడు కాబట్టి అన్నగారు అతన్ని సముదాయించి, " అలా బాధ పడ కూడదు. మరి చదువుకోవాలంటే, ఆ మాత్రం త్యాగం చేయక తప్పదు. నన్ను చూడు. నీ కంటే ముందుగా వచ్చి ఇక్కడ ఉండడం లేదూ! ఇప్పుడైతే నీకు నేను తోడు ఉన్నాను. అప్పుడు నేను ఒక్కడినే! నాకూ బాధగానే ఉండేది. కాని అలవాటు పడ్డాను. " అని నచ్చజేప్పేవాడు. అది విని, రాజేంద్ర కొంత తృప్తి చెందేవాడు. సంవత్సరం అయ్యేసరికి పరీక్షలు వచ్చాయి. రాజేంద్ర ఎనిమిది, మహేంద్ర రెండు పరీక్షలు రాశారు. ఫలితాలు వచ్చిన రోజున మహేంద్ర రాజేంద్రని భుజాల మీద ఎక్కించుకుని నాట్యం చేయ సాగాడు. వంటవాడు అది చూసి ఆశ్చర్యపోయాడు. " తెలుసా! కాకా! మన రాజేంద్ర క్లాసులో అందరికంటే ప్రథముడిగావచ్చాడు. ప్రధానా చార్యులవారు మన రాజేంద్ర తెలివి తేటలకి మెచ్చుకుని, ఒకే సారిగా ఆరులోకి తీసుకున్నారు. అమ్మా, నాన్నా ఈ సంగతి తెలిస్తే ఎంతగా సంతోషిస్తారో!" అని చెప్పాడు మహేంద్ర. వంటవాడు కూడా బాబుని చాలా అభినందించి, ఆ రోజున పరమాన్నం, పూరీలు ప్రత్యేకంగా వండి తినిపించాడు. పరమాన్నం రాజేంద్రకి చాలా ఇష్టమైన వంటకం. వేసవి సెలవుల్లో పిల్లలిద్దరిని వెంటబెట్టుకుని, కాకా




జీరాదోయి వెళ్ళాడు.

వేసవి సెలవులు పూర్తి అయ్యాక, మళ్ళీచదువు కోసం వారు చప్రా వచ్చారు. ఆ సంవత్సరం మహేంద్ర ఎంట్రన్సు పాసవడంతో, పై చదువు కోసం పాట్నా వెళ్ళవలసి వచ్చింది. ఆ రోజుల్లో ఎఫ్. ఏ అక్కడే ఉండేది. చిన్నవాడు రాజేంద్ర ఒక్కడూ చప్రా లో ఉండలేడు కనుక, అతన్ని కూడా పాట్నాకి మార్చి, అక్కడ టి.కే. అకాడమీలో చదువుకి పెట్టారు. ఇక్కడ కూడా రాజేంద్ర అతి శ్రద్ధగా చదువుకుంటూ, రెండేళ్ళలో నాలుగో క్లాసుకి వచ్చాడు. అప్పటికి అన్నగారు ఎఫ్. ఏ పాసవడంతో బి. ఏ చదవడం కోసం కలకత్తా వెళ్ళ వలసి వచ్చింది. ఈ లోగా అతనికి పన్నెండు సంవత్సరాలు నిండాయి. అంటే పెళ్లీడు కొచ్చేశాడు. అది 1896 వ సంవత్సరం. బలియా జిల్లాకి చెందిన రాజవంశీదేవితో ఆయనకి వివాహం అయింది. ఒక సంవత్సరం అయ్యాక కోడలు అత్తారింటికి వచ్చింది.

అన్నగారు కలకత్తా వెళ్లిపోవడంతో, మళ్ళీ రాజేంద్ర చదువు సమస్యలో పడింది. పాట్నాలో ఒక్కడూ ఉండలేదు. చిన్నక్లాసులో చదువు కోసం కలకత్తా లాంటి పెద్ద పట్టణానికి పంపడం అనవసరం. కనుక రాజేంద్రని దగ్గరలో ఉన్న 'హతువా'లో బడిలో ప్రవేశ పెట్టారు. కాని ఈ బడిలో పెద్ద చిక్కు వచ్చిపడింది. ఇక్కడ చదువు అంతా చెప్పిన పాఠాలు వల్లె వేసి, తు.చ. తప్పకుండా మర్నాడు అప్పజెప్పడంలో ఉండేది. మన రాజేంద్రకి



అది నచ్చేది కాదు. ఆయనకి చక్కగా పాఠాలు చదివి అర్థం చేసుకుని తన స్వంత వాక్యాలలో రాసే వాడు. అది గురువులకి నచ్చేది కాదు. అక్కడికీ చాలా వరకు తాను మారాలని ప్రయత్నం చేశాడు. ఈ సందిగ్ధంలో రాజేంద్ర చదువు వెనక బడింది. ఆఖరికి ఆయన ఖాయిలా పడి బడి మానిపించే స్థితి వచ్చింది. ఇది బాగా లేదని, తండ్రిగారు మహదేవ్ సహాయ్ వంటవాడిని తోడు ఇచ్చి, ఆయన్ని మళ్ళీ చప్రాలో ఇదివరకు చదివిన బడిలోనే తిరిగి చేర్పించారు. ఈ విధానం అతనికి అలవాటయినదే కాబట్టి, శ్రద్ధగా చదివి రాజేంద్ర ఎంట్రన్సు పరీక్ష రాశాడు. ఆ పరీక్ష కలకత్తా విశ్వవిద్యాలయం నడుపుతుంది. దానిలో ఆయన సర్వ ప్రథముడుగా ఉత్తీర్ణుడయ్యాడు. ఆరోజుల్లో, బీహారు, బెంగాలు, ఒరిస్సా, అస్సాం, బర్మా కూడా కలకత్తా విశ్వవిద్యాలయం క్రిందే ఉండేవి. అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులతో పోటీ పడి, ప్రప్రథముడిగా రావడం మాటలు కాదు. ఆవిధంగా విజయం సాధించిన మొట్టమొదటి బిహారీ విద్యార్థి మన రాజేంద్ర. ఇది ఎంతో గౌరవ ప్రదమైన విషయం. అంత బాగా చదువుకుని పేరు సంపాదించిన కొడుకుని చూసి ఏ తండ్రి గర్వ పడకుండా ఉండగలడు! ఇంక, పైచదువులకి రాజేంద్ర



బాబు కలకత్తాలోనే ప్రెసిడెన్సీ కాలేజిలో చేరడానికి నిశ్చయించుకున్నాడు. ఆ విధంగా ఆయన 1902 వ సంవత్సరంలో కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజిలో ఎఫ్. ఏ. లో జాయినయ్యాడు. విశ్వవిద్యాలయంలో ప్రథముడిగా వచ్చినందుకు ఆయనకి ఆ రోజుల్లో నెలకు ఇరవై రూపాయలు, ఇంగ్లీషులో ప్రథముడిగా వచ్చినందుకు పది రూపాయలు ఉపకార వేతనం పొందాడు.

ఈ లోగా అన్నగారు మహేంద్ర బాబు అలహాబాదులో బి. ఏ. పూర్తి చేసి, ఎమ్మే చదవడానికి కలకత్తా వచ్చాడు. ఇప్పుడు కలకత్తాలో ఇద్దరూ 'ఏడెన్ హిందీ హాస్టల్' లో కలిసి ఉండ సాగారు. మన రాజేంద్ర బాబు చిన్నప్పటి నుంచీ సీదా సాదా మనిషి. భేషజాలు ఎరుగని వాడు. తను ఎప్పుడూ వేసుకునే కమీజు, షరాయి వేసుకుని, క్లాసులో మొదటి రోజు అడుగు పెట్టగానే అక్కడి దృశ్యం చూసి అదిరి పోయాడు. అక్కడి వాతావరణం చూశాక, తాను ఉన్నట్టుండి ఇంగ్లాండులో ఏదో కాలేజిలో ఉన్నానేమో అనే భ్రమకు లోనయ్యాడు. క్లాసులో సగానికి పైగా విద్యార్థులు సూటూ, బూటూ ధరించి తెల్లదొరల పిల్లల్లా కనబడ్డారు. కొందరు ముస్లిం బాలురు మాత్రం సంప్రదాయంగా పైజామా వేసుకుని, నెత్తిమీద టోపీలు పెట్టుకున్నారు. అంతలోనే తమాయించుకుని, బిడియ పడకుండా ఆ వాతావరణానికి అలవాటుపడి, క్రమంగా చదువు మీద శ్రద్ధ వహించాడు. సంవత్సరాంత పరీక్షల్లో మళ్ళీ అందరికంటే ప్రథముడిగా వచ్చాడు. అది ఆయనకి కొత్త కాదు. చిత్రమేమిటంటే, ఆయనకి లెక్కల్లోనూ, సైన్సులోను చాలా తక్కువ మార్కులు వచ్చాయి. కాని లాజిక్కులోను, ఇంగ్లీషులోనూ ఎక్కువ మార్కులు వచ్చాయి. ఆ కారణంగా పుస్తకాల రూపంలోనూ, ఉపకారవేతనం ద్వారా ధన రూపంలో-

నూను ఆయన్ని అదృష్టం మళ్ళీ వరించింది. అప్పటికి మహేంద్ర బాబు ఎమ్మే పూర్తి చేసి ఎల్. ఎల్. బి. చదువుతున్నాడు.

ఇలా ఎఫ్. ఏ పాసై, అన్నగారితో కలిసి వేసవి సెలవుల్లో వారి గ్రామం జీరాదొయి వెళ్ళినప్పుడు, వారిని గుర్రపు బగ్గిలో స్టేషను నుంచి ఇంటికి తీసుకురావడానికి ఊరు ఊరంతా తరలి వచ్చింది. అప్పటికాయన వయసు 18 – 19 సంవత్సరాలు. ఇల్లు చేరుకోగానే వందలాది ప్రజలు ఆయన్ని చూడడానికి వచ్చారు. ఎవరి నోట విన్నా ఒకటే మాట. 'రాజేంద్ర బాబు', 'రాజేంద్ర బాబు'. బీహారు నుంచి, కలకత్తా విశ్వ విద్యాలయంలో ఎంట్రన్సులోను, ఎఫ్. ఏ. లోను కూడా ప్రథముడిగా వచ్చిన మొట్ట మొదటి విద్యార్థి ఆయన. ఆ ప్రాంతం మంతా ఆయన్ని చూసి గర్వ పడింది.

తరవాత, 1904 లో కలకత్తా విశ్వవిద్యాలయంలోనే బి. ఏ. (ఆనర్సు) లో జాయిను అయ్యాడు రాజేంద్ర. ఇంగ్లీషు, సాహిత్యం, అర్ధ శాస్త్రం ఈ మూడింటిలో ఆనర్సు చదివాడు. అప్పట్లో బి. ఏ. (ఆనర్సు) అలా చదివిన వారు ఇద్దరే. రాజేంద్ర., ఆయన మిత్రుడు రామానుగ్రహ. డిగ్రీలో కూడా మంచి మార్కులు వచ్చినందుకు రాజేంద్ర.కి నెలకి, రూ 50/ లు, రూ 40/లు చొప్పున రెండు ఉపకార వేతనాలు



లభించాయి.

ఆ రోజుల్లోనే, కలకత్తాలో స్వామి వివేకానంద, అశుతోష్ ముఖర్జీల మిత్రుడు సతీష్ చంద్ర ముఖర్జీ 'డాన్ సొసైటి' ని స్థాపించాడు. దానిలో విద్యార్థులకి సభ్యత్వం ఉచితం. విద్యార్థులకి చదువులో సహకరించడం, వారికి దేశంలోని పరిస్థితుల మీద అవగాహన కల్పించడం, దేశసేవ చేసేందుకు వారిని ప్రోత్సహించడం ఆ సంస్థ ముఖ్యోద్దేశాలు. ఆ సంస్థ వారంలో రెండు సమావేశాలు ఏర్పాటు చేసేది. ఒకనాడు పెద్ద పెద్ద వారిని ఆహ్వానించి, వారిచేత ఉపన్యాసాలు ఇప్పించేవారు. వారిలో వివేకానందుని శిష్యురాలు సిస్టర్ నివేదిత, సతీష్ ముఖర్జీ, కాలేజి ప్రధానాచార్యుడు ఎన్. ఎన్. ఘోష్ వంటి వారి ప్రసంగాలు ఉండేవి. మరొకనాడు, గీతా పఠనం, గీత మీద ఉపన్యాసాలు ఉండేవి. దేశంలో ప్రముఖ విద్వాంసుల్ని ఆహ్వానించి ఆ ఉపన్యాసాలు ఇప్పించేవారు. ఈ ఉపన్యాసాలు విద్యార్థులకి పరీక్షల్లో ఉపయోగ పడడమే కాక, లోకజ్ఞానం అలవార్చుకోడానికి ఎంతో దోహదపడేవి.

అంతే కాక ఆ సంస్థ ఖాదీ బట్టలు, స్వదేశీ వస్తువులు అమ్మే రెండు దుకాణాలు కూడా నడిపేది. దానిని సొసైటీ సభ్యులే నడిపేవారు సాయంత్రం టైములో రెండు గంటల పాటు మాత్రం తెరిచి ఉంచేవారు. ఇంకా, ప్రతిభావంతులైన విద్యార్థుల్ని ప్రోత్సహించడానికి బహుమతులు కుడా ఇచ్చేవారు

మన రాజేంద్ర ఈ సంస్థలో సభ్యుడిగా చేరాడు. ఆ విధంగా చదువుతోబాటుగా సామాజిక సేవ, సభ్య సమాజం పట్ల బాధ్యత తెలిసి ప్రవర్తించడం అలవడ్డాయి. ఈ అనగాహన ఆయన జీవితంలో గొప్ప మార్పుని తీసుకు వచ్చింది. ఈ సమాజ సేవా కార్యక్రమాలు దేశ భక్తి ఆయన్ను రాజకీయాల వైపు ఆకర్షితుడిని చేశాయి. స్వాధీన సంగ్రామంలో పాలుపంచుకుని జైలుకి కూడా వెళ్ళాడు.

చిన్నతనంలోనే అంత కష్టపడుతూ కూడా నిష్ఠగా చదువుకున్నాడు కనుకనే ఆయన స్వాతంత్ర్య భారత దేశానికి మొట్టమొదటి రాష్ట్ర పతిగా ఎన్నిక అయ్యాడు. పూవుపుట్టగానే పరిమళించింది.

*********

# వేమూరి వేంకటేశ్వరరావు



## అంకెలు, సంఖ్యలు: మూడు

తెలుగులో మూడుకి సంబం-ధించిన మాటలు మూడొంతుల ముప్పాతిక వరకు సంస్కృతం నుండి దిగుమతి అయినవే అని అనిపిస్తుంది. తెలుగులో లేకపో-లేదు, కాని వాటి వాడకం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లడం లేదు, అంతే. ఆరు మూడైనా, మూడు ఆరైనా, “మూడు” లేకపోతే ఇటువంటి రాతలు చదవ బుద్ధి కాదు కనుక మూడు నిమిషాల పాటు అ మూడేదో తెచ్చుకుని ఈ తరువాయి చదవండి.

ముప్పావలా అంటే మూడు పావులాలు. మువ్వన్నె అంటే మూడు రంగులు. మువ్వురు అంటే ముగ్గురు. మువ్వంద అంటే మూడు వందలుట. ఇక్కడ ఏదో సంధి సూత్రం పని చేస్తూ ఉండి ఉండాలి కాని లేకపోతే .... ఎలా సాధ్యం అవుతుంది?

ముప్పేటలో మూడు పేటలుంటే ఉన్నాయేమో కాని ముప్పేట కాయ అంటే మూడు పాళ్ళు ముదిరి ఇంకా ఒక పాలు లేతగా ఉన్న కొబ్బరికాయ. ముక్కంటి అంటే మూడు కన్నులు కలవాడు శివుడు; కలది కొబ్బరికాయ. విశాఖపట్నం జిల్లాలో ముచ్చిలక అనే మాటని ముప్పాతిక అనే అర్థంలో వాడడం నేను చూసేను.



కాని నిఘంటువులో ముచ్చిలక అంటే భూస్వామి, కౌలుదారుల మధ్య ఖరారునామా అనే అర్థం ఒక్కటే ఉంది. ఇదే నిజమైన పక్షంలో ముచ్చిలకకీ, మూడుకీ మధ్యనున్న బాదరాయణ సం-బంధమేమిటో?

ముమ్మారు అన్నా ముమ్మిడి అన్నా మూడు సార్లు అని అర్థం కదా, మరి ముమ్మిడివరం అంటే మూడు సార్లు వరం అని అర్థమా? దేవుడి దగ్గర మూడు వరాలు పుచ్చుకుందికేనేమో ముమ్ముడివరంలో బాలయోగి వెలిసేడు.

ముప్పది అంటే మూడు పదులు, వెరసి ముప్పయ్. అలాగే ముయ్యేడు అంటే మూడు ఏళ్ళు వెరసి ఇరవై ఒకటి. మున్నూరు 300 అయినట్లే మూడు మూళ్ళు తొమ్మిది కాస్తా ముమ్మాడు అవుతుందన్నది ముమ్మాటికీ నిజం.

మనిషిని పోలిన మనిషి కనిపి-స్తే “ముమ్మూర్తులా మీ పోలికే!” అంటాం.

మార్గశిర శుద్ధ ఏకాదశి నాడు తిరుపతిలో స్వామి పుష్కరిణిలో మూడుకోట్ల తీర్థములు వస్తు-న్నవనే ఐతిహ్యం కారణంగా ఆ రోజుని ముక్కోటి ఏకాదశి అంటారు.

ఈ పైన చెప్పిన ఉదాహర-ణలన్నిటినీ వ్యాకరణంలో ఒక్క

సూత్రంతో టూకీగా చెప్పెయ్యొచ్చు.

**"సమవాధికరణంబగు ఉత్తర పదంబు పరంబగునప్పుడు మూడు శబ్దమున డువర్ణంబునకు లోపంబును, మీది హల్లునకు ద్విత్వంబును అగు".**

కనుక మూడు + లోకములు = ముల్లోకములు. ఇదే విధంగా ముప్పాతిక, ముప్విధం, ముక్కాలి పీట, ముత్తాత, ముజ్జగము, మొదలగునవి.

వ్యాకరణంలో ముఖ్యమైన సంధి త్రిక సంధి. ఈ సందర్భంలో అ, ఇ, ఎ అనే అక్షరాలని త్రికం అంటారు.

ముయ్యంచు అంటే త్రిభుజం అని ఎంతమందికి తెలుసు? ఈ త్రిభుజాన్ని త్రికోణి అని కూడ అంటారు.

"త్రి"తో మొదలయే సంస్కృతం మాటలు తెలుగులో కొల్లలు. త్రిమూర్తులు, త్రిలోకములు మనకు తెలిసున్నవే. ఆయుర్వేదంలో సొంఠి, పిప్పలి, మిరియాలని త్రికటుకాలనిన్నీ; కరక, తాడి, ఉసిరికలని త్రిఫలాలనిన్నీ; వాత, పిత్త, శ్లేష్మాలని త్రిదోషాలనిన్నీ అంటారు. వ్యాకరణంలో మాత్రం త్రిదోషాలంటే పద, వాక్య, అర్థ దోషాలు.

"ట్రిగొనామెట్రి" అన్న మాటని త్రి, గుణ, మాత్ర అని మూడు మాటలుగా విడగొట్టి "మూడు గుణాలని (సైను, కోసైను, టేంజెంటు) కొలిచే శాస్త్రం" అని అన్వయం చెప్పొచ్చు.




త్రిశూలం త్రినేత్రుడి ఆయుధాలలో ఒకటి. త్రిదండం అనేది మనోదండం, వాగ్దండం, కర్మదండం అనబడే మూడు వెదురు బద్దలతో కట్టిన దండం. శైవులు నుదుటి మీద అడ్డుగా పెట్టుకునే విభూతి పెండికట్లని త్రిపుండ్రం అంటే వైష్ణవులు నిలువుగా పెట్టుకునే బొట్టుని ఊర్ధ్వపుండ్రం అంటారు.


బ్రహ్మపదార్థము సగుణబ్రహ్మము, నిర్గుణబ్రహ్మము అని రెండు రకాలే అయినా సగుణబ్రహ్మము మాత్రం త్రికాలాలలోనూ త్రిగుణాత్మకం (సత్వ, రజో, తమో గుణాలు) అని త్రిమతాచార్యులైన శంకర, రామానుజ, మధ్వాచార్యులు ఏకీభవించేరు.

మనస్సులో అనుకున్నది ఒకటి, నోటితో చెప్పేది మరొకటి, చేత్తో చేసేది ఇంకొకటి అయితే ఆ పనిలో త్రికరణశుద్ధి లేదు.

"త్రి" అన్న అక్షరం మాటకి మొదట వచ్చినట్లే మూడుని సూచించడానికి "త్రయం" అన్న తోక సర్వసాధారణంగా మాటకి చివర వస్తుంది - త్రిమూర్తులలో ఒకడైన శివుడిని "త్ర్యంబకుడు" అన్నప్పుడు తప్ప. భారతాన్ని తెలిగించిన నన్నయ, తిక్కన, ఎర్రనలు కవిత్రయం.

అవస్థా త్రయంలో ఒంటి మీద తెలివి ఉన్న పరిస్థితిని జాగ్రదావస్థ అనిన్నీ, తెలివి తప్పిన తర్వాత నిద్రావస్థ అనిన్నీ, కలలు కనే సమయాన్ని స్వప్నావస్థ అనిన్నీ లేదా సుషుప్తావస్థ అనిన్నీ అంటారు. ఈ సుషుప్తావస్థ గురించి మనకి అనాది నుండి తెలుసుకానీ, ఈ దృగ్విషయం ("ఫినామినన్") పాశ్చాత్యులకి ఈ మధ్యనే అవగాహన అయింది. దీనినే వీళ్ళు "రెం స్లీప్" అంటారు.

సులభంగా అర్థం అయే కవిత్వం ద్రాక్షాపాకం, కొంచెం



కష్టపడితే కాని అర్థం కాకపోతే అది కదళీపాకం, బొత్తిగా కొరుకుడు పడనిది నారికేళపాకం. ఈ మూడింటిని గుమ్మగుచ్చి పాకత్రయం అంటారు. ఇలాగే ఈషణత్రయం అని ఒకటుంది. నారేషణ అంటే ఆడదాని యందు ఆశ. పుత్రేషణ అంటే కొడుకు పుట్టాలనే కోరిక, ధనేషణ అంటే డబ్బు కోసం తాపత్రయం. "తాపత్రయం" అన్న మాటకి అసలు అర్థం ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అయినప్పటికీ ఆ విషయాన్ని విస్మరించి మనకి తోచిన విధంగా వాడేయడానికి ఊరికే తాపత్రయ పడిపోతూ ఉంటాం.

మంత్రత్రయం (అష్టాక్షరి, ద్వయం, చరమశ్లోకం) లోని ద్వయం గురించి గతంలో ముచ్చటించేను. ఇక, "ఓం నమో నారాయణాయ" అన్నది అష్టాక్షరి. చరమశ్లోకం గురించి ఆఖర్న చెబుతాను.

కాళహస్తి, ద్రాక్షారామం, శ్రీశైలం ఉన్న త్రిలింగ దేశమే తెలుగు దేశం అని అంటారు కానీ రాజమండ్రి దగ్గర ఉన్న కోటిలింగాలని లెక్కపెట్టడం మరిచిపోయారా, ఏమిటి?

"త్రయం"కి ఇంగ్లీషులో సమానార్థకం "ట్రిపుల్" లేదా "ట్రయొ". ఇంగ్లీషులోని "ట్రై", "ట్రి"లు తెలుగులోని "త్రి" జ్ఞాతులు కనుక "ట్రై ఏంగిల్" అన్న మాటకి సరి



అయిన తెలుగు "త్రికోణం" లేదా "త్రికోణి."

ఇదే బాణీలో ముయ్యాకు అంటే మూడాకుల దళం అని అర్థం. ఏ మూడాకుల దళాన్నైనా ఇంగ్లీషులో "ట్రైఫోలియేట్" అంటారు. "ట్రైడెంట్" అంటే "మూడు దంతాలు ఉన్నది" అనే అర్థం స్ఫురించినా ఇంగ్లీషులోనూ తెలుగులోనూ ఇది మూడు పళ్ళు ఉన్న త్రిశూలం. కనుక ఇక్కడ "పన్ను" నోటిలోనిది కాదు; శూలం లోని ములుకు.

క్లోరోఫారం యొక్క రసాయన నామం అయిన "ట్రైక్లోరో మెతేన్"ని "త్రిహరిత పాడేను" అని నేను



తెలిగించేను. దీని వ్యుత్పత్తి కావలసిన వారు నేను రాసిన "నిత్య-జీవితంలో రసాయన శాస్త్రం" పుస్తకం చదవండి.

త్రిశంకు స్వర్గం, త్రిశంకు చక్కెర మొదలైన మాటలలోని "త్రి" కీ, మూడుకీ ఏమీ సంబంధం లేదని మనవి చేసుకుంటున్నాను. ఇంతకీ త్రిశంకు చక్కెర ఏమిటా అని ఆరాట పడకండి. అది "ఇన్వర్ట్ సుగర్" అన్న మాటకి నా తెలుగుసేత. దీని వృత్తాంతం కూడ "నిత్యజీవితంలో ...." లో ఉంది.

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో జరిగే పరీక్షలలో పరీక్షని పర్యవేక్షించే వ్యక్తి ("వాచరు") ముక్కాలిపీట మీద కూర్చునేవాడుట. అందుకనే ఈ పరీక్షలని "ట్రైపోస్" అనేవారు.

పాశ్చాత్యుల ప్రస్తావన ఎలాగూ వచ్చింది కనుక ఒక చిన్న పిట్టకథ చెబుతాను. రాజకీయాలలో మనం మన దేశాన్ని కుల వర్గాలుగా విడగొట్టినట్లే పూర్వం రోం సామ్రాజ్యాన్ని రోమను, సెబీను, ఆల్బను అని మూడు కుల వర్గాలుగా విడగొట్టేరు. లేటిన్ లో

“ట్రైఅస్” అంటే మూడో వంతు కనుక ఈ కుల వర్గాలని వారు “ట్రైబ్” అన్నారు. రాజాస్థానానికి వచ్చే రాబడిలో మూడో వంతు ప్రతి “ట్రైబ్” నుండి వస్తోంది కనుక ఆయా కుల వర్గాలు కట్టే పన్నుని “ట్రిబ్యూట్” అన్నారు. “కంట్రిబ్యూషన్” అన్న మాట ఇందులోంచి వచ్చినదే. ఉప-నదిని “ట్రిబ్యూటరీ” అనడానికి కూడ కారణం ఇదే - నదిలోని నీటిని “కంట్రిబ్యూట్” చేస్తున్నాది కనుక!

రెండు పేటల దారంతో నేసిన బట్టని “ట్విల్” అన్నట్లే, మూడు పేటల దారంతో నేసిన బట్ట “డ్రిల్” బట్ట. ముప్పిరి అంటే మూడు పేటలు కనుక “డ్రిల్లు” బట్టని ముప్పిరి బట్ట అనొచ్చు. “త్రిమితీయ” అన్న ప్రత్యయాన్ని “త్రీ డిమెన్షనల్” అన్న అర్థంలో వాడుతున్నారు కొందరు.

ఒక సంఖ్యని 3 చేత భాగించగ-లమా లేమా అని సంశయం వస్తే ఆ సంఖ్యలోని అంకెలని అన్నిం-టిని కలిపి ఆ మొత్తాన్ని మూడు చేత భాగించి చూడండి. ఈ మొ-త్తాన్ని 3 చేత భాగించ గలిగితే ఆ సంఖ్యనీ భాగించగలం. ఉదాహ-రణకి 531 లోని అంకెల మొత్తం 5 + 3 + 1 = 9. ఈ 9 ని 3 చేత భా-గించగలం కనుక 531 నీ భాగిం-చగలం.

వృత్తలేఖిని, కొలబద్ద సహాయంతో ఒక గీతని కాని, కోణాన్ని కాని సమద్విఖండన చేయవచ్చని రేఖాగణితంలో దిట్టలయిన గ్రీకులు ఎప్పుడో కను-క్కున్నారు కానీ ఒక కోణాన్ని “ట్రైసెక్ట్” (సమత్రిఖండన) చెయ్యడం ఎలాగో వాళ్ళకి తెలియలేదు. ఈ పని చెయ్యడం అసంభవం అన్న విషయం మనకి ఇప్పటి కాలంలోనే అర్థం అయింది!



భూగర్భశాస్త్రంలో “మూడవ, తృతీయ” అన్న అర్థం రావలసి-నప్పుడల్లా “టెర్షియరీ, ట్రయాసిక్” అనే పూర్వప్రత్యయాలు వాడతారు.

“ట”మాషా ఏమిటంటే ఇంగ్లీషులో ట కార త కారాలకి ఒకే ఒక అక్షరం ఉన్నా భాష ఉచ్చారణలో ట కార త కారాలతో మొదలయే “మూడు” మాటలు చాల ఉన్నాయి. కాని తెలుగులో ట కార త కారాలకి విడివిడి అక్ష-రాలు ఉన్నా ట కారంతో "మూడు" మాటలు తెలుగులో లేవు.



రెండు రోడ్ల కూడలిని కూడలి కిందే లెక్కించరు, ఎందుకంటే రోడ్డు మీద ఎక్కడ నిలబడ్డా, ముందున్న రోడ్డు, వెనకున్న రోడ్డు కలిపి రెండు రోడ్ల కింద లెక్క లోకి వస్తుంది. కానీ మూడు రోడ్ల కూడలిని లేటిన్ లో “ట్రివియం” అంటారు. ఈ రకం కూడలిలో కూర్చుని ప్రజలు పనికిమాలిన కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసేవారుట. మన దేశంలో ఇప్ప-టికీ ఇలా చొల్లు కబుర్లు చెప్పు-కుంటూ కానాల మీద కూర్చుని కాలక్షేపం చేసేవారు కనిపిస్తూనే ఉంటారు. ఇటువంటి “ట్రివియల్” కబుర్లు చెప్పి మీ కాలం వృధా చెయ్యడం నాకు ఇష్టం లేదు కనుక, ప్రస్తుతానికి ఈ బాతాకానీ ఆపుతాను.

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

"సమయం ఒంటిగంట అయింది, భోజనం చేద్దురుగాని లేవండి" అని పిలిచింది పార్వతమ్మగారు.

రవి, అవినాశ్ వాష్రూంకి వెళ్ళారు. కృష్ణమోహన్ ఒంటరిగా వుండడం చూసి "నేను మీకన్నా చిన్నదాన్ని అందుచేత మీరు నన్ను "మీరు" అని సంభోదించకండి నాకు ఇబ్బందిగా వుంది. ఇంకొక విషయం మిమ్మల్ని అందరూ "మోహన్" అని పిలుస్తారని క్రిందటి ఆదివారం మా ఇంటికి వచ్చినపుడు మాటలలో చెప్పారు, మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని "కృష్ణా" అని పిలుస్తాను ప్లీజ్" అంది అనూరాధ.

"నో ప్రోబ్లం, కానీ రెండు షరతులు. ఒకటి నన్ను నువ్వు అని సంభోదించాలి, రెండు నేను నిన్ను అందరూ పిలిచినట్లు "అనూ" అని కాకుండా "రాధా" అని పిలుస్తాను సరేనా" అన్నాడు కృష్ణమోహన్.

"అలాగే పిలవండి, సారీ పిలువు. నువ్వు చెప్పినట్లుగానే నిన్ను సంభోదిస్తాను, థాంక్యూ"అంటూ అతని కళ్ళలోకి సూటిగా చూసింది అనూరాధ. కృష్ణమోహన్ ఆ చూపులకి కొంచెం బిడియపడ్డాడు. పిల్లలందరికీ భోజనం వడ్డించి అనూరాధ, పార్వతమ్మగారూ తరువాత తిందామనుకున్నారు. అది గమనించిన కృష్ణమోహన్ "అత్తయ్యగారూ మీకు, రాధ కి కూడా వడ్డించుకోండి, అందరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దాము" అన్నాడు.

"వద్దులే మోహన్ మీకు వడ్డించటం కష్టం అవుతుంది, మేము తర్వాత తింటాము" అంది పార్వతమ్మగారు.

"ఏం పరవాలేదు దొడ్డమ్మగారూ, మేము కూడా వడ్డిస్తాము అందరం సరదగా తిందాము" అని అవినాశ్ లేచి రెండు కంచాలు వేసి మంచి నీళ్ళు పెట్టాడు. అతని కలుపుగోలుతనం చూసి పార్వతమ్మగారు ముచ్చటపడి.."ఇతనిని చూస్తే ముచ్చటగా వుంది, మా రవిలాగానే తొందరగా కలిసిపోతాడు, కొత్త లేదు" అంది.

కృష్ణమోహన్కి భోజనం చేసేటప్పుడు ఒక అలవాటు వుంది అదేమిటంటే వంటకాలలో వచ్చే కరివేపాకు, కొత్తిమిరి, మిరపకాయలు, పోపు వగైరా తినడు, అవి పక్కన పెట్టేస్తాడు. ఇంట్లో, హాస్టల్లో ఒకఖాళీ ప్లేట్ వుంచుకొని అందులో వేస్తాడు. ఇక్కడ అలా చెయ్యటానికి మొహమాట పడ్డాడు, అందుకని అవన్నీ కంచంలో ఒక మూల పెట్టాడు. వాటి పరిణామం తింటున్న కొలదీ పెరుగుతున్నాది, ఇదంతా గమనించిన అనూరాధ భోజనం మధ్యలో లేచింది.

"ఏమైందే మధ్యలో లేచావు" అని అడిగారు పార్వతమ్మగారు.

"ఏమీ లేదు ఇప్పుడే వస్తున్నాను వుండు" అని చెప్పి వంటింట్లోకి వెళ్ళి ఒక ఖాళీ ప్లేట్ తీసుకొచ్చి కృష్ణమోహన్ కంచం ప్రక్కన పెట్టింది.

"థాంక్యూ రాధా" అన్నాడు కృష్ణమోహన్.

*****************

భోజనాలయిన తరువాత సినిమాకి వెళదామన్నాడు రవి. దానికి అవినాశ్ వంత పాడాడు. వాణి తలనొప్పిగా వుంది తను రానని చెప్పింది, సతీష్ తనకి క్రికెట్ మ్యాచ్ వుంది రానన్నాడు. ఇక మిగిలింది పార్వతమ్మగారు ఆవిడ తనకి సినిమాలు ఇంట్రెస్ట్ లేదు రానన్నారు.

"ఈ సారి ఎప్పుడైనా వెళదాము, వచ్చే వారం క్రికెట్ మ్యాచ్ వుంది వెళ్ళి కాస్త ప్రాక్టీస్ చేసుకుందాము

అవీ" అన్నాడు కృష్ణమోహన్.

"నువ్వు క్రికెట్ ఆడతావా" అని అడిగింది అనూరాధ.

"అనూ బావ మా కాలెజ్ కేప్టన్, మంచి బెట్సుమెన్, ఆఫ్ స్పిన్ బౌలర్, మా కాలెజ్ విశ్వనాథ్" అన్నాడు అవినాశ్.

"అబ్బో మీ బావ మాంచి స్పోర్ట్సు మేన్ అన్న మాట, మ్యాచ్ ఇంకా వారం రోజులు తరువాత కదా, పరవాలేదు ప్రాక్టీస్ చేసుకోడానికి కావలసినంత వ్యవధి వుంది అందుకని ఇవాళ సినిమాకి వెళ దాము" అంది అనూరాధ.

"అవును బావా నువ్వు ఇవాళ వస్తావు, ప్రేమ్నగర్ సినిమాకి వెళదామని నేను, అనూ నాలుగు రోజులనుండి ఎదు రు చూస్తున్నాము. నువ్వు కాదంటే మాకు నిరుత్సాహం కలుగుతుంది" అన్నాడు రవి. అనూరాధ కూడా "ప్లీజ్" అన్నట్లుగా మొహం పెట్టింది.

"సరే వెళదాము, అక్కడనుండి మేము నేరుగా హాస్టల్కి వెళతా ము" అన్నాడు కృష్ణమోహన్.

"ఆ సంగతి మాకు తెలియదు, మీరు రాత్రికి కూడా ఇక్కడ భోజ నం చేస్తారని ప్రిపరేషన్లో వుంది అమ్మ, మీరు రాకపోతే అమ్మకి చెప్పండి" అంది అనూరాధ.

"భలే ఇరికించావు" అన్నాడు కృష్ణమోహన్...జాగ్రత్త అని సరదాగా వేలు చూపించింది అనూరాధ.

ఇంతలో సతీష్ వచ్చి కృష్ణమోహ న్తో "బావా వచ్చే వారం నువ్వు క్రికెట్ మ్యాచ్ ఆడతావట నేను ఆ మ్యాచ్ చూస్తాను" అన్నాడు.

"అలాగే నువ్వు అన్నయ్య రండి" అన్నాడు కృష్ణమోహన్.

"అంటే నన్ను రావద్దనేగా అర్థం" అంది అనూరాధ.

"ఏయ్ రాక్షసీ, నీ లాజిక్కులు ఆపు, అక్కడ ఇంజినీరింగ్ కాలేజీలో అంతా మగపిల్లలు వుంటారు, నీకు ఇబ్బందిగా వుంటుందని బహుశా బావ నిన్ను రమ్మనలేదు, అర్థం చేసుకో" అన్నాడు రవి.

"పరవాలేదు తనని కూడా తీసుకు రా, ఈసారి మెడికల్ కాలేజి గ్రౌండ్లో మెడికల్ కాలేజి టీంతో మ్యాచ్ అవుతుంది. ఆ కాలేజి అమ్మాయిలు చాలా మంది వుంటారు, రాధకి ఇబ్బంది వుండదు. అయితే ఉదయం తొమ్మిదికే మ్యాచ్ మొదలవుతుంది, మీరు నేరుగా మెడికల్ కాలేజి గ్రౌండ్కి వచ్చేయండి. మధ్యాహ్నం అక్కడే లంచ్ చేద్దురుగాని, మీరు వచ్చేసరికి నేను డ్రెస్సింగ్ రూంలో వుంటాను, అవినాశ్ మీ కోసం ఎదురు చూస్తూ వుంటాడు"

"అదేమిటి అవినాశ్ అన్నయ్య ఆడడా" అడిగాడు సతీష్.

"లేదు, నాకు క్రికెట్ అంటే ఇంట రెస్ట్ లేదు, నేను వాలీబాల్ ఆడతాను"

"థాంక్యూ కృష్ణా" అని కృష్ణమోహ న్తో అంటూ అతని కళ్ళలోకి మళ్ళీ సూటిగా చూసింది అనూరాధ.

అయితే ఈ సారి కృష్ణమోహన్ కూడా ఆమె కళ్ళలోకి చూస్తూ "సంతోషమేనా?" అని అడిగాడు. అనూరాధ ముసిముసి నవ్వులు నవ్వుతూ సిగ్గు పడుతూ తలదిం చుకుంది.

సినిమాకి బయలుదేరి వెళ్ళారు. అక్కడ హాలులో కార్నర్ సీట్ రాకపోవడంతో ఒక చివర రవి, రెండో చివర అవినాశ్, మధ్యలో కృష్ణమోహన్ అనూరాధ కూర్చు న్నారు.

సినిమా చూస్తున్నపుడు మధ్యలో అనూరాధ శరీరం తగులుతున్నాది, దానితో కృష్ణ మోహన్ కొంచెం ఇబ్బందిగా ఫీల్ అవుతూ అవినాశ్ ప్రక్క ఒరిగి కూర్చున్నాడు.

అతని ఇబ్బంది గమనించి అవినాశ్ అతని చెవిలో "బావా రిలాక్స్" అని మెల్లిగా అన్నాడు. అనూరాధ మాత్రం అలాంటివి ఏమీ లేకుండా సినిమాని ఎంజాయి చేస్తున్నాది. ఇంట్రవల్ అయింది, బయటకి వెళ్ళి కాస్సేపు రిలాక్స్ అవుదాము అనుకున్నాడు కృష్ణమోహన్. ఈ లోపల రవి లేచి "బావా నువ్వు, అనూ కూర్చోండి నేను, అవినాశ్ వెళ్ళి పాప్కార్న్, కాఫీ తీసుకు వస్తాము" అన్నాడు.

"పరవాలేదు నేనూ వస్తాను" అన్నాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ ఒంటరిగా వుండి అనూతో మాట్లాడితే ఆ బిడియం, బెరుకుతనం తగ్గి ఫ్రీగా వుంటాడనే ఉద్దేశ్యంతో..."అనూ ఒక్కర్తే అయిపోతుంది తనకి బోర్ కొడుతుంది, మీరిద్దరూ కబుర్లు చెబుతూ వుండండి బావ ఐదు నిమిషాలలో వస్తాము" అన్నాడు అవినాశ్.

రవి, అవినాశ్ బయటకి వెళ్ళిన తరువాత "బావా సిగ్గేస్తుందా" అని అతనికి మాత్రమే వినబడేటట్లు

అడిగింది అనూరాధ. ఆ మాట విన్నాక తను పడుతున్న అవస్థ అంతా రాధకి తెలుసన్నమాట, అందుకే ఇప్పుడు బావా అని పిలిచి ఇంకా ఆట పట్టిస్తున్నాది అనుకున్నాడు కృష్ణమోహన్.

"రాధా ఎమిటి ఈ కొంటెతనం, నా అవస్థ చూసి నీకు ఆటగా వుందా? ఆ పిలుపు ఏమిటి మీ అన్నయ్య వింటే ఎలా అర్థం చేసుకుంటాడు? దయచేసి నన్ను అలా పిలవకు" వేడుకోలుగా అన్నాడు.

"ఏం ఎందుకు పిలవకూడదు, మా వైదేహి వదినకి నువ్వు తమ్ముడివి గనుక మా నాన్నగారు నీకు మామయ్య వరస కాదా? మా అమ్మ నీకు అత్తయ్య వరస కదా? నువ్వు నాకు బావ వరస కాదా? రవి అలాగే పిలుస్తున్నాడు కదా, మరి నేను పిలిస్తే తప్పేమిటి?" అని అడిగింది.

కృష్ణమోహన్ నోట్లో వెలక్కాయ పడినట్లయింది, ఆమె తర్కానికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక "అవన్నీ నాకు తెలియదు, నువ్వు మాత్రం నన్ను "బావా" అని పిలవద్దు, "కృష్ణా" అని పిలువు" అన్నాడు.

"ఊహు నేను "బావా" అనే పిలుస్తాను, బావా బావా పన్నీరు బావని పట్టుకు తన్నారు" అని ఇంకా ఆట పట్టించింది.

కృష్ణమోహన్కి ఏం చెయ్యాలో అర్థం కాక అనూరాధ చేతులు పట్టుకొని "రాధా ప్లీజ్ నన్ను అల్లరి పెట్టకు" అన్నాడు.

"బావా సినిమాకి వచ్చి ప్రక్కన కూర్చున్న దగ్గర నుండి నేను తగిలితే చాలు సిగ్గుతో ముడుచుకుపోయి అటు అవినాశ్ ప్రక్క ఒదిగి పోతున్నావు, అలాంటిది ఇప్పుడు నా చేతులు పట్టుకున్నావు మరి ఇప్పుడు నీ బెరుకుతనం, సిగ్గు ఏమైంది?" అని అడిగింది.

వెంటనే ఆమె చేతులు విడిచిపెట్టి "ఐ యాం సారీ" అన్నాడు.

"బావా సినిమాలలో అమోల్పాలేకర్లా నువ్వు ఆడపిల్లలతో మాట్లాడటానికి ఎందుకంత బిడియం బెరుకుతనం, వాళ్ళు నీలాంటి మనుషులే అందుకని ముందు ఫ్రీగా వుండు. నన్ను తగిలితే నీ బ్రహ్మచర్యానికి ఏమీ భంగం కలగదు, లేదా నేను నీ గురించి చెడుగా అనుకోను. ఈ రోజుల్లో ఆడ మగా కలిసి వుద్యోగాలు చెయ్యడమే కాదు, చంద్రగ్రహానికి కూడా వెళుతున్నారు ... నీకో కమినహాయింపు ఇస్తున్నాను, అందరి ముందు నిన్ను బావా అని పిలవను" అంది అనూరాధ.

"అయ్య బాబోయ్ ఏమో అనుకున్నాను నువ్వు చాలా తెలివైనదానివి, ఇందాక రాత్రి భోజనాలగురించి అత్తయ్య పేరు చెప్పి నోరు మూయించావు, ఇప్పుడు నన్ను ఇలా ఇరికిస్తున్నావు. నీ వ్యవహారం చూస్తూ వుంటే సినిమాలలో జయచిత్ర గుర్తుకొస్తున్నాది" అన్నాడు కృష్ణమోహన్.

"నీ కృష్ణమాయ ముందు మేమెంత?" అని చమత్కారంగా జవాబిచ్చింది అనూరాధ. ఆ మాటకి ఇద్దరూ నవ్వుకున్నారు, ఇంతలో రవి, అవినాశ్ వచ్చారు.

సినిమా మళ్ళీ ప్రారంభమయింది, నలుగురూ కాఫీ తాగుతూ పాప్కార్న తింటూ సినిమా ఎంజాయ్ చేస్తున్నారు. కృష్ణమోహన్ ముందుగా తన పేకట్లో పాప్కార్న తినటం పూర్తి చేసాడు, అది చూసి అనూరాధ అతనికి తన పేకట్లో పాప్కార్న ఆఫర్ చేసింది, కృష్ణమోహన్ వద్దన్నాడు. అనురాధ అతనికి దగ్గరగా వచ్చి "ప్లీజ్ తిను బావా" అని అతనికి మాత్రమే వినిపించేటట్టు అంది. అంతే! అతను మారు మాట్లాడకుండా తినేసాడు, అనురాధ పకపకా నవ్వింది.

"ఏమైందే అలా నవ్వుతున్నావు" అని అడిగాడు రవి.

"సినిమాలో డైలాగ్ విని" అని టక్కున సమాధానం ఇచ్చింది అనూరాధ. అది విని కృష్ణమోహన్ "ఈ అమ్మాయి చాలా చురుకైనది, సమయస్ఫూర్తి చాలా ఎక్కువ" అనుకున్నాడు.

సినిమా అయిపోయి హాలు బయటకి వచ్చాక "బావా నేను జగన్నాధపురంలో మునసబుగారి తూము దగ్గర మా నాన్నగారి స్నేహితుడి ఇంటికి వెళ్ళి అక్కడే భోజనం చేసి డైరెక్టుగా హాస్టల్కి వస్తాను, నువ్వు భోజనం చేసి హాస్టల్కి వచ్చేయి" అని కృష్ణమోహన్తో చెప్పాడు అవినాశ్.

"అదేమిటి అమ్మ మీ ఇద్దరికి కూడా డిన్నర్ తయారు చేస్తున్నాది,

వాళ్ళు మొహమాటపడి హాస్టల్కి పారిపోతారు వాళ్ళిద్దరిని వచ్చేటపుడు తీసుకుని రండి అని మరీ మరీ చెప్పింది" అంది అనూరాధ.

"వాళ్ళింటికి వస్తానని చెప్పాను తప్పకుండా వెళ్ళాలి"

"అయితే ఒక పని చెయ్యండి, ఒరేయ్ రవీ నువ్వు ఇలాంటివి మేనేజ్ చెయ్యడంలో సమర్థుడివి కదా...నువ్వు అవినాశ్ కలిసి స్కూటర్ మీద వాళ్ళింటికి వెళ్ళి ఒక గంట అక్కడ వుండి ఏదో ఒక సాకు చెప్పి వచ్చేయండి"

"అలాగే చేద్దాము బ్రదర్, బావ అనూ ఇంటికి వెళతారు" అన్నాడు రవి.

***********

అవినాశ్, రవి వెళ్ళినాక కృష్ణమోహన్కి అనురాధ కావాలనే వాళ్ళిద్దరిని పంపిందేమో అని అనుమానం వచ్చింది, ఎందుకంటే వాళ్ళు వెళ్ళాక కృష్ణమోహన్ వంక నవ్వుతూ "ఇప్పుడు నీ సంగతి చెబుతాను" అన్నట్లు ఒక చూపు చూసింది. ఇంకెంత ఆట పట్టిస్తుందోనని ఈ పరిస్థితి నుండి తప్పించుకుందికి అనూరాధని రిక్షా మీద ఇంటికి పంపించి తను నడిచి వెళదామనుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు బావా?"

"అదిగో మళ్ళీ బావా అని పిలుస్తున్నావు, ఇందాకా హాల్లో అలా పిలవనని మాట ఇచ్చావు"

"పొరపాటుపడ్డావు బావా, నేను ఇచ్చిన మాట నాకు గుర్తుంది నీకే గుర్తులేదు"

"రాధా నువ్వు దబాయిస్తున్నావు"

"లేదు, అందరి ముందూ నిన్ను బావా అని పిలవను అన్నాను"... ఇది నేను అన్న మాట, అందరిముందూ పిలవనన్నాను కానీ బావా అని పిలవను అని నేను అనలేదు" పకపకా నవ్వుతూ చెప్పింది అనూరాధ.

"నీ తెలివితేటలు అద్భుతం" అని "ఒక పని చెయ్యి నిన్ను రిక్షా ఎక్కిస్తాను నువ్వు ఇంటికి వెళ్ళు, నేను నడిచి వస్తాను నువ్వు నడవలేవు"

"థాంక్స్ బావా ఫర్ యువర్ కన్సర్న్, నన్ను రిక్షా ఎక్కించి నువ్వు హాస్టల్కి పారిపోదామని నీ ఆలోచన. అయినా వయసులో వున్న ఆడపిల్లని ఒంటరిగా రిక్షాలో పంపిస్తావా? ఏదైనా జరగకూడనిది జరిగితే !!! ఒక పని చేద్దాము ఇద్దరూ కలిసి రిక్షాలో వెళదాము" మళ్ళీ నవ్వుతూ అంది అనూరాధ.

"వద్దు నడిచే వెళదాము" అన్నాడు చిరాకుగా.

"బావా నా మాటలకి కోపం వచ్చిందా? నేను జీవితాన్ని సరదాగా గడపాలని కోరుకుంటాను. సరదా అంటే పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యడం కాదు, మన చుట్టూ వున్న వాళ్ళతో జోకులు వేసుకుంటూ, వాళ్ళని ఆట పట్టిస్తూ, అలాగే వాళ్ళు కూడా మనల్ని ఆట పట్టిస్తున్నపుడూ, మనమీద జోకులు వేస్తున్నపుడూ వాటిని ఆస్వాదిస్తూ వుండటం, ఎల్లపుడూ మనం సంతోషంగా వుండి ఎదటి వాళ్ళని కూడా సంతోషంగా వుంచటం. అలా వుంటే మనకున్న ఇబ్బందులనీ, బాధలనీ మరచి సంతోషంగా వుండటమే కాకుండా, ఇద్దరు వ్యక్తుల మధ్య సమీపము పెరిగి స్నేహభావం పెంపొందుతుందని నా నమ్మకం" అని తన అభిప్రాయాన్ని చెప్పింది అనూరాధ. చిలిపిగా వుండే రాధలో ఇంత ప్రగాఢమైన అభిప్రాయం వుందా? ఈ అమ్మాయి అసాధారణమైనది అనుకున్నాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ మౌనంగా వుండటం చూసి "అదీగాక నువ్వు నా బావవి కదా, నిన్ను ఆట పట్టించే హక్కు నీ మరదలుగా నాకుంది, ఆ విషయంలో నేను సుప్రీం కోర్టుకైనా వెళతాను" అని మళ్ళీ చమత్కారంగా అంది అనూరాధ. ఆ మాటకి కృష్ణమోహన్ పకపకా నవ్వాడు.

"అబ్బో దొరగారు నవ్వారు"

"ఏయ్ నేను నీకు జడపదార్థంలా కనబడుతున్నానా? ఇందాకా నువ్వు జీవితం మీద నీ అభిప్రాయం చెప్పావు, అదే అభిప్రాయం నాకూ వుంది. అంతే కాదు ఆడ పిల్లలు పూర్వకాలంలో లాగ వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో మగవారితో పోటీపడి సమానంగా వుండాలని మనస్ఫూర్తిగా నేను నమ్ముతాను. ఒక ఆడది ఒక మగవాడు సరదాగా మాట్లాడుకుంటే ప్రపంచం తల్లక్రిందులైపోదు, కానీ వారిద్దరిలో ఏ ఒక్కరికి దుర్బుద్ధి వుండ కూడదు, సరదాగా మాట్లాడుకునే స్వేచ్ఛ వుండాలి కానీ విచ్చలవిడితనం వుండకూడదు, హద్దులు

దాటకూడదు, ఆ స్వేచ్ఛని దుర్వినియోగం చేయకూడదు. కొన్ని హద్దులుండాలనే పెద్దలు నియమాలూ, కట్టుబాట్లూ పెట్టారు, కానీ అందులో కొన్ని ఛాదస్తాలుగా మారి కాలదోషం పట్టాయి. అందుకని కాలంతో బాటు మనం మారాలి' అని నమ్మే వ్యక్తిని నేను. "బెంగాల్ ఈ రోజు ఏది ఆలోచిస్తుందో మిగతా భారత దేశం అదే విషయాన్ని రేపు ఆలోచిస్తుంది" అన్నారు గోపాలకృష్ణ గోఖలే. అటువంటి గడ్డ మీద నేను పుట్టాను, కొంత కాలం అక్కడ పెరిగాను. అక్కడ ఆడవారు మగవారు ఎటువంటి శషభిషలు లేకుండా స్వేచ్ఛగా, చాలా స్నేహపూర్వకంగా మెలుగుతారు,అంత స్వేచ్ఛ వున్నా హద్దులు దాటరు. బెంగాల్లో స్త్రీని గౌరవించినట్లు నేను ఇంకెక్కడా చూడలేదు. నాకు ఆడవారంటే గౌరవం, మా ఇంట్లో ఆడ పిల్లలు లేరు అందుకే నేను ప్రతి అమ్మాయిని తోడబుట్టినదానిగా భావిస్తాను" అని వివరంగా తన అభిప్రాయాలని చెప్పాడు కృష్ణమోహన్.

అతను మాట్లాడుతున్నంతసేపూ అతని మాటలు శ్రద్ధగా వింది అనూరాధ. "ఇతను చాలా ఉన్నతమైన భావాలు, అభ్యుదయ బావాలు కలిగిన వ్యక్తి" అనుకుంది.

"బావా ఇంతకు ముందు నీతో నాకు పరిచయం స్వల్పం. గత రెండు వారాల బట్టి నీతో పరిచయం పెరిగాక, ఇవాళ సినిమాలో నా ప్రక్కన నువ్వు కూర్చున్నాక నువ్వు పడుతున్న అవస్థ చూసి నీకు ఆడ పిల్లలతో మాట్లాడడానికి బిడియం, వాళ్ళని నువ్వు ఏదో అంటరాని వారిగా భావిస్తున్నావని అనుకున్నాను. అందుకే నీలో ఆ బిడియం, బెరుకుతనం పోగొట్టాలనే నేను కొంచెం ఎక్కువ చనువు తీసుకున్నాను, నిన్ను ఆట పట్టించాను. అన్యధా భావించకు. ఇప్పుడు నీ అభిప్రాయాలు విన్నాక నీకు ఆడవాళ్ళపట్ల వున్న గౌరవం గురించి విన్నాక నేను నీ అభిమానిని అయ్యాను"

"చేసిందంతా చేసి ఇప్పుడు కబుర్లు బాగానే చెబుతున్నావు"

"కబుర్లు మా బావతో కాక ఇంకెవ రితో చెబుతాను" చిలిపిగా అంది అనూరాధ.

"రాధ చాలా మంచి పిల్ల, ప్లీజ్ ఆ "బావా" అని పిలవడం మానెయ్యి, అలా పిలిస్తే నాకు ఏదో ఎబ్బెట్టుగా వుంది" అని బతిమాలుకున్నాడు కృష్ణమోహన్.

"నో వే, ఇందాకే చెప్పాను, అది నా హక్కు, దానిని ఎవరూ కాదన లేరు"

"మొండిఘటానివి, సరే ఆకలిగా వుందా ఏమైనా తింటావా?"

"ఆకలి లేదు కానీ ఎక్కడైనా కాస్సేపు కూర్చుని కాఫీ తాగుతూ సరదాగా కబుర్లు చెప్పు కుందాము"

"సరే కల్పనా థియేటర్ ఎదురు గా "ఇండియా కాఫీ హవుస్కి వెళదాము"

హోటల్లో కూర్చున్నాక "ఇక్కడ సాండ్విచ్, ఆంలెట్ చాలా బాగుంటాయి, నేను ఎప్పుడు వచ్చినా ఆంలెట్ తింటాను, నువ్వు కూడా తింటావా?" అని అడిగాడు కృష్ణమోహన్.

"ఏమిటీ నువ్వు ఆంలెట్ తింటావా! ఈ సంగతి మీ ఇంట్లో తెలుసా?" అని ఆశ్చర్యంగా అడిగింది అనూరాధ.

"ఎందుకంత ఆశ్చర్యపోతున్నావు? నేను బెంగాల్లో పుట్టాను. అక్కడ కోడి గుడ్డుని, చేపని కూడా వెజిటేరియన్ ఫుడ్గా భావిస్తారు. మా ఇంట్లో ఎవరూ తినరు కానీ నేను ఆంలెట్ ఎంజాయ్ చేస్తాను"

"అంటే చేపలు కూడా తింటావా!" అనుమానంగా అడిగింది అనూరాధ.

"లేదు నేను తినను ఆ వాసనే నాకు నచ్చదు, నా ఉద్దేశ్యంలో తిండి అనేది వ్యక్తిగత విషయం, ఎవరికి ఏది నచ్చితే అది తింటారు. అందులో ఆశ్చర్య పడవలసినదేమీ లేదు"

"థాంక్ గాడ్"

"ఇంతకీ నువ్వు ఆంలెట్ తింటావో, తినవో చెప్పలేదు".

అతని చేతి మీద గిల్లి "నీకు మేమంటే వేళాకోళంగా వుంది బావా, నువ్వంటే దేశానికి మార్గదర్శిగా వున్న బెంగాల్లో పుట్టావు గాని, నేను తెలుగునాట అందులో కోనసీమలో పుట్టాను. మేము మీ అంత "అడ్వాన్స్డ్" కాదు బాబూ" అని చురక అంటించింది.

"మొత్తానికి చురక వేసావు, సరే నోటితో చెప్పొచ్చు కదా, ఇలా గిల్లి చెప్పాలా?"

"అలా గిల్లి చెబితే ఎప్పటికీ

మరచిపోవు గుర్తుండిపోతుంది”

“అవునా, ఇక మీదట నేనూ అలాగే చెబుతాను”

“అబ్బో అమోల్పాలేకర్గారిలో మార్పు వచ్చిందే! పంచ్ డైలాగులు వేస్తున్నారు”

“అప్పుడే ఏమైంది ముందుంది ముసళ్ళ పండగ”

“ఎందుకు బావా నా మీద అంత కక్ష, ఏదో చిన్నపిల్లని బావవి కదా అని వేళాకోళం ఆడేనే అనుకో దానికి పగబట్టాలా” అమాయకురాలిలా మొహం పెట్టి అంది అనూరాధ.

“అబ్బో నీలో ఈ కళకూడా వుందా? నీ అమాయకమైన మొహం చూసి ఈ చుట్టుపట్ల వాళ్ళంతా నేనేదో నిన్ను ఏడిపిస్తున్నానని అనుకుంటారు, కానీ వాస్తవంలో నువ్వు నన్ను ఏడిపిస్తున్నావని ఎవ్వరూ అనుకోరు. ఇక ఆ ఏక్షన్ ఆపు”

బేరర్ సాండ్విచ్, ఆంలెట్ తీసుకు వచ్చాడు. సాండ్విచ్ అనూరాధకి ఇచ్చి ఆమ్లెట్ తను తీసుకొని “కొంచెం టేస్ట్ చేస్తావా” అని అడిగాడు కృష్ణమోహన్.

“వద్దు నేను తింటే ఆ తరువాత నువ్వే ఇబ్బంది పడతావు”

“సినిమా నచ్చిందా?”

“బాగుంది నాకు చాలా నచ్చింది, ఆత్రేయ గారంటే నాకు చాలా ఇష్టం, ఆయన పాటలన్నా, సంభాషణలన్నా చెవి కోసుకుంటాను”

“రియల్లీ! నాకూ ఆత్రేయ గారంటే పిచ్చి. అక్కినేని, ఆత్రేయ, మహదేవన్ వీళ్ళ ముగ్గురి కలయికతో వచ్చిన సినిమా అంటే అంటే నాకు విపరీతమైన ఇష్టం”

“అయ్యో నీకు నచ్చిన కాంబినేషన్ వున్న ఈ సినిమాని చూడనీయకుండా అల్లరి చేసాను, ఐ యాం సారీ బావా” అని నొచ్చుకుంది అనూరాధ.

“పరవాలేదు, ఇది నేను రెండవ సారి చూడడం”

“అయితే నా సారీ వెనక్కి తీసుకుంటున్నాను”

*************

కాఫీలు తాగడం పూర్తయ్యాక ఇద్దరూ బయలుదేరి మళ్ళీ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

“నీకు పాటలంటే ఇష్టమేనా?” అడిగాడు కృష్ణమోహన్.

“చాలా ఇష్టం, అందుకే సంగీతం నేర్చుకుంటున్నాను”

“అచ్చా! నాకూ సంగీతం అంటే చాలా ఇష్టం. సినిమాపాటలు పాడతావా? నీకు ఇష్టమైన సింగర్స్ ఎవరు”

“పాడతాను, సుశీలగారు, ఘంటసాలగారు. క్లాసికల్ మ్యూజిక్లో బాలమురళీకృష్ణ, M S సుబ్బులక్ష్మి, జేసుదాస్ అంటే చాలా ఇష్టం. నీ అబిమాన గాయనీగాయకులు ఎవరు? నువ్వు కూడా పాటలు బాగా పాడతావని వైదేహి వదిన చెప్పింది”

“నేను జేసుదాస్, ముఖేష్, సుశీల, లతామంగేష్కర్, రఫీ, కిషొర్కుమార్ల అభిమాని. అన్నమయ్య కీర్తనలంటె బాగా ఇష్టం, ఘంటసాల గారంటే ప్రాణం. బాపూగారి బొమ్మలు, ముళ్ళపూడి కథలు, బాపూ, ఆదుర్తి, అక్కినేని సినిమాలంటే చాలా ఇష్టం. ఈ సారి వచ్చినపుడు నీ పాటలు వినాలి,

“నా పాటలు విందుగాని కానీ ఒక షరతు, నువ్వు కూడా పాటలు పాడి వినిపించాలి”

“ఇంకేమిటి నీకు ఇష్టం”

“నాకు శోభన్బాబు, వాణిశ్రీ సినిమాలంటే ఇష్టం, ముళ్ళపూడి కథలు, ఆదుర్తి గారి సినిమాలంటే చాలా ఇష్టం. కబుర్లు చెప్పడం, షటల్ ఆడటం, కొత్త వంటలు నేర్చుకోవడం, పాటలు, సంగీతం, సోషల్ సర్వీస్,. ఇవి నా అభిరుచులు. నీ అభిరుచులు ఏమిటి?”

“కొత్త వంటలు సరే, నీకు వంట వచ్చా? మీ అమ్మగారికి సాయం చేస్తావా?” అని అడిగాడు.

“ఎందుకు రాదు, ఆడపిల్లనుకదా వంట రావడం స్వాభావికము, రాత్రి వంట సాధారణంగా నేనే చేస్తాను”

“అచ్చా అయితే నీ వంట ఎప్పుడు రుచి చూపిస్తావు”

“నువ్వు ఈ సారి వచ్చినపుడు చేస్తాను, కానీ తిన్నాక నన్ను ఆట పట్టించకూడదు”

“అఛ్చా! నువ్వే నన్ను ఆట పట్టిస్తావా? నేను నిన్ను ఆట పట్టించకూడదా? ఇదెక్కడి న్యాయం”

“అదంతే, సరే గాని నీ అభిరుచులు చెప్పలేదు”

“నా అభిరుచులు క్రికెట్ ఆడటం,

స్నేహితులతో కబుర్లు చెప్పడం, కొత్త కొత్త ప్రదేశాలు చూడటం, నచ్చిన సినిమా పాటలు వినడం వాటి సాహిత్యాన్ని విశ్లేషించడం, ఇతరులకి చేతనైన సహాయం చెయ్యడం"

"ఇప్పటిదాకా ఏ ఏ ప్రదేశాలు చూసావు, అందులో నీకు నచ్చిన ప్రదేశం ఏది?"

"కలకత్తా, బొంబాయి, తిరుపతి, కోనసీమ, నాకు అన్నిటికన్న నచ్చిన ప్రదేశం కోనసీమ, తరువాత బొంబాయి"

"గుడ్, మా కోనసీమ అంటే ఏంటనుకున్నావు? ఇంతకీ కోనసీమ ఎందుకు నచ్చింది?"

"అక్కడి పచ్చదనం, నిరాడంబరంగా, నిష్కల్మషంగా వుండే ప్రజలు, అక్కడి తెలుగు సంస్కృతి ఇంకా......" అని సగంలో ఆపేసాడు.

"అదేమిటి! ఏదో చెప్పబోతూ మధ్యలో ఆపేసావు, పూర్తి చెయ్యి" అంది అనూరాధ.

"ఏమీ లేదు, వదిలేయ్"

"బావా ప్లీజ్ చెప్పు నువ్వు అలా సందేహంలో వుంచితే నాకు ఉత్కంఠ పెరుగుతుంది"

"ఏం లేదన్నానుగా ఏదో ప్రవాహంలో వచ్చేసింది"

"చెప్పు బావా ప్లీజ్"

"ఏమీలేదు"

"సరే నువ్వు చెప్పకపోతే ఇంటికి వెళ్ళాక నీకు "బావా బావా పన్నీరే...." అని బెదిరించింది.

"నువ్వు ఏం చేసినా నేను చెప్పను"

"అయితే నేను నీతో మాట్లాడను" అని అలక నటించింది.

"హమ్మయ్య బతికించావు, థాంక్యూ" అని వేళాకోళంగా అన్నాడు.

"అలాగే అంత తేలికగా నిన్ను వదులుతానా? నువ్వు చెప్పకపోతే నేనే తెలుసుకుంటాను, వచ్చే ఆదివారం క్రికెట్ మ్యాచ్కి వచ్చినపుడు అదేమిటో నీకు చెబుతాను. కరక్ట్ చెబితే నాకు మంచి ట్రీట్ ఇవ్వాలి"

"ఇంకెవరినీ అడగకుండా చెప్పాలి" అన్నాడు కృష్ణమోహన్.

"అలాగే, ఆ ట్రీట్కి మనమిద్దరమే వుండాలి, ఇంకెవరినీ పిలవకూడదు ఓకే" అని షరతు పెట్టింది అనూరాధ.

చెప్పలేదులే అని ధీమాతో "సరే" అన్నాడు కృష్ణమోహన్. అలా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి చేరేసరికి దూరం తెలియలేదు వారిద్దరికి.

ఇంట్లోకి వెళ్ళాక "బావా కాస్త ఫ్రెష్ అవు, నేను కాఫీ కలిపి తీసుకు వస్తాను" అని టవల్ అందించింది అనూరాధ. వాష్ రూంకి వెళ్ళి శుభ్రంగా మోహం, కాళ్ళు, చేతులు కడుగుకొని వచ్చాడు కృష్ణమోహన్. ఈ లోపల తను కూడా ఫ్రెష్ అయి కృష్ణమోహన్ని డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికి తీసుకు వెళ్ళి అక్కడ పౌడర్ వగైరా చూపించింది అనూరాధ.

అతను తయారయ్యే లోపల కాఫీ కలిపి తెచ్చి అతనికి ఇచ్చింది. అనూరాధతో "నీకో" అని అడిగాడు.

"నేను ఇన్ని సార్లు తాగను, నువ్వు తాగు"

"నేను ఇంత తాగలేను, ఒక పని చెయ్యి ఒక ఖాళీ కప్పు తెచ్చుకో ఇద్దరమూ షేర్ చేసుకుందాము"

"అబ్బాయ్!రవీ,అవినాష్ఎక్కడికి వెళ్ళారు" అని కృష్ణమోహన్ని అడిగారు పార్వతమ్మగారు.

"అవినాశ్ నాన్నగారి స్నేహితుడు జగన్నాధపురంలో వున్నారు, వారిని కలవడానికి వెళ్ళారు అత్తయ్యగారు" ఆ పిలుపు విని అతని ప్రక్క చూసి ముసి ముసిగా నవ్వింది అనూరాధ.

పార్వతమ్మగారు అక్కడినుండి వెళ్ళాక "ఇందాకా సినిమాహాల్లో నీ లాజిక్ గుర్తు చేస్తూ నన్ను చూసి నవ్వావు కదూ" అని అడిగాడు.

"అవును బావా" అని ఆ 'బావా' అన్న మాటని ఒత్తి పలుకుతూ అతనిని ఏడిపించింది.

"కొంటె పిల్లా" అని తల మీద మొట్టికాయ పెట్టాడు. అంతలోనే సర్దుకుని తప్పు చేసినవాడిలాగ "ఐ యాం సారీ" అన్నాడు.

"మరదే మొహమాటమంటే, బావా నేను మగపిల్లాడిని అనుకో అప్పుడూ ఇలాగే తప్పు చేసినట్లు సారీ చెబుతావా?"

"చెప్పను గానీ ఇంక ఆ విషయం వదిలేయ్"

"అదే నా పాయింట్ బావా, సో ఆడదైతే రూల్స్ మారిపోతాయా?" అని అడిగింది.

"ఇక్కడ విషయం అది కాదు, నువ్వు ఒక పరాయి మగవాడిని ఇలానే మొట్టికాయ పెడతావా?" అని అడిగాడు.

"అంటే దాని అర్థం నువ్వు

నన్ను పరాయిదానిగా భావిస్తున్నావన్నమాట"

"రాక్షసీ చిన్నపుడు నీకు అత్తయ్యగారు వస బాగా పోసినట్లున్నారు"

"సరే నన్ను పరాయిదానిగా భావించి మొట్టికాయ పెట్టినపుడు సారీ చెప్పావు, మరి ఇప్పుడు ఈ పరాయిదానిని రాక్షసీ అని చనువుగా ఎలా పిలుస్తావు?" అని అడిగింది అనూరాధ.

ఆమె తర్కానికి కృష్ణమోహన్ సాగిలపడి "తల్లీ నువ్వు పరాయిదానివి కాదు నా.." అంటూ సగంలో ఆపేసాడు.

"ఇందాకా ఒక విషయంలో ఇలాగే సగంలో ఆపేసావు. ఇప్పుడూ మళ్ళీ సగంలో ఆపేస్తున్నావు, పోనీ మిగతాదీ నేను పూర్తిచెయ్యనా?" అని అతనిని ఆట పట్టించింది.

"అయ్ నోరు ముయ్యి, ఇక చాలు పొద్దున్న నుంచి నన్ను ఫుట్బాల్ ఆడుకున్నావు, కాస్త విశ్రాంతి తీసుకో. ఆట అంతా ఇవాళే ఆడేస్తే మళ్ళీసారికి ఏమీ మిగలదు"

"అలాగే, అబద్ధము ఆడకుండా చెప్పు సగంలో వదిలేసింది "నా దానివి" అనే కదూ?" అని ఇంకా ఆట పట్టించింది

"కాదు "నా శత్రువి" అని అందామనుకున్నాను, కానీ బాగుండదని అనలేదు" అని తప్పించుకుందికి ఏదో ఆ సమయానికి తోచింది చెప్పాడు కృష్ణమోహన్.

"అబ్బాయిగారికి గారికి అబద్ధం చెప్పడం కూడా రాదు, అబద్ధం చెబితే గోడకట్టినట్లు వుండాలంటారు. మీ మొగవాళ్ళకి ఆది చేతకాదు. "శత్రువువి" అనదల్చుకున్నపుడు "నువ్వు పరాయిదానవు కాదు" అని ఎందుకు అన్నావు?" అని నిలదీసింది.

కృష్ణమోహన్ నీళ్ళు నమిలాడు. అది చూసి "చూశావా నీ దగ్గర సమాధానం లేదు. సరే ఈ సారికి వదిలేస్తున్నాను. ఎప్పటికైనా నీ చేత నిజం చెప్పిస్తాను" అంది.

రవి, అవినాశ్ వచ్చారు. భోజనాలు చేసి హాస్టల్కి తిరిగి బయలుదేరే ముందు "మోహన్ నీ వ్యవహారం చూస్తూ వుంటే నీకు మొహమాటం ఎక్కువనిపిస్తున్నది. మొహమాటపడకుండా వీలున్నపుడు వస్తూ వుండు" అని కృష్ణమోహన్తో పార్వతమ్మగారు చెప్పింది.

ఆవిడ వెనక నిలుచుని వున్న అనూరాధ అతని వంక నవ్వుతూ అతనిని గమనిస్తున్నాది. "అలాగే అత్తయ్యగారూ" అని బయలుదేరారు.

*****************

తదుపరి ఆదివారం ఉదయం ఎనిమిదిన్నరకల్లా బ్రేక్ఫాస్ట్ పూర్తి చేసి అవినాశ్తో రవి వాళ్ళ సంగతి చూసుకోమని చెప్పి తన క్రికెట్ కిట్తో మెడికల్ కాలేజి గ్రౌండ్కి బయలుదేరాడు కృష్ణమోహన్. టాస్కి వెళ్ళేటపుడు అనూరాధ, సతీశ్ కనబడ్డారు. సతీశ్ చెయ్యి ఊపితే చెయ్యి ఊపి జవాబు ఇచ్చాడు కృష్ణమోహన్. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు కృష్ణమోహన్. మెడికల్ కాలేజి టీం బ్యాటింగ్ మొదలు పెట్టి వారి నిర్ణీత 30 ఓవర్లలో 165 పరుగులు చేసి 8 వికెట్లు నష్టపోయింది. కృష్ణమోహన్ 22 పరుగులిచ్చి 3 వికెట్స్ తీసాడు.

లంచ్కి ముందు మాటల్లో "అన్నయ్యా మీ స్వస్థలం ఎక్కడ" అని అవినాశ్ని అడిగింది అనూరాధ.

"భోగాపురం, విశాఖ జిల్లా (ప్రస్తుతం విజయనగరం జిల్లా)" చెప్పాడు అవినాశ్.

"మాది కోనసీమ, ఎప్పుడైనా చూశావా"

"లేదు, చాలా బాగుంటుందిట కదా బావ చెప్పాడు "

"అవును మీ బావ, నువ్వు వస్తే మనమంతా ఒక సారి సరదాగా మా వూరు వెళదాము అప్పుడు అన్నీ చూడవచ్చు"

"మా బావ ఒక సారి కోనసీమ చూసాడు. తనకి అక్కడి పచ్చదనం, ప్రకృతి, ప్రజలు అన్నీ నచ్చాయి. తనకి కోనసీమ ఎంత నచ్చిందంటే అక్కడి అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలని కోరిక వుందని ఒకసారి మాటలలో చెప్పాడు".

"బావా దొరికావు, ఈ విషయమే కదా నాకు చెప్పడానికి సిగ్గుపడి నా దగ్గర దాచావు" అని అనూరాధ మనసులో అనుకుంది..."అయితే ఇంకేమి కృష్ణ తప్పకుండా వస్తాడు, ఒకసారి వెళదాము" అని అవినాశ్తో అంది. రవితో కూడా కోనసీమ ట్రిప్ గురించి చెప్పింది అనూరాధ

"అలాగే తప్పకుండా వెళదాము" అన్నాడు రవి.
లంచ్ విరామంలో రవి, అవినాశ్ వెళ్ళి నలుగురికీ హోటల్ నుండి టిఫిన్ తీసుకు వచ్చారు. అది తింటూ లంచ్ తరువాత మ్యాచ్ని చూస్తున్నారు.ఇంజినీరింగ్ కాలేజి టీం మొదటి పది ఓవర్లలో 54 రన్స్ చేసి 3 వికెట్స్ పోగొట్టుకుంది. అప్పుడు కృష్ణమోహన్ బ్యాటింగ్కి వచ్చాడు...ఇంకా 112 రన్స్ చెయ్యాలి ఇరవై ఓవర్లు మిగిలాయి.
కృష్ణమోహన్ ఒక ప్రక్క విజృంభించి ఆడాడు, రెండో ప్రక్క కృష్ణమోహన్ క్లాస్మేట్ మహేంద్రవర్మ బాగా సపోర్ట్ ఇచ్చాడు, స్కోర్ 161 దగ్గర మహేంద్రవర్మ అవుటయ్యాడు. ఉంకొక ఐదు రన్స్ కొట్టాలి, ఒక ఓవర్ మిగిలింది. కొత్త బ్యాట్స్మేన్ సింగిల్ తీసి కృష్ణమోహన్కి బ్యాటింగ్ ఇచ్చాడు.ఇంకా మూడు బంతులు వున్నాయనగా అతను ఒక బౌండరీ కొట్టి సునాయసంగా టీంని గెలిపించాడు.కృష్ణమోహన్ 63 రన్స్ కొట్టి అజేయుడిగా నిలిచాడు.
మ్యాచ్ అవుతున్నంత సేపు సతీశ్ బాగా ఎంజాయ్ చేసాడు. కృష్ణమోహన్ బ్యాటింగ్ చేసేటప్పుడైతే సతీశ్కి ఉత్సాహం రెట్టింపైంది. కేరింతలు కొడుతూ "బావా ఫోర్, బావా సిక్స్" అని అరిచాడు. అనూరాధ, అవినాశ్, రవి కూడా చప్పట్లు కొట్టి కృష్ణమోహన్ని ఉత్సాహపరిచారు. ఆట ముగిసిన తరువాత కృష్ణమోహన్ని అభినందించడానికి అతని దగ్గరకి వెళ్ళారు, అప్పటికే అతని చుట్టూ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థులు, మెడికల్ కాలేజి విద్యార్థులే కాకుండా చాలా మంది మెడికల్ కాలేజి విద్యార్థినులు కూడా అతనిని అభినందించడానికి గుమిగూడారు.
అబ్బో హీరోగారికి అమ్మాయిలలో కూడా చాలా మంది అభిమానులు వున్నారే అనుకుంది అనూరాధ. ఈ లోపల రవిని ఫ్రెండ్స్ అందరికీ పరిచయం చేస్తున్నాడు అవినాశ్, సతీశ్ కూడా వాళ్ళతో వున్నాడు. అనూరాధ ఒంటరిగా మిగిలింది. అది చూసి కృష్ణమోహన్ ఆమె దగ్గరకి వచ్చాడు, అతనితో బాటు కొంతమంది మెడికల్ కాలేజి అమ్మాయిలు కూడా వచ్చారు. వాళ్ళందరికి కృష్ణమోహన్ ప్రత్యేకంగా అనూరాధ దగ్గరకి రావడం ఉత్సుకతని పెంచింది. అనూరాధతో వీళ్ళంతా మెడికల్ కాలేజి స్టూడెంట్స్ అని పరిచయం చేసి, తను మా కజిన్ అని అనూరాధని పరిచయం చేసాడు.
అందులో ఒక అమ్మాయి "కజిన్" అంటే అని కొంటెగా అడిగింది. మా మామయ్యగారి కూతురు అని చెప్పాడు కృష్ణమోహన్. "ఓహ్! నా ఉత్సాహం అంతా నీరుగారి పోయింది" అని నిట్టూరుస్తున్నట్లు నటించి వేళాకోళం చేసింది ఆ అమ్మాయి. ఆ ఆడపిల్లలంతా అనూరాధని చూసి 'ఆమె చాలా అందంగా ఆకర్షణీయంగా వుంది' అని మెచ్చుకుని "అభినందనలు మోహన్,మీరుఅదృష్టవంతులు" అని ఆట పట్టించారు.
"ఓకే అమ్మాయిలూ మీ అందరి పొగడ్తలకి కృతజ్ఞతలు, నెక్స్ట్ టైం బెటర్ లక్, బాయ్ బాయ్" అని చెప్పి అనూరాధని తీసుకుని అక్కడనుండితప్పించుకున్నాడు. కృష్ణమోహన్కి షేక్హ్యాండ్ ఇచ్చి "కంగ్రాట్స్ బావా, రియల్లీ చాలా బాగా ఆడావు, మీ జట్టుని ఒంటి చేత్తో గెలిపించావు. నీ ఆట చూశాక నీకు క్రికెట్ మీద ఎందుకింత అభిమానముందో అర్ధమయింది. హీరో గారికి చాలా ఫేన్ ఫాలోయింగ్ వుందే! సార్ నన్ను మరచిపోకండి నేనూ మీ అభిమానినే" అంటూ వేళాకోళం చేసింది.
"చాల్లే ఆపు, ఇక పద" నవ్వుతూ అన్నాడు.
"ఒక్క నిముషం ఆగు బావా క్రిందటి వారం తమరు ఒక పజిల్ ఇచ్చారు, సమాధానం చెప్పమంటారా?"
"చెప్పు"
"నీకు కోనసీమ ఎంతగా నచ్చిందంటే నువ్వు కోనసీమ అమ్మాయిని పెళ్ళిచేసుకుందాము అనుకుంటున్నావు. నేనూ ఆ కోనసీమ అమ్మాయినే గనుక ఆ విషయం నాకు చెప్పడానికి సిగ్గు పడ్డావు, అవునా".
"నువ్వు దేవాంతకురాలివి! అసలు నీకేలా తెలిసింది?"
అనూరాధకి విషయం ఎలా

తెలిసిందో చెప్పి "పొగడ్తలు తరువాత, ట్రీట్ ఎప్పుడు అది చెప్పండి సార్"
"ఆ ఏదో సరదాకి అన్న మాటని నిజంగా తీసుకుంటే ఎలాగ?" అని తప్పించుకుందికి ప్రయత్నించాడు కృష్ణమోహన్.
"అదేం కుదరదు"
అవినాశ్ వాళ్ళు అటు రావడం చూసి "తరువాత చూద్దాములే" అన్నాడు. అవినాశ్, రవి, సతీశ్ ముగ్గురూ కృష్ణమోహన్ని పొగడ్తలతో ముంచేసారు. సతీశ్ అయితే టెస్ట్ మ్యాచ్ చూసినంత సంబర పడిపొయి "బావా నువ్వు ఎప్పుడు మ్యాచ్ ఆడినా నేను వస్తాను" అన్నాడు.
"బావా ఇంటికి వచ్చేయండి, సరదాగా కబుర్లు చెప్పుకుని భోజనం చేసాక తిరిగి వద్దురుగాని" అన్నాడు రవి.
"వద్దు బావా వళ్ళు హూనం అయింది రూంకి వెళ్ళి శుభ్రంగా స్నానం చేసి రిలాక్స్ అవుతాను, అదీగాక మా టీం అంతా నా కోసం వైట్ చేస్తున్నారు" అన్నాడు కృష్ణమోహన్. వెళుతూ వెళుతూ కృష్ణమోహన్ ఒక్కడికే వినిపించేటట్లు "ట్రీట్ మరచిపోకు" అంది అనూరాధ. కృష్ణమోహన్ చిరునవ్వు నవ్వాడు. మరుసటి వారం పరీక్షలకి మిత్రులిద్దరూ తయారు అవుతున్నారు. ఆదివారం కూడా బయటకి వెళ్ళకుండా శ్రద్ధగా చదువుతున్నారు. గత మూడు వారల నుండి ప్రతి ఆదివారం కలుస్తూ బాగా దగ్గర అవడం వలన రవికి, అనూరాధకి అసలు సమయం గడవటం లేదు. అనూరాధకి అసలు ఏ పని చేయ బుద్ధి కావటం లేదు. కృష్ణమోహన్ని ఆట పట్టించి అతనితో బాగా చనువు ఏర్పడింది, అతని గురించి ఉదయం నుండి ఆలోచిస్తున్నాది.
"మనిషి చాలా మంచివాడు, ఉత్తముడు, ఉన్నతమైన భావాలు కలిగినవాడు, ఆడవాళ్ళ పట్ల గౌరవం కలిగినవాడు, మృదువైన స్వభావం కలిగినవాడు. ఆ రోజు క్రికెట్ మ్యాచ్ తరువాత అంత మంది ఆడ పిల్లలు అతనిని అభినందించడానికి వచ్చి, ఆ ఆడపిల్లలు సరదాగా వేళాకోళం చేసినా ఎంతో హుందాగా ప్రవర్తించి వాళ్ళకి సరదాగానే ఉచిత రీతిలో సమాధానమిచ్చాడు. ఆడపిల్లలతో మాట్లాడడానికి సిగ్గుపడతాడు, భయపడతాడు అనుకున్నాను కానీ మొన్న ఆట తరువాత అమ్మాయిలందరితో సౌకర్యంగానే మాట్లాడాడు. నాతో మాట్లాడినపుడు ఎందుకో సౌకర్యంగా వుండడు బెరుకుగా వుంటాడు, సిగ్గుపడతాడు. కొద్దిగా మొహమాటస్తుడు" అనుకుంది.

"ఇదేమిటి ఇంతగా అతని గురించి ఆలోచిస్తున్నాను, ఏమైంది ఈ రోజు నాకు, అనవసరమైన ఆలోచనలు చేస్తున్నానా? లేని పోని ఆశలు కల్పించుకుంటున్నానా? ఈ ఆలోచనల పర్యవసానం ఎలా వుంటుందో?" అనుకుంది.
ఈ ఆలోచనలనుండి బయటపడదామని తల్లికి వంటలో సాయం చేద్దామని వెళ్ళింది. అక్కడ కూడా ఆలోచనలు ఆగలేదు, మూకుడులో వేయవలసిన తరిగిన వంకాయ ముక్కలు ప్రక్కన వున్న పాల గిన్నెలో వేసింది. "ఏయ్ అనూ! ఏమిటి ఆలోచిస్తున్నావు? కష్టపడి తరిగిన వంకాయలు, లీటరు పాలు తగలెట్టావు, నాకే సాయం చెయ్యనక్కరలేదు, నువ్వెళ్ళి కాస్సేపు ఎకాగ్రతతో సంగీత సాధన చేసుకో" అని పార్వతమ్మగారు విసుక్కున్నారు.
అనూరాధ సంగీత సాధన కోసం అన్నీ సిద్ధము చేసుకొని తన కీర్తనల పుస్తకాన్ని తీసి ఏ కీర్తన పాడుదామా అని ఆలోచించి నిర్ణయించుకోలేక, సరే కళ్ళు మూసుకొని పుస్తకం తెరుద్దాము, ఏ కీర్తన వస్తే ఆ కీర్తన సాధన చేద్దామని నిర్ణయించుకొని పుస్తకం తెరిచింది... త్యాగరాజులవారి "మరుగేలరా ఓ రాఘవా" కీర్తన వచ్చింది. వెంటనే శృతి నిశ్చయించుకొని, శ్రీ రామచంద్రునికి నమస్కరించి ఆలాపన చేసి కీర్తన సాధన చేసింది.
కృష్ణమోహన్ పట్ల నేను ఆకర్షితురాలిని అవుతున్నానా? కాకపోతే నా మనస్సు అతని గురించి ఇంతగా ఎందుకు ఆలోచిస్తున్నాది? ప్రేమలో పడ్డానా? దీనినే ప్రేమంటారా? అసలు ప్రేమంటే ఏమిటి?

**(ఇంకా వుంది)**

# ఆర్. శర్మ దంతుర్తి

# తెలుగు పద్య రత్నాలు - 5

లయకారుడైన శివుడిమీద పంచాక్షరి నుంచి ఏ శ్లోకం లో చూసినా దక్ష యజ్ఞ వినాశనం గురించి ఉండడం గమనించవచ్చు – దక్షుడు బ్రహ్మ చేత సృజించబడిన ప్రజాపతి. ప్రజాపతులు ప్రజోత్పత్తి కోసం నియమించబడినవారు; వాళ్లపని అంతవరకే. ఈ ప్రజలని రక్షించే, లయించే పని విష్ణుమహేశ్వరులది. ప్రజాపతులు సృష్టి అంతా తమవల్లే జరిగింది అని గర్వించి భగవంతుణ్ణి విస్మరిస్తే ఏం జరుగుతుందో చెప్పేదే దక్షయజ్ఞం కథ. దక్షుడు తనకి పుట్టిన పిల్లల్లో ఒకరైన సతీదేవిని, శివుడికి ఇచ్చి పెళ్ళిచేసాడు. అయితే శివుడి అవతారం చూసి మనసులో లోపల కొంచెం కంటగింపు – అల్లుడు ఏనుగు చర్మం కట్టుకుని కపాలం చేతిలో పట్టుకుని శ్మశానాల్లో తిరుగుతాడనీ అసలు ఏమీ లేనివాడనీను. కూతుర్ని సుఖపెట్టడానికి శివుడు పనికిరానివాడని దక్షుడి అభిప్రాయం కాబోలు, అందువల్ల అయినదానికీ, కానిదానికీ శివుణ్ణి కించపరచడం, మామగారైన తనకి గౌరవం ఇవ్వలేదనడం సాగిస్తాడు. ఇదంతా చూసినా శివుడేమీ అనకపోవడం చూసి దక్షుడు మరింత రెచ్చిపోవడం జరుగుతూ ఉంటుంది.

మనం కూడా అంతే కదా? ఎవరిమీదైనా కోపం వస్తే అలా నోటికొచ్చినది ఏదో ఒకటి అంటూ ఉంటాం. అవతలి వారు ఊరుకునే కొద్దీ ఆ దూషించడం ఎక్కువౌతూ ఉంటుంది. ఆ తర్వాత ఆ దూషణవల్ల రక్తపోటు, తలనెప్పి, గుండెపోటూ మరోటీ రావడం సహజమే కదా? దీనివల్ల అర్థం అయ్యేదేమిటి? భగవంతుడిమీద, ఎవరిమీద అయినా కోపం వస్తే ఆయన్ని తిట్టీ కొట్టీ మనం మన జీవితాలనే నాశనం చేసుకుంటున్నాం. దీన్నే బద్దెన అన్నాడు – "తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష," అని.

దక్షుడు సతీదేవిని అవమానించాక ఆవిడ తన తపోబలంతో అగ్నిలో కాలిపోయింది యజ్ఞవాటికలో. అక్కడే ఇదంతా చూస్తున్న నందీ, మిగతా శివగణాలు యజ్ఞం చేసేవారిని శపించారు. ఆ యజ్ఞం చేయించే బ్రహ్మవేత్తలైన భృగు మహర్షీ మొదలైన వారు శివగణాలని తిరిగి శపించి, అభిచార హోమం చేసి వాళ్ళని యాగశాలలోంచి వెళ్లగొట్టారు. శివగణాలు వెనక్కి వచ్చి ఇదంతా శివుడికి చెప్పేసరికి ఆయన అగ్రహోదగ్రుడై ఒక జడ తీసి నేలమీద కొట్టాడు. అందులోంచి అవిర్భవించిన వీరభద్రుడు శివుణ్ణి అడిగాడు, "తండ్రీ నన్నెందుకు సృష్టించారు, ఏం చేయమంటారు?" అని. అప్పుడు శివుడు వీరభద్రుడితో ఏం చేయాలో చెప్పే పద్యమే పోతన మహాభాగవతం నాలుగో స్కంథంలో రాసిన ఈ చంపకమాల పద్యం.



చ. గురుభుజశౌర్య! భూరిరణకోవిద! మద్భటకోటి కెల్ల నీ
వరయ వరూథినీవరుఁడవై చని యజ్ఞము గూడ దక్షునిన్
బరువడిఁ ద్రుంపు; మీ వచట బ్రాహ్మణతేజ మజేయమంటివే
నరిది మదంశసంభవుఁడవై తగు నీకు నసాధ్య మెయ్యెడన్? [4-109]

"మంచి భుజబలం, శౌర్యం, పెద్దపెద్ద రణాలలో ఆరితేరినవాడివైన వీరభద్రా, నా భటులందరికీ (మద్భటకోటికెల్ల) నాయకుడివై, యజ్ఞంతో పాటు దక్షుణ్ణి కూడా దండించు (బరువడి ద్రుంపు). అయితే అక్కడున్న భృగుమహర్షి లాంటి బ్రహ్మవేత్తలవల్ల నీకు అపజయం కలుగుతుందనుకుంటావేమో (బ్రాహ్మణతేజమజేయమంటివే), కానీ నువ్వు నాలోంచి పుట్టిన ఈశ్వరాంశసంభూతుడివి (మదంశ సంభవుడవై), నీకు అపజయం అన్నదే లేదు (నీకు నసాధ్యమయ్యెడన్)."

వీరభద్రుడు యజ్ఞవాటిక దగ్గరకి వెళ్ళిన తర్వాత కథ మనకి తెల్సినదే. దక్షుడి తలపోయాక మేక తల తగిలిస్తారు. దానితో గర్వంపోయి శివకేశవులకి భేదం లేదని తెలుసుకున్నాక (శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే) యజ్ఞం పూర్తిచేసి శివుడికి భాగం ఇస్తాడు. చివరకి మనకి తెలిసేదేమిటంటే భగవంతుడి కోపం వల్ల దక్షుడికి తానేమిటో, భగవంతుడంటే ఎటువంటివాడో తెలిసి వస్తుంది. అమ్మవారు తన మానవదేహం వదిలేసి శివైక్యం చెంది, పార్వతిగా అర్ధనారీశ్వరి అవుతుంది. మొత్తానికి శివుడి కోపం చివరకి మంచి జరగడం కోసమే అని ప్రపంచానికి తెలిసివస్తుంది.

ఇంకో కోణంలోంచి చూద్దాం. భగవంతుడంటే ఎటువంటివాడు? ఏ మహర్షి చెప్పడం చూసినా భగవంతుడంటే "కరుణా సముద్రుడు." దీన్నే క్రితం నెలల్లో రాసిన ఒక పద్యంలో కంచెర్ల గోపన్న 'దాశరథీ కరుణాపయోనిధీ' అంటూ చెప్పడం చూసాం కదా? కరుణాసముద్రుడైన భగవంతుడికి కోపం అనేదే రాదు. మనం ఎన్ని తప్పులు చేసినా సరే ఆయన "పోనీలే, మరోసారి ప్రయత్నించు," అంటూ మనకూడా ఉండేవాడే. మరి మనం చేసే కొన్ని బుద్ధిలేని పనుల వల్ల భగవంతుడికి కోపం రావచ్చు; దాని మూలాన మనకో దెబ్బ తగిలినా అది మన మంచికే కనక అప్పుడు మనకి తగిలే దెబ్బ సరైన చోట తగిలి మంచి దారిలోకి వస్తాం. ఇది తల్లి తండ్రులు పిల్లల్ని ఎప్పుడైనా ఒక దెబ్బ వేయడం, ఏదైనా అడిగితే కాదు అనడం వంటిది. దానివల్ల పిల్లలకి మంచే తప్ప చెడు జరగదు.

దక్షుడి తల పోవడం అంటే అహంకారంతో ఉన్న పాత గుణాలుపోయి కొత్తవి, అణుకువతో ఉన్నవీ వచ్చాయి అని తెలుసుకుంటే చాలు. మరో రెండు విషయాలు; మొదటిది - భగవద్వీలల వల్ల మొత్తం లయం అవుతున్నప్పుడు ఎటువంటి బ్రహ్మవేత్తలు కూడా దాని నుంచి తప్పించుకోలేరు. చావు అనేది తప్పనిసరి – ప్రపంచంలో ఏది జరిగినా జరగకపోయినా. దీన్నే గీతాచార్యుడు మరో విధంగా చెప్పడం గమనించవచ్చు "జాతస్య హి ధృవో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ.." రెండోది పోతన శివభక్తుడు కదా? రామభద్రుడు భాగవతాన్ని రాయమన్నా, ఈ పద్యంలో పోతన శివభక్తి కొట్టొచ్చినట్టూ కనబడుతూ ఉంటుంది.


# తుమ్మూరి రాంమోహన్ రావు



## పత్రికా విలేఖర ప్రపితామహుడు పెండ్యాల వామన్ రావు

'ఏనాటికైనా జీవితం అందించే మంచి కానుక, విలువైన పనిలో కష్టించి పనిచేసే అవకాశం ఇవ్వడమే'
-థియోడర్ రూజ్వెల్ట్

అలాంటి అద్భుతమైన అవకాశాన్ని అంది పుచ్చుకున్న అరుదైన వ్యక్తి శ్రీ పెండ్యాల వామనరావు.తనకు ఇష్టమైన జర్నలిజాన్ని ఎంచుకుని అతి చిన్న వయస్సులోనే (20 ) ప్రముఖ ఆంగ్ల పత్రికలో చేరి దాదాపు ఇరవై సంవత్సరాలు పని చేసిన తరువాత 1969 లో చీఫ్ అఫ్ బ్యూరో గా ఉద్యోగం విరమించుకుని ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డిగారి హయాం లో ఆంధ్రప్రదేశ్ సమామాచారశాఖ సంచాలకులుగా పనిచేశారు.ఐదేళ్ల పదవీ కాలం తరువాత బిర్లా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీలో చేరి జీవితాంతం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మెంబరుగా సేవలందించారు.నౌబక్ పహాడ్ పై ఈ రోజు ఎంతో వైభవంగా కనిపించే బాలాజీ(బిర్లా)చెంపుల్,ప్లానెటేరియం,సైన్స్ మ్యూజియం ఆయన పర్యవేక్షణలో నిర్మించబడినవే. ఒకసారి జర్నలిస్టవుతే జీవితాంతం జర్నలిస్టే అన్న నానుడి ఆయన పట్ల అక్షరాలా నిజం. ఒకవైపు బిర్లా గ్రూపులో పనిచేస్తూనే,పలు ఆంగ్ల పత్రికలకు వ్యాసాలు రాస్తూనే ఉండేవారు. మరో వైపు స్వాతంత్ర్యానికి పూర్వం స్వతంత్ర టైమ్స్ పత్రిక నెలకొల్పి నిఖార్సైన జర్నలిస్టుగా పేరుగాంచిన ఖాసా సుబ్బారావు స్మృతిలో న్యూ స్వతంత్ర టైమ్స్ ఆంగ్ల మాస



పత్రిక ను స్వయంగా నడిపించేవారు. ఖాసా సుబ్బారావు వామన్ రావుగారికి పిల్లనిచ్చిన మామ. అంపశయ్య పై భీష్ముడి లా ఉన్నా అంతిమ ఘడియ వరకూ ఆ పత్రికను నడిపించిన ప్రముఖ పాత్రికేయులు వామన్ రావు.

నైజాం హయాంలో భారత ప్రభుత్వ ప్రతినిధియైన కే.యం. మున్షీతో,రాజాజీతో,ప్రసిద్ధ గాయనీమణి యం.ఎస్.సుబ్బలక్ష్మి గారితో సన్నిహిత సంబంధాలు కలిగిన వామన్ రావు మాజీ ప్రధానమంత్రి పి.వీ.నరసింహారావుతో ఏకవచనంతో సంబోధించేంత చనువు గలిగిన వారు.

భావన్స్ దర్నల్ అనుబంధ సంస్థ అయిన భారతీయవిద్యా సంస్థలలో ప్రముఖ పాత్ర ఆయనది.అది కాకుండా ఇంకా పలు విద్యా,కళా సంస్థలకు సలహాదారుగా ఉన్న వామన్ రావు గారు మంచి కళా ప్రియులు.వారు ప్రజాసంబంధాలు మరియు సమాచారశాఖ డైరెక్టరుగా ఉన్న సమయంలో అంతరించి పోతున్న తోలుబొమ్మలకు పునరుజ్జీవనం కల్పించారు.ఆంధ్రప్రదేశ్ మాసపత్రికను తన పత్రికారంగ ప్రతిభతో తీర్చిదిద్దారు. బిర్లా మందిర్ కళా ప్రాంగణంలో అనేకమంది కళాకారుల ప్రదర్శనలేర్పాటు చేసి ప్రోత్సహించారు.

(33 వ పేజీ చూడండి)

# ఆదూరి హైమవతి



# ఒకటే వృత్తి

శ్రీరామచంద్రుడు 'పితృదేవోభవ' అనే సిద్ధాంతానికి కట్టుబడ్డ ఆదర్శ కుమారుడు. ఆయన తన తండ్రి పినతల్లికి ఇచ్చిన మాట పాటించడం కోసం ,భర్య అయిన సీతతో, అన్నను వదలి ఉండలేని తమ్ముడు లక్ష్మణుడు వెంట రాగా వనవాసానికి బయల్దేరాడు.

దార్లో వారు గంగానదిని దాటవలసి వచ్చింది.

గుహుడు అనే పడవ నడిపే వాడు మహా రామభక్తుడు, ఆయన్ని సీతా, లక్ష్మ ణ సమేతంగా నావలో దాటించిన సమయంలో జరిగిన చిత్రం ఇది.

గుహుడు రామభక్తుడే.ఐనా అతడు, శ్రీరాముడు పూర్వం విశ్వామిత్రుని వెంట నడుస్తూ యజ్ఞసంరక్షణార్థం, రాక్షసులను హతమార్చను విశ్వామిత్రుని వెంట ఆశ్రమానికి నడచి వెళ్తున్నపుడు, ఆయన కాలి స్పర్శకు ఒకరాయి స్త్రీ గా మారిన[అహల్య] విషయం విని ఉండటం వలన, శ్రీరాముడు తన నావలో కాలు పెడితే తన నావ కూడా స్త్రీ గా మారిపోతుందని, భయపడి ఆయన కాళ్ళు కడిగి ఏమాత్రం ధూళి లేదని నమ్మకంకలిగాక మాత్రమే శ్రీరాముని తన నావలో అడుగు పెట్టనిచ్చాడు.

అంతరార్థం - ఆరూపంగా శ్రీరాముని పాదాలు కడిగే అవకాశం సంపా దించుకో నే!.

అంతేకాక ఏమీ చదువుకోని ఓపల్లె వాడైన పడవవాడు మన అందరికీ ఎంతో చక్కని సందేశం ఇచ్చాడు. అదేమంటే--

శ్రీరాముని పాదాలు కడిగిన తర్వాత గుహుడు, రాముని, సీతను, లక్ష్మణుని పడవలో ఆవలి ఒడ్డుకు చేర్చుతున్న సమయంలో, శ్రీరాముడు సీతామాతతో 'సీతా! మనల్ని నది దాటిస్తున్న ఈ పడవ వానికి ఏదైనా ఇవ్వను నా వద్ద ఏమి లేదు.నాకు సంబంధించిన సర్వమూ దానధర్మాలక్రింద ఇచ్చేసి వచ్చాను కదా! ఈ వృత్తిలో జీవిస్తున్న ఇతనికి ఏమీ ఇవ్వకపోడం ఉచితం కాదు. ఎవ్వరి నుంచీ ఉచిత సాయం పొందకుడదుకదా! నీ వద్ద ఏమై నా ఉంటే ఇతనికి ఇవ్వడం, బావుంటుంది' అని చెప్తాడు.

దానికి వెంటనే సీతామాత తన వేలి కున్న ఉంగరాన్ని తీసి శ్రీరామునికి ఇచ్చి, గుహునికి ఇవ్వ మని సౌజ్ఞ చేసింది.

శ్రీరాముడు ఆ ఉంగరాన్ని అందుకుని, గుహునితో 'ఓ నావికా! మమ్ము నీవు శ్రమపడి గంగానదిని దాటిస్తున్నావు. నీ శ్రమను మేము ఉచితంగా పొందకూడదు, కనుక నీవు ఈ ఉంగరాని స్వీకరించవలసింది" అంటూ ఆ ఉంగరాన్ని అతనికి ఇవ్వబోయాడు.

గుహుడు వెంటనే "ఓ రామ ప్రభూ! ఒకే వృత్తిలో ఉన్నవారు పరస్పర సహాయానికి, ధనం తీసుకోడం ఉచితం కాదు. ధర్మమూ కాదు" అన్నాడు.

దానికి ఆశ్చర్యంగా శ్రీరాముడు "ఏమీ! ఒకే వృత్తిలో ఉన్నవారు పరస్పర సహాయానికి బదులుగా ధనం తీసుకోరాదా?" అని అడిగాడు.

గుహుడు "ఔను ప్రభూ! ఒక మంగలి తనవలె అదే వృత్తిచేసే మరో మంగలికి తలపని చేస్తే ధనం తీసుకోడం ధర్మంకాదు' అన్నాడు.


శ్రీరాముడు అది విని "అలాగా !" అని బదులివ్వగా-- గుహుడు "ఔను ప్రభూ! అలాగే ఒక రజకుడు తన లాంటి వృత్తి చేసే మరో రజకునికి ఏదైనా సాయం చేసినపుడు అతని వద్ద నుండి

ధనం తీసు కోడం కూడా అధర్మమవు తుంది." అన్నాడు .
శ్రీరాముడు తలపంకించి "సరే ఇంతకూ నీవేమంటున్నావో నాకు అర్థం కావడంలే దు. వివరంగాచెప్పు. ఎలామనిద్దరిదీ ఒకే వృత్తి అవుతుంది?" అని అడిగాడు గుహుని.
దానికి గుహుడు భక్తితో శ్రీరామునికి నమస్కరించి "ప్రభూ ! నేను మీ వద్ద ధనం తీసు కోడంనేను ఇందాక చెప్పిన పద్ధతిప్రకారం న్యాయ సమ్మతం కాదు. అందు వల్ల నేను మీరివ్వ జూపుతున్న ఉంగరం రూపం లోని ధనాన్ని స్వీక రించలేను" అన్నాడు.
లక్ష్మణుడు కోపావేశంతో ముందుకు ఉరికి "ఏమీ నీ వృత్తీ, శ్రీరాముని వృత్తీ ఒకటా? సుక్షత్రియుడైన శ్రీరా-మచంద్రుడెక్కడ, పడవ నడిపే నిరక్షరాస్యుడవైన, అతిసామాన్య పల్లెవైన నీవెక్కడ? " అన్నాడు.
శ్రీరాముడు, లక్ష్మణుని చెయ్యి పట్టి ఆపి "ఆగు లక్ష్మణా! ఇతని మాటలు పూర్తిగా అర్థం చేసుకోనీ. తొంద-రపడకు"అని చెప్పి,
" సోదరా! గుహా! మరి నీదీ, నాదీ ఒకే వృత్తి ఎలా అవుతుందో వివరంగా చెప్పు, మా తమ్ముడు లక్ష్మణునికి కోపంవస్తోంది", అని అడిగాడు
గుహుడు" శ్రీరామచంద్ర ప్రభో!" అని చేతులు జోడించి భక్తితో,
"నేను అందర్నీ ఈ నది దాటి స్తున్నాను, తమరు అందర్నీ భవ సాగరం దాటిస్తున్నారు. ఈ సంసార సాగరాని దాటించడం నదిని దాటించడమంత తేలికైన పని కాదు. ఐనా 'దాటించడం' అనేది ఒకే రీతి ఐన పని కదా! అలా తమరి పనీ నా పనీ ఒకటే కదా! ఒకే వృత్తిలో ఉండే వారి వద్ద ధనం తీసుకోడం మా వృత్తి ధర్మం కాదు మన్నించం డి మహాప్రభో!" అని రాముని పాదాలంటి నమస్కరించాడు గుహుడు.
శ్రీరామచంద్రుడు ఎంతో ప్రేమతో గుహుని తన వద్దకు తీసుకుని కౌగలించు కుని "ఈ రోజు నుండి నీవూ నాసోదర సముడివి. నా సోదరులలో ఒకనివే! ", అన్నాడు.
భగవంతునిప్రేమకు తరతమ భేధభావనలు ఉండవు. భక్తి, స్వచ్ఛ హృదయం మాత్రమే భగవంతునికి కావలసినది.

---

## పత్రికా విలేఖర ప్రపితామహుడు పెండ్యాల వామన్ రావు

(31 వ పేజీ తరువాయి)



12 జూన్ 1928 లో కరీంనగర్ లో జన్మించిన వామన్ రావుగారు వ్యాసకర్త పితామహునికి మేన-ల్లుడు.వామన్ రావు గారి విద్యా-భ్యాసం వరంగల్, హైదరాబా-దులలో సాగింది.91 వ ఏట 15 ఫిబ్రవరి 2019 న దివంగతు-లైన వామన్ రావు గారు అనేక పురస్కారాలు పొందినా అతి నిరాడంబరులుగా,సేవా తత్ప-రులుగా,ఎందరెందరికో మార్గ-దర్శిగా,అనేకమందికి గుప్తంగా ఆర్థిక సహాయాన్నందజేస్తూ జన్మ ధన్యం చేసుకున్న మహానుభావు-డు.తెలంగాణాలో పుట్టినందుకు తెలంగాణా వారు గర్వించవల-సిందే కాని ఆయన పరిచయాలు దేశవ్యాప్తంగా ఉన్నందున దేశం గర్వించదగిన మహానుభావుడు అని చెప్పకతప్పదు.

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

మరుసటి సంవత్సరం పీర్ల పండక్కి సుబ్బారాయుడు 'బద్వేలి పిచ్చి' వేషం వేసి ఊరు అందరినీ ఆశ్చర్యపరిచాడు. పిల్లల్ని ఆహ్లాదపరిచాడు. చీర కట్టుకుని ముఖానికి నల్లని బొగ్గు పూసుకుని అచ్చం 'బద్వేలి పిచ్చి' లాగే చూపు, మాట, కదలిక ... ఇలా ఏ ఏటి కాయేడు సృజనాత్మకంగా సాగేవి పీర్ల పండగ వేషాలు.

పీర్ల పండగ చివరి రోజు గుండం కాల్చి, అందులో దూకటం, పీర్ల ఊరేగింపు వుంటాయి. మా ఊర్లో 'గుండం' లేదు కాబట్టి అందరూ పలుగురాళ్ళపల్లెకు చేరుకునే వారు. అక్కడ ఇది చాలా పెద్ద పండుగ. దాదాపు పది పల్లెల నుండి అక్కడకు చేరుకుంటారు. ఆరోజు ముఖ్య ఆకర్షణలు రెండు. ఒకటి 'పులి వేషం'. ఈ పులివేషం వేసేవాళ్ళు వొంటికి పులి లాగా రంగులు వేయించుకుని అడుగు వేస్తారు. దరువు ప్రకారం అడుగు వేయటం, తప్పెట్లు మ్రోగుతుంటే ... రెండు చేతుల రెట్టలకు తాళ్ళు కట్టి ఇద్దరు పులిని పట్టుకుంటే ... దరువుకు అనుగుణంగా అడుగులు వేస్తూ ... పులి పంజా విసరటం..., పులిలాగా గంతేయ్యటం పులిలాగా మనుషుల మీదకి దుమకటం ... చాలాసేపు ఈ విన్యాసాలు జరిగేవి.

రెండవ ముఖ్య ఆకర్షణ 'గుడ్డల సవాల్'. పలుగురాళ్ళపల్లె నడి సెంటర్ లో, బసవయ్యగారి ఇంటి ముందు, నాలుగు దార్లు కలిసే చోట, ఉదయం నుండి అటునుండి ఇటుకు పెద్ద తాళ్ళు కట్టి, పాత బట్టలు, చీరలు, జాకెట్లు, గోనెసంచులు, పాంట్లు, అండర్ వేర్లు, అన్నీ తాళ్ళ మీద ఆరవేసి, వేలం పాట మొదలు పెడతాడు 'గూగుడు'. నాకు తెలిసి ఈ గూగుడుకి దాదాపు అప్పటికే అరవై ఏళ్ళు ఉంటాయి. ఆరున్నర అడుగుల ఎత్తు, పొడవైన గడ్డం, వెడల్పాంటి టోపీ పెట్టుకుని, టై కట్టుకుని, సూటు, బూటు వేసుకుని, వేలంపాట మొదలు పెడితే...నవ్వులే నవ్వులు.

పాత చిరిగి పోయిన చింకి చీరను తీసి ... ఇది 'మూగమనసులు' లో సావిత్రి శోభనం రోజు కట్టుకున్న చీర ... సర్కారు వారి పాట... వంద రూపాయలు ... ఒకటి, రెండు అనేలోపే.. రెండు వందలు.... మూడు వందలు- అంటూ పోటీ పడి, చివరికి పోటీ పడిన వారి పేరు చెప్పకుండా ఏదో ఒక పెద్దమనిషి పేరు చెప్పి ... ఫలానా వారి పాట.. వెయ్యి నూట పదహార్లు ...ఒకటి..రెండు... మూడు అని చీర విసిరేసేవాడు.

ఆ గుడ్డల్లో ఎలిజబెత్ మహారాణి పెద్దమనిషైనప్పుడు కట్టుకున్న పొట్టి లంగా దగ్గర నుండి, ఆమె పెళ్ళికి కట్టుకున్న గౌను, మహారాణిగా సింహాసనం ఎక్కినప్పుడు కట్టుకున్న గుడ్డల వరకూ



ఉంటాయ్. అలాగే ఇంగ్లాండ్ మహారాజు దగ్గర నుండి పెద్ద పెద్ద సినిమా నటులు, నటీమణులు, రాజకీయ నాయకులు, వీళ్ళందరూ తొడుక్కున్న గుడ్డలు, పాంట్లు, చొక్కాలు, పంచెలు... అన్నీ వేలం వేస్తారు. గూగుడు మాటల చాతుర్యం, పదగుంభనం, గుడ్డల గురించి విశ్లేషణ వింటూనే శ్రోతలు కట్టు కదలరు. కడుపుబ్బ నవ్వుకుని కానీ ఇంటికి వెళ్ళరు.



చీకటి పడే సమయానికి ఈ పాతగుడ్డలన్నీ పెట్టెల్లో సర్దిపెట్టి, భద్రంగా దాచి ఉంచుతూ, ప్రతి సంవత్సరం కొత్త రకం పాత బట్టలు సేకరిస్తూ బ్రతుకుతాడు 'గూగుడు'. ఆ తరవాత ఎవరికీ పెద్దగా కనపడడు. ఈ ఒక్కరోజు కోసమే తానూ బ్రతికేదన్నట్టు బ్రతుకుతాడు.

సాయంత్రం చీకటి పడిన తరువాత పీర్లు నీళ్ళలో పడితే, సాయిబులందరు 'అల్విదాయ్'.. అంటూ పాడుకుంటూ ఇళ్ళకు చేరుకుంటారు. పీర్ల పండగ ముగుస్తుంది.

***********

## 9) ఆటలు

పల్లెటూళ్ళలో అణా పైసా ఖర్చు లేకుండా రకరకాలైన ఆటలు ఆడేవారు. అందులో శారీరక శ్రమ, ఆటలోని చాతుర్యాలు ఇమిడి ఉండేవి. పెద్దల ఆటలు, మగపిల్లల ఆటలు, ఆడపిల్లల ఆటలు వేరువేరుగా వుండేవి. మగపిల్లలు అప్పుడప్పుడు పెద్దలు చూడకుండా పెద్దల ఆటలు ఆడేవాళ్ళు. ఆడపిల్లలు మాత్రం మగపిల్లల్ని తమ ఆటల్లోకి రానిచ్చేవాళ్ళు కాదు. కానీ ఒకటి రెండు ఆటలు, ఆడపిల్లలు మగపిల్లలు కలిసి ఆడేవారు.

పులిజీతం, నక్కాముట్టి, మున్నూట నాలుగు, జిగ్గు బగ్గు జోకరు లాంటివి మగవాళ్ళు పెద్దలు ఆడేవాళ్ళు. బారాకట్ట, పిచ్చాలాట, ఆడవాళ్ళు పెద్దలు ఆడేవాళ్ళు. పుట్టచెండు, బొంగరాలు, గోలిగుండ్లు, డోలు పట్టె, బలిగుడు లాంటివి మగపిల్లలు ఆడేవాళ్ళు. అచ్చెనకాయలు, తొక్కుడుబిళ్ళ, ముగ్గులు ఆడపిల్లలు ఆడేవాళ్ళు. దాగుడుమూతలు, చింతబజ్జ లాంటివి ఆడపిల్లలు మగపిల్లలు కలిసి ఆడేవాళ్ళు.

'పులిజీతం' పెద్దలు ఎక్కువగా ఆడతారు. నాలుగు పులులను పదహారు మేకలు కట్టివేయాలి. అంటే,,,, నాలుగు గులకరాళ్ళు పులులుగా, పదహారు చిన్న చిన్న రాళ్ళు మేకలుగా వాడతారు. సమబాహు త్రిభుజాకారంలో శీర్షం నుండి భూమికి లంబాన్ని గీచి, శీర్షం వైపు కొంత స్థలం వదలి మధ్యలో రెండు దీర్ఘచతురస్రాలు ఒకదానికి ఒకటి తగలకుండా గీస్తారు. నాలుగు పులులను శీర్షంపై ఒకటి, దీర్ఘచతురస్రాలు, లంబం ఖండించుకునే బిందువుల వద్ద మిగిలిన మూడు పెడతారు. భూమిపై నున్న మూలలో తప్ప అన్ని మూలల్లో మేకలు పెడతారు. పులి మేకను దాటి తరువాత ఖాళీ స్థలం లోకి వెళితే మేకను తిన్నట్టు...



కానీ పులిని మేకలు తినలేవు. కాబట్టి కదలకుండా బంధించాలి. చెస్ లో చెక్ పెట్టినట్లు ఈ ఆట గంటల తరబడి పడుతుంది. ఎత్తుకు పై ఎత్తు వేస్తూ ఆటగాళ్ళు నిమగ్నమైపోతారు. సత్రం బండ మీద, రావిచెట్టు అరుగు మీద పులుల స్థానంలో పెద్ద.. గుంతలు పడివుంటాయ్.

జిగ్గు, బగ్గు, జోకరు, మున్నూట నాలుగు (త్రీనాట్ ఫోర్) ఇవి పేకాటలు. పెద్దలు అప్పుడప్పుడు డబ్బులు పెట్టి ఆడతారు. ఇందులో మా నాయన కూడా వుంటాడు. పిల్లల కంటపడితే పాడైపోతారని మా ఇంటి ఎద్దుల కొట్టంలో అరుగుపై ఆడేవాళ్ళు.

కొండోళ్ళ చిన్నబుడ్డోడు ఆట మొదలుపెడితే రాత్రింబవళ్ళు ఆడేవాడు. నాలుగు రాళ్ళు వచ్చినా, లేదా పోయినా మా నాయన లేచి వచ్చేవాడు.

నక్కాముట్టి. ఇది కూడా పెద్దలు ఆడే ఆటే. ఒక వృత్తం గీచి మూడు వైపులా గీతాలు గీస్తారు. పై భాగాన ఒక గీత, ఎడమ భాగాన రెండు గీతలు, క్రింద మూడు గీతాలు, గడియారంలో పన్నెండు, మూడు, తొమ్మిది లాగ. ఈ మూడు వైపు గీతలపై పందెం కాస్తారు. ఎకువగా ఈ పందెం 'బీడీలు' పెట్టేవారు. సన్నని రాళ్ళు రెండు, మూడు వరసలు కుప్ప పోసి అందులో నుండి పిడికెడు తీసి నాలుగు, నాలుగు వంతున కుప్పలు పెట్టాలి. చివరకు ఒక్క రాయి మిగిలితే ఒక్క గీత మీద వున్నన్ని బీడీలు వాళ్లకు ఇవ్వాలి. అలా ఎన్ని రాళ్ళు మిగిలితే.. అన్ని గీతల మీద పెట్టినవాళ్ళకు ఇవ్వాలి. నాలుగు రాళ్ళు మిగిలితే నక్కను తొక్కినట్టే. అన్నిటి మీద వున్నా బీడీలు కుప్పలు పెట్టేవాడు తీసుకోవచ్చు. ఇలా రాళ్ళు పెట్టడం వరుసగా ఒక్కొక్కరి వంతు వచ్చేది. బీడీలు ఒడి నిండా నింపుకునేవాళ్ళు.

ఈ ఆట అప్పుడప్పుడు నేను కూడా ఆడేవాడిని కానీ మా తమ్ముడు రవీంద్రశర్మ నక్కాముట్టి, జిగ్గు బగ్గు జోకరు, మున్నూట నాలుగులో చేయి తిరిగిపోయాడు. పెద్దయిన తరువాత పెళ్ళిళ్ళలో చాలా భాగం ఆట వాడే గెలుచుకునేవాడు. చాలామంది పెళ్లిళ్లకు వచ్చి రాత్రింబవళ్ళు పేకాడుతూ పెళ్లి కూడా చూడరు... భోజనం కూడా చెయ్యరు.

## డోలు పట్టె

వెన్నెల రాత్రుల్లో యువకులు ఆడే ఆట 'డోలు పట్టె'. ఈ ఆటలో ఇరుజట్లలో ఏడుమంది వుంటారు. ఒకరు మధ్యవర్తి. అంటే 'రెఫరీ' లాగా. ఈ మధ్యవర్తిని 'డోలుకాడు' అంటారు. 'డోలు' అనేది శబ్ద వాయిద్యం . దాన్ని రెండు వైపులా వాయిస్తారు. డోలుకాడు కూడా ఇరువైపులకు చెంది వుంటాడు. ఆరు పట్టెలు - అంటే వెడల్పాటి గీతలు ఇరవై అడుగుల పొడవున నీళ్ళతో వారు పోస్తారు. పట్టె పట్టెకు మధ్య ఆరు అడుగులు వెడల్పు వుంటుంది. ఈ పట్టెలకు సరిగా మధ్యలో ఇంకొక పట్టెను గీచి అటు ఆరు అడుగులు, ఇటు ఆరు అడుగులు పొడిగిస్తారు. ఈ పట్టెపై డోలుగాడు అటూ ఇటూ పరిగెట్టుతుంటాడు అందుకే దీనికి డోలు పట్టె అని పేరు.

ఇరుజట్లలో పందెం గెలిచిన జట్టు ఆట మొదలుపెడుతుంది. అందరు ఒక వైపు నిలుచుంటారు. ఇంకొక జట్టు పట్టెలపై నిలబడతారు. ఒక్కొక్కరు ఒక్కొక్క

పట్టెపై నిలబడి పైనుండి కిందికి జట్టు సభ్యులను తాకుతారు. తాకితే ఆ సభ్యుడు అవుట్ అయిపోతాడు. డోలు పెట్టెను అటువైపున ఒక సభ్యుడు, ఇటువైపున ఒక సభ్యుడు వుండి పట్టె మార్చి పట్టెపై ఆరుమంది నిలబడతారు. డోలుపట్టెపై డోలుకాడు వుంటాడు. పట్టెమీద వుండే సభ్యుడు తన ప్రత్యర్థిని నిలవరిస్తాడు. పట్టెదాటిపోవటానికి ఈ సభ్యుడు అటు ఇటు పరుగెత్తి ప్రత్యర్థిని మభ్యపెట్టి దాటచ్చు. దాటేటప్పుడు డోలు పట్టె మీద నుండి పోయేటప్పుడు డోలుకాడు తాకినా ఈ సభ్యుడు ఔటవుతాడు.

డోలుకాని పట్టెల మీదినుండి పిలవటానికి డోలుపట్టెల చివర ఎదవ సభ్యుడు 'కుర్రు' పెడ్తూ వుంటాడు. 'కుర్రో...కుర్రో' అంటూ అరుస్తూ ఈ 'కుర్రుగాడి'ని తోలతానికి డోలుకాడు వచ్చినపుడు దిగే సభ్యులు కావలి కాసే సభ్యులను మభ్యపెట్టి తరువాత పట్టెకు పోవాలి. ఇలా అందరు సభ్యులు దిగితే అన్ని 'పాయింట్లు' వాళ్లకు. తరువాత కావలి కాసిన సభ్యులు దిగుతారు. దిగినవాళ్ళు కావలి కాస్తారు. డోలుకాడు మాత్రం ఎప్పుడూ కావలి కాసే జట్టుకే అనుకూలంగా వుంటాడు.

పుట్ట చెండు, గోలి గుండ్లు, బొంగరాలు, చిల్లిగోడి మగపిల్లలు పౌరుషానికి ఆడేవి. గోలిగుండ్లయితే 'దోకుల్లా' 'పిసుకుల్లా' అనేసి కూడా ఆడేవాళ్ళు. ఓడిపోయినవాళ్ళు మళ్ళీ గెలిచే వరకూ ఓడిన జట్టును, గెలిచినా జట్టువాళ్ళు చెవులు పిసుకుతూనే వుంటారు. 'దోకుల్లా'లో గోలీని ఎంత దూరం కొడితే ఓడినవాడు అంత దూరాన్నించి మోచేత్తో ఈ గోలీని 'దోకాలి', బద్దిగుంత వరకు దోకాలి. ఈ గోలీలు కూడా పగిలిపోయిన ఇసురాళ్ళతో ఎవరి గోలీలు వాళ్ళు మలుచుకునేవారు. ఆ తరువాత గాజుగోళీలు వచ్చాయి. ఈ రాతిగోలీలు భద్రంగా దాచిపెట్టుకుని ఆడేవాళ్ళు.



బొంగరాల సీజను వచ్చేటప్పటికి పిల్లలు ఎగబడి బొంగరాలు తయారు చేయించుకునేవారు. ఊరిలో వుండే ఏకైక 'పత్తి రాట్నాల' పీరయ్యకు మంచి గిరాకీ వుండేది. రేపు చేస్తా.. ఎల్లుండి చేస్తా... ఓ బీడీకట్ట పట్టుకురా పో .. అని తిప్పుకునేవాడు. ఆయన చేయబోయే బొంగరం గురించి చెప్తూ వుంటే .. అప్పటికప్పుడే బొంగరాల ప్రపంచంలో రారాజుగా వెలిగిపోయినట్లు భావించి 'బీడీకట్ట' సమర్పించుకునేవారు.

'పుట్టచెండు' ఎవరికీ వారు కుట్టుకునేవారు. రెండు మూడు చింతపిక్కలు గుడ్డలో చుట్టి దానిపై గుడ్డపీలికలు చుట్టుకుంటూ పోతారు. చివర్లో సూది దారంతో కుట్టిచెండు తయారుచేస్తారు.

తొక్కుడు బిళ్ళ, అచ్చెనగాయలు పూర్తిగా ఆడపిల్లల ఆటలు ఆటలు. ఎప్పుడైనా మగపిల్లలతో కలిసి ఆడాలంటే ఆడపిల్లలు ఎగతాళి చేసేవాళ్ళు. ఇక ఆడపిల్లలు, మగపిల్లలు కలసి ఆడే ఆట దాగుడుమూతలు. ఈ ఆట ముఖ్యంగా వెన్నెల రోజుల్లో ఆడేవాళ్ళు. కనపడకుండా దాచి పెట్టుకోవటానికి వామిదొడ్లు, కళ్ళాలు, ఎద్దుల కొట్టాలు వుండేవి.

(ఇంకా ఉంది)

# బెత్తెడు స్వర్గం



## ఆంగ్ల మూలం : డా. పింగళి గోపి

తెలుగు సేత : ఎలెక్ట్రాన్

హేరీ నిశ్శబ్దమైన తన ఆఫీసు గదిలో దీక్షగా పనిచేసుకొంటున్న సమయంలో సెక్రటరీ హడావుడిగా తలుపు తోసుకొని లోపలికి ప్రవేశిస్తూ, "సార్,సార్! దాన్ని మనం కనుక్కొన్నాం! అది మనకి కనబడింది!" అన్నాడు ఉత్సాహం ఉరకలు వేస్తుండగా.

హేరీ తన ఉద్రేకాన్ని మొహంలో కనబడకుండా అణుచుకొని, తాపీగా లేచి అడిగాడు. "ఎక్కడ?"

"భారత్ ప్రాంతంలో ఓరుగల్లు అనే నగరంలో!" అన్నాడు సెక్రటరీ విష్వక్.

ఆ వార్త వినడంతో నాలుగేళ్ల కుర్రాడికి ఆటబొమ్మనిస్తే ఎంతగా సంతోషిస్తాడో ఆరు దశాబ్దాలు పైబడిన తన వయసులో కూడా అంతటి సంతోష తరంగాలు హేరీని నిలువునా ముంచేశాయి. అయినా తమాయించుకొన్నాడు.

"సరే! వెంటనే వెళ్దాం పద!" అంటూ కదిలాడు. ఇద్దరూ ఆఫీసు నుంచి బయటపడి, ఎనభైయ్యో అంతస్తు పైనున్న డాబామీదకు వెళ్ళే లిఫ్ట్ లో ప్రవేశించి డాబా మీదకు వెళ్లారు. ఆ డాబా మీద ప్రపంచంలోని ఏమూలకైనా రెండు గంటల్లోపుగా తీసుకుపోయే విహంగవాహనం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

ప్రపంచ సమితి కేంద్రం జెనీవాలో ఉంటుంది. హేరీ ఆ సమితికి ప్రధానాధికారి. జరుగుతోన్న సంవత్సరం కీ.శ. 2800. అప్పుడు ప్రపంచ దేశాలకి ప్రాంతాలని పేర్లు. ప్రాంతీయాధికారులు తప్ప ముఖ్యమంత్రులు లేరు. అధ్యక్షులు లేరు.

విహంగవాహనం పైకి లేచి, వెంటనే వేగం అందుకొంది. నేల అనేది దూరమైపోయి విస్తృతమైన, ఎత్తయిన భవన శిఖరాలు, విహంగ రవాణా వాహనాలు మట్టుకే కనబడ్తున్నాయి. అణుశక్తితో ఆకాశమార్గాన నడిచే కార్లు కొల్లలు కొల్లలుగా కనబడ్తున్నాయి. వాస్తవానికి ఈ వాహనాలు మూడువందల నుంచి నాలుగువందల అడుగుల ఎత్తుమధ్య ఒక వంద అడుగుల నడవలో ప్రయాణం చేయాలన్న నిబంధన ఉంది. నడవ నిడివి మరో రెండువందల అడుగులు పెంచాలని అభ్యర్థనలు వస్తున్నా సమితి ఒప్పుకోలేదు. మరిన్ని వాహనాలు పెరిగే అవకాశంతోబాటు అణువ్యర్థాలు పెరిగి వాతావరణం దెబ్బ తింటుంది. భావితరాలవారికి హానికరంగా మారిపోతుంది. హేరీకి ఇది ఇష్టం లేదు.

"మనం ఓరుగల్లు వెళ్ళడానికి ఎంతసమయం పడ్తుంది?" హేరీ అడిగాడు.

"గంటన్నరలోపుగానే సర్!" అన్నాడు సెక్రటరీ విష్వక్.

"కాస్త కునుకు తియ్యడానికి ప్రయత్నిస్తాను," అన్నాడు హేరీ. అన్నాడే కాని ఉరకలు వేస్తున్న ఉత్సాహం రెప్ప పడనీయలేదు.

ఆలోచనల్ని ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల మీదకు మళ్లించాడు. దేశాలమధ్య సరిహద్దు రేఖలు చెరిగిపోయాయి. అవిప్పుడు ప్రపంచంలోని ప్రాంతాలు మట్టుకే. రాక పోకలకు నిర్బంధ నియమావళులు లేవు.

21వ శతాబ్దాంతానికి ప్రపంచంలో అణుశక్తి యుద్ధాలు జరిగి సర్వనాశనమైయ్యే పరిస్థితి వచ్చేసింది. ఆ సమయంలో ఒక ప్రమాదకరమైన విశ్వాంతర రాక్షస గ్రహశకలం భూమివైపు పరుగు తీస్తోండడంతో ప్రపంచమంతా ఏకమైంది! ప్రపంచదేశాలు కూడబెట్టుకొన్న అణ్వాయుధాలనన్నింటినీ కీలకమైన ప్రదేశాలనుంచి క్షిపణుల ద్వారా ప్రయోగించి, ఆ గ్రహశకలాన్ని కుజగ్రహం దాటి రాకముందే దశకోటి తునకలుగా ఛేధించడం జరిగింది. అనతికాలంలోనే అవి ఉల్కలుగా ప్రపంచపౌరులకు నేత్రానందం కలిగించాయి. యిది ప్రపంచ శాస్త్రజ్ఞులు, సాంకేతికనిపుణులు సాధించిన ఘన విజయం.

చారిత్రికపరమైన విశిష్ట విజయం. మానవాళి ప్రవర్తనని మార్చివేసిన మహా భయంకర విజయం. ప్రపంచమంతా ఎల్లలు లేకుండా ఏకమైపోయి నవనాగరిక యుగం ఆరంభమైంది. శాస్త్ర విజ్ఞానం సహస్రముఖాలతో వికసించి భవనాలు పర్వతశిఖరాల్ని మించి ఎదిగాయి. కార్లు ఆకాశయానం చెయ్యడం సాధ్యమైంది.

హేరీ కింద పరుగెడుతున్న కాంక్రీట్ అరణ్యాలని చూడసాగాడు. ప్రతి చదరపుటంగుళం భూమి విలువ కోట్లు. స్వంతదారులనే సంగతి లేదు. నేల అంతా ప్రపంచ సమితిదే. 50 సంవత్సరాలకు మించని కౌలు చేసే అవకాశం మట్టుకు కల్పించడం జరిగింది. జీవనకాలం ప్రాగ్దిశ వేదాలు నిర్వచించే 120 సంవత్సరాలు అందుకొంది. భూవనరులన్నీ తగ్గిపోసాగాయి. వృక్షసంపద, అరణ్యాలు హరించుకుపోవడంతో ప్రాణవాయువైన ఆక్సిజన్ ని ఉత్పత్తి చేసే కేంద్రాలు అల్లుకు పోయాయి. ఇప్పుడు చెట్టనేది లేదు. మొక్కనేది లేదు. ఆఖరికి తుప్పనేది కూడా లేదు. హరితమనే పదానికి భాష్యం లేకుండా పోయింది. 29 వ శతాబ్దంలో అవసరంలేని జీవులకి, వస్తువులకి తావులేదు. ముఖ్యావసరాలకే పుష్కలమైన ఏర్పాట్లు. ఆహారమంతా విభిన్న రుచులతో శక్తిమాత్రల రూపంలో దేహం ఎదుగుదలకి తయారీ. హేరీ ఓ దీర్ఘనిశ్వాసం చేశాడు.

హేరీ సందిగ్ధావస్థలో పడ్డాడు. చరిత్ర, కళలు అతని విద్యార్థిదశలో అధ్యయనాలు. చాలా తక్కువమంది వీటిపైపు దృష్టి సారిస్తారు. తను చదివిన విశ్వవిద్యాలయంలో ఓ అయిదేళ్లలో తానొక్కడే ఈ అధ్యయనం చేశాడు. పద్యసాహిత్యం అంటే పడి చచ్చేవాడు. తోటివారు తన అభిరుచిని ఎద్దేవాచేస్తూ వింతగా చూసేవారు. కానీ ఉద్యోగంలో చేరినతర్వాత తన లౌక్యం, ఇంగితజ్ఞానం తత్ఫలితంగా అలవడిన రాజకీయపరిజ్ఞానం ఈ అత్యున్నత స్థానంలో కూర్చునేటట్లు చేశాయి. తనని సున్నితహృదయుడిగా, కార్యాచరణలో నియంతగా చూసేవారు. తనలాంటి వాళ్లు ప్రపంచంలో చాలా అరుదుగా ఉంటారని అందరూ అనుకొంటూంటారు.

"ఎలా కనుక్కొన్నావు?" హేరీ ఆలోచనల్లోంచి తేరుకొని సెక్రటరీని అడిగాడు.

"మన శోధనపరికరాలు అనుకోకుండా చాలా శక్తివంతమైన సంకేతాల్ని పసికట్టాయి."

" కారకుడైన ఆ వ్యక్తి ఎవరు?"

"పదవీ విరమణ చేసిన ఒక డాక్టరు!"

"అతగాడు ప్రమాదకరమైన సాహసం చేశాడు. అతడు చేసింది చట్టవిరుద్ధమైన నేరం! పట్టుబడితే శిక్ష చాలా కఠినంగా ఉంటుందని తెలియదా?"

"బహుశా అతను తెగించి చేసిన పని అనుకొంటాను. అతను చాలా చిన్న వైశాల్యం గల ప్రాంతాన్ని ప్రత్యేక లోహాలతో చేసిన డేరాతో కప్పివేశాడు. కొన్ని యాంటీ రాడార్ పరికరాల్ని అమర్చడం జరిగింది. దాంతో మన రాడార్లు కూడా పసిగట్టలేకపోయాయి."

"పదవీ విరమణ చేసిన ఒక డాక్టరు ఇదంతా చేశాదంటే నమ్మలేకపోతున్నాను!"

"అతనికి ఎలక్ట్రానిక్స్ ఇంజనీరైన మనవడు సాయంచేశాడని తెలిసింది. ఆ మనవడికి తాత అంటే చాలా ఇష్టమట. తాత కోరిక తీర్చడానికి మనవడు ముందుకొచ్చాడు."

హేరీ దీర్ఘనిశ్వాసం విడిచాడు. శిక్షాస్మృతి ప్రకారం ఇప్పుడిద్దరికీ జైలు శిక్ష తప్పదు! అయితే ప్రపంచ సమితి అధిపతిగా శిక్షాకాలం తగ్గించే అధికారం తనకున్నా, అలా చేస్తే అది ఆనవాయితీగా మారుతుంది. ఆ మనవడు తన భవిష్యత్ చేజేతులా పాడుచేసుకొన్నట్టే! ఒకసారి జైలు శిక్ష అనుభవిస్తే అది పాలనాధికారానికి అడ్డుకాదన్న 21వ శతాబ్దపు సరళ నియమావళి యిప్పుడు పనికి రాదు. 'చూద్దాం! ఏం జరుగుతుందో?' అన్న ఆలోచనతో మళ్ళీ రెప్పవాల్చడానికి ప్రయత్నించాడు కానీ, కుదరలేదు.

విహంగవాహనం గంటా యిరవై నిముషాల్లో ఓరుగల్లు చేరుకొంది. గమ్యానికి పైన 330 అడుగుల ఎత్తులో వాహనం ఆగింది. అక్కణ్ణుంచి మరొక చిన్నవాహనంలో యింటి డాబామీద నిశ్శబ్దంగా దిగారు. కాంక్రీట్ అరణ్యం మధ్య నాలుగు గోడల ప్రహరీ మధ్య చక్కగా కట్టిన యిల్లు. వాస్తవానికి తను జెనీవాలో ఉండే నివాస గృహం కూడా అచ్చు ఇలాగే ఉంటుంది. భవనాల మధ్యగా ఉండే ప్రపంచ-

లోని ఏ యిల్లైనా ఇలానే ఉంటుంది. ఉండాలి కూడా. కళ్ళకు గంతలు కట్టి అమెరికా ప్రాంతంలోని ఒక ఇంటి పెద్దమనిషిని ఆఫ్రికాలో ఉన్న యింటికి తీసుకు వెడ్తే ఆనవాలు కట్టలేని పరిస్థితి. ప్రతీ నగరంలోని భవనాలతీరు, ఇళ్ల తీరు ఒకేలా ఉంటాయి.

హేరీలో ఉత్సుకత పెరిగిపోయింది. డాక్టరు, మనవడు ఇంటి ముందరి గదిలో కూర్చుని కులాసాగా కబుర్లు చెప్పుకొంటున్నారు. హేరీ గదిలో ప్రవేశించగానే ఇద్దరూ విస్తుపోతూ లేచి నిల్చున్నారు.

"తప్పంతా నాదే! ఇందులో నా మనవడి ప్రమేయం లేదు, దయజేసి వాణ్ణి శిక్షించకండి!"అని డాక్టర్ ప్రాధేయపడ్డాడు.

హేరీ డాక్టరు కేసి చూస్తూ జాలిగా అన్నాడు. "నీ మనవడు చిన్నపిల్లాడేం కాదు! అతడికి నియమావళి విషయం తెలిసుండాలి!"

"నేనే నా మనవణ్ణి ఒత్తిడికి గురిచేసి ఒప్పించాను. జైలుశిక్ష పూర్తిచేసినా ఉద్యోగం దొరక్క వాడి జీవితం నాశనమైపోతుంది!"

"ఇది ప్రపంచసమితి నియమాలకి శతశాతం విరుద్ధమని మీకైనా తట్టి ఉండాలే?శిక్ష లేకుండా చెయ్యడం, శిక్షని తగ్గించడం సమితి నియమాలకి విరుద్ధంగా చెయ్యడానికి వీలు కాదు!"

డాక్టరు మౌనంగా ఉండిపోయాడు.

"సరే! చేసిందేదో చూపించు!" అన్నాడు హేరీ.

హేరీని పడకగదిలో ఉన్న ఒక ద్వారం ద్వారా ఒక చిన్న ప్రాంగణంలోకి తీసుకుపోయాడు. 30 అడుగులు పొడుగు, 15 అడుగులు వెడల్పు. హేరీ తలపైకెత్తి చూశాడు. పై కప్పు చూస్తే అది డాబా శ్లాబ్ లోని ఒక అంతర్భాగమే. కానీ అది ప్రత్యేక లోహాలతో చెయ్యబడింది. అందులోంచి సూర్యరశ్మి లోపలికి ప్రవహించగలదు. హేరీ ఈ విషయాన్ని వెంటనే గ్రహించాడు.

డాక్టరు ఉన్నట్టుండి అడిగాడు. "నేను చేసింది చిన్న నేరమే! అయినా ఉన్న పని వదులుకొని ప్రపంచసమితి అధినేత స్వయంగా రావడం చాలా ఆశ్చర్యకరంగా ఉంది! అయినా మీరెలా గుర్తించకలిగారు?"

"తాతా! ఈ ఉదయం ఒక్క నిముషంపాటు యాంటీ రాడార్ పరికరాల్ని అపుచేయవలసి వచ్చింది. అప్పుడు దొరికి పోయాము!" అన్నాడు మనవడు.

హేరీ చిన్నగా నవ్వుతూ 30x15 అడుగుల జాగా వైపు చూపుడు వేలుతో చూపించాడు. సెమెంటు కాంక్రీటుతో తాపడమైన యావత్ప్రపంచంలో-డాక్టరు ఇంటిలో మట్టుకు అ కాస్త జాగా పచ్చగడ్డితో నవనవలాడిపోతోంది! హేరీ తన జోళ్లు విప్పి, పచ్చికబైలు మీద తాదాత్మ్యంతో సున్నితంగా అడుగులు వేయసాగాడు. ఎన్నిసంవత్సరాల స్వప్నమో సాకారమైంది. మధురాతిమధురమైన ఆ క్షణంలో తాతా ,మనవల శిక్ష సంగతి మరిచిపోయాడు. అంతర్జాలంలో వందల సంవత్సరాలనాటి ఓ గేయ సాహిత్యగ్రంథంలో చదివిన గేయ పాదాలు గుర్తుకొచ్చాయి.

నీరెండలో శాద్వలము దృశ్యకావ్యానికి ప్రతీకగా ఆహ్వానిస్తోంది
అచేతనంగా పచ్చికబైలుమిద నా పాదాలు నడవసాగాయి
అరికాలులో ఆయవసమిచ్చిన స్పర్శాసుఖం
ఇంతవరకూ ఏ కోమలాంగి కరస్పర్శా ఇవ్వలేదు!


**రచయితలకు విజ్ఞప్తి**

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు



చైతన్యం సంకల్ప బలం

**చందా రేట్లు**

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
A/c No. 1626201002070 - Canara Bank
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
**చైతన్యం**
సామాజిక విలువల మాస పత్రిక
ప్లాట్ నంబర్ 45058
జనప్రియ ఉటోపియా
హైదర్ గూడ , అత్తాపూర్
హైదరాబాద్ - 500 048
Email: teega51@gmail.com
visit: www.chaitanyam.net

# భువనచంద్ర

# మోక్షమంటే





"సృష్టిలో తీయనిదీ, అద్భుతమైనదీ ఏదీ?" అడిగారు ముత్తుస్వామిగారు. ముత్తుస్వామిగారంటే తమిళులు కాదు. పదహారణాల తెలుగువాడే. వాళ్ళ నాన్నగారికి సంగీతత్రయంలోని ముత్తుస్వామి దీక్షితులు గారంటే పరమ భక్తి, పంచ ప్రాణాలూ. అందుకే లేకలేక పుట్టిన కొడుక్కి 'ముత్తుస్వామి' అని పేరు పెట్టుకున్నారు.

"తీయనిది తేనె, పంచదార ఇంకా బెల్లపు పాకం, చక్కగా పండిన ఫలాలు, etc, etc." అన్నాడు ఉపాధ్యాయుల సుబ్బయ్య.

"ఇక అద్భుతమైనవంటే చెప్పక్కర్లేదు. ప్రపంచం లోని ఎయిట్ వండర్స్ ఉన్నాయి కదా!" నవ్వాడు కొండపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు.

"అవి ఎప్పటి కథలో! ఇప్పుడు నింగిలోకి దూసుకువెళ్ళే ప్రతి గ్రహాంతర నౌకా, ప్రతి శాటిలైటూ ఓ అద్భుతమే. అయినా, అన్నింటినీ తన ధీశక్తితో సృష్టించిన మానవ మేధస్సు కన్నా గొప్పదీ, అద్భుతమైనదీ సృష్టిలో మరేదీలేదు" స్పష్టంగా అన్నాడు డాక్టర్ కృష్ణారెడ్డి.

"అయ్యా....అవన్నీ తరవాత చూద్దాం. ముందు యీతిరుపతి ప్రసాదం స్వీకరించండి. నిన్న పొద్దున్నే తిరుపతిలో స్వామి దర్శనం చేసుకుని, మధ్యాహ్నం బయలుదేరి వచ్చాను. జస్ట్ ఒక్కరోజే అయింది గనక మహారుచిగా వుంటుంది" అందరికీ తిరుపతి లడ్డూని ముక్కలుగా చేసి పంచుతూ అన్నాడు హరిబాబు.

"ఓహ్...గట్టిగా వుంటుంది గానీ, దీనితో పాటు తిరుపతి అరిశెలు కూడా వుంటే ఇంకా మజాగా వుంటుంది" ప్రసాదం నోట్లో వేసుకుని అన్నాడు నల్లమోతు పాండురంగమూర్తి.

"తెచ్చాను బాబూ... అదేకాదు కొండమీద నుంచి కాశీదారాలూ, స్వామివారి రాగి విగ్రహాలూ, TTD వారు ప్రత్యేకంగా అమ్మకం చేసే గంధపు చెక్కలు అన్నీ తెచ్చా" సంచీ లోంచి మాంత్రికుడిలాగా ఒక్కో పొట్లం తీస్తూ అన్నాడు హరిబాబు.

"గంధం చెక్కలా...! యీ ఎండాకాలంలో ఆ గంధం అరగదీసి, ఒళ్ళంతా పూసుకుంటే ఎంత చల్లగా వుంటుందో!" ఆనందంగా అన్నాడు తిరుమల నుంచి వచ్చిన మోహనదాసు.

"అవునవును... చిన్నతనంలో మా అమ్మగారలాగే నుదుటికీ, వంటికీ పూసేది" తల్లిని తలుచుకుని నిట్టూర్చాడు ప్రసాదు.

ప్రసాదం అద్భుతమైన సువాసనతో, మహాద్భుతమైన రుచితో మనసుల్ని ప్రక్షాళన చేసింది.

"ఇంతకీ నా ప్రశ్నకి జవాబివ్వలేదు" అన్నారు ముత్తుస్వామిగారు.

"మీ ప్రశ్నకి సమాధానం ఆ దేవుడే ఇచ్చాడు ముత్తూ" నవ్వుతూ అన్నారు గడుసు మాస్టారు.

"దేవుడిచ్చాడా? ఎలా?" ఆశ్చర్యంగా అన్నారు ముత్తుస్వామి.

"ఈ తిరుపతి లడ్డూ రూపంలో! ఇందులో ఏమీమి ఉన్నాయో? శనగపిండీ, జీడిపప్పూ, పంచదారా, కిస్ మిస్, కుంకుమపువ్వు, కలకండ ముక్కలు, బాదంపప్పు, చారపప్పు..ఇలా అనేక దినుసులున్నాయి అవునా?" ఆగారు మాస్టారు.

"అవును" తలవూపాడు రంగమూర్తి.

"జీడిపప్పుకి మాటలొస్తే ఏమంటుందీ? యీ తిరుపతి లడ్డూకి 'రుచి' నావల్లే వచ్చిందంటుంది" నవ్వారు మాస్టారు.

"నావల్లనే వచ్చిందీ, లేకపోతతే ఇది చప్పగా ఉంటుందీ, అని పంచదార అంటుంది" అన్నాడు హరిబాబు.

"అసలు నేను లేకపోతే 'లడ్డూ' అని ఎవరంటారూ? అంటుంది శనగపిండి. కాదా?" పకపకా నవ్వి అన్నాడు కృష్ణారెడ్డి.

"కిస్ మిస్ మాత్రం తక్కువ తిన్నదా? నేనే 'ది బెస్ట్' అంటుంది" అన్నాడు మోహన్ దాస్.

"కదూ!.. ఇప్పుడు ఆలోచించండి. లడ్డూ తయారీకి వాడిన అన్ని వస్తువుల సంయుక్త రుచే దీనికింత పేరు తెచ్చింది. విడివిడిగా వాటి వాటి రుచులు వాటికి ఉండొచ్చు. అవి అన్నీ కలిసినప్పుడేగదా అద్భుతమైన రుచిని సృష్టించగలిగాయీ! అలానే యీ లోకంలో మహావృక్షాలు ఉన్నాయి. సమున్నత పర్వతాలు వున్నాయి. నదీనదాలున్నాయి. లక్షలాది పక్షి గణాలున్నాయి. కోటానుకోట్ల భూచరాలూ, జలచరాలు ఉన్నాయి. అన్నింటికీ చైతన్యమిచ్చే రేయింబవళ్ళు, ఋతువులూ ఉన్నాయి. ఆకాశం నిండా ఎన్న నక్షత్రాలు వున్నాయో, యీ భూమ్మీద అన్ని జీవరాశులున్నాయి" ఆగారు మాస్టారు.

"అవును. ముమ్మాటికీ నిజం" తల ఊపాడు లక్ష్మీ నరసింహం.

"విడివిడిగా దేనికవి గొప్పవే. ఒక్క క్షణం ఆలోచించండి. వర్షం రాగానే నేలంతా పచ్చగడ్డి తివాచీని పరచుకుంటుంది. నెమళ్ళు ఆడతాయి. కప్పలు తమ అరుపులతో ఆనందపు చిందులతో వర్షాన్ని మళ్ళీ మళ్ళీ స్వాగతిస్తూ తమ హర్షాన్ని తెలియజేస్తాయి. ఇక పాముల్లాంటి విషజీవులు కూడా తమ పుట్టల్నుంచి బయటికొచ్చి తొలకరి సువాసనని కడుపారా పీల్చుకుంటాయి. అలాగే శిశిరం వస్తుంది. చెట్లన్నీ ఆకుల్ని రాల్చేసుకుని మరో ఋతువు రాగానే పచ్చని ఆకుల వలువలు తొడిగేసుకుంటాయి. ప్రతి ఋతువు ఒక అద్భుతమే... కదా?" నవ్వారు మాస్టారు.

"అవునవును. ఇప్పుడయితే చెప్పులు వేసుకుని దర్జాగా తిరుగుతున్నాం కానీ, చిన్నప్పుడు చలికాలంలో పచ్చిక మీద కురిసిన మంచు బిందువుల మీద నగ్న పాదాలతో నడుస్తూ వుంటే ఎంత అద్భుతంగా వుండేదీ! అరికాళ్ళ నుంచి సహస్రారం దాకా ఆ మంచు బిందువుల చల్లదనం ప్రవహించి మత్తెక్కించేది కాదూ!" ఆనందంగా గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ అన్నాడు ఘంటా గంగాధరరావు.

"ఋతువుల సంగతి పక్కన పెడితే, క్షణక్షణమూ రూపులు మార్చుకునే నీలి, వెండి రంగులో కదిలే మేఘాలూ, తమ తమ స్వరాలతో నిద్ర లేపే పక్షులు, అనంతమైన యీ ప్రకృతి ఎంత అద్భుతం. ఓ ఆవు, ఓ మేక, ఓ పిల్లి, ఓ కుక్క, ఓ ఆరుద్ర పురుగు, పడగ ఎత్తి ఆడే నాగుపాము, అతివేగంగా పరుగు తీసే గుర్రాలు, గంభీరంగా, ఠీవిగా, మెల్లగా నడిచే ఏనుగులు, ఇలా ఏ జంతువుని చూసినా మైమరచిపోతాం కదా!" తన్మయత్వంతో అన్నారు మాస్టారు.

"అవునవును. నిజం మాస్టారూ, చిన్నప్పుడు మేమంతా తమ్మిలేరు ఎక్స్ కర్షన్ వెళ్ళేవాళ్ళం. స్వచ్ఛమైన నీరు, ఆ నీటిలో, ఆ ప్రవాహంలో యీదే చేపపిల్లలు ఎంత బాగుండేవో! అంతెందుకూ, గోతాలు తీసుకెళ్ళి వాక్కాయలు, అడవి జామకాయలు, పులిచేరు పళ్ళు, పరిక్కాయలు, అడవి కరివేపాకూ కట్టలు కట్టలుగా కోసి తె-

చ్చుకునేవాళ్ళం. ఎంత అద్భుతంగా, రుచిగా వుండేవో!" స్కూల్ డేస్ లోకి వెళ్ళిపోయి అన్నాడు ప్రసాదు.

"ఇప్పుడు చెప్పండి. సృష్టి లోని ప్రతి జీవీ ఓ అద్భుతమే. ప్రతిదీ అందమైనదే... ఆనందాన్నిచ్చేదే! తీపి అంటే పంచదారో బెల్లంముక్కో కాదు ముత్తుస్వామీ! తీపి అంటే బ్రతుకు మీద 'తీపి' కలిగించేది. బ్రతుక్కి తీయదనాన్ని అంటే హాయినిచ్చేది. తిరుపతి లడ్డూ లోని అన్ని వస్తువులూ ఏకమై అద్భుతమైన రుచిని సంతరించుకున్నట్టు మనం కూడా ప్రకృతిలో ఒకటిగా కలిసినప్పుడే మన బ్రతుక్కి ఓ తియ్యదనమూ, ఆనందమూ కలుగుతుంది.

మోక్షం అంటే ఒకరు ఇచ్చేదో, మరొకరు పుచ్చుకునేదో కాదు. అది చచ్చాక వచ్చేది అంతకన్నా కాదు. ప్రకృతిలో మమేకమై పోవడమే మోక్షం. అది లభించేది 'మనసు'కి, అదీ సజీవంగా మనమున్నప్పుడే!" నవ్వారు మాస్టారు. యోగిలింగేశ్వరస్వామి గుడిలోనూ, విశ్వనాథ మఠం లోనూ ఒకేసారి గంటలు మ్రోగాయి.

"నిజం మాస్టారూ. యు ఆర్ రైట్. మనిషి ప్రకృతిలో మమేకం కావడమే మోక్షం!" అన్నాడు ముత్తుస్వామి తృప్తిగా.

అయ్యా అదీ సంగతి. యీ కథ ద్వారా నా స్నేహితులందర్నీ గుర్తు తెచ్చుకునే అవకాశం లభించింది. 'తిరుపతి లడ్డు' గురించి వివరణని నా చిన్నతనంలో ఇచ్చింది నా గురువుగారైన శ్రీ శ్రీ శ్రీ బోధానందపురి మహారాజ్ వారు. భౌతికంగా వారు కాలం చేసినా, మానసికంగా మనసులో స్థిరంగా వుండి ఇప్పటికీ దారి చూపుతున్నందుకు భక్తితో, కృతజ్ఞతతో నమస్కరిస్తూ ...... మళ్ళీ కలుద్దాం భువనచంద్ర

---

# పమ్మి భారతీ శర్మ



గట్టి పకోడీలు చేసుకోవటానికి కావలసిన పదార్థాలు:

## గట్టి పకోడీలు

| | |
|---|---|
| బియ్యం పిండి | 1 గ్లాసు |
| శనగపిండి | 2 గ్లాసులు |
| వాము | కొద్దిగా |
| నువ్వులు | కొద్దిగా |
| ఉప్పు | 1 చెంచా |
| కారం | 1 నుంచి 2 చెంచాలు |
| నూనె | 1/2 కేజీ |
| వెన్న | 2 నుంచి 3 చెంచాలు |



చేయు విధానం:

ముందుగా బియ్యం పిండి, శనగపిండి, వాము, నువ్వులు, ఉప్పు, కారం అన్నీ బాగా కలిసేలా ఒక వెడల్పాటి బేసిన్ లో కలుపుకోవాలి.దానికి 2 చెంచాలు వెన్నను గాని, కొద్దిగా కాచిన 2,3 చెంచాల నూనెను గాని పోసి బాగా కలిపి, చల్లని నీటితో చపాతీ పిండిలా కలుపుకోవాలి. విడిగా చిన్న ముద్ద తీసుకుని జంతికల గొట్టంలో పెట్టి, కింద బడ్డీలు ఉన్న ప్లేటు లేదా బిళ్ళ పెట్టుకుని .... మూకుడులో నూనె పోసి, వేడి చేసుకోవాలి. కొంచెం మంట తగ్గించి, తరవాత ఈ గట్టి పకోడీలు అందులో పిండుకుని రెండు వైపులా దోరగా వేగాక తీసుకోవాలి.

ఈ గట్టి పకోడీలు కరకరలాడుతూ వానాకాలం స్నాక్ గా చాలా బావుంటాయి.

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**ఆధారాలు : 1) డ = అసలు అక్షరం 'గ'; 2) హ = అసలు అక్షరం 'ప'**

స్త ప్ల డ గి డి చ - హా క లు
స్త ప్ల లు కా చె చీ - హా క లు
1. నె మ డి జ బు ఖ డొ మి - ని చ చీ హా క లు
స మి ర మ లో హి చ - హా క లు,
ర మ ద ద డ డ చ లు - క చ్చి చ హా క లు
స మ తి హు డా ని చ - హా క లు

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

నిత్యాత్ముడై యుండి - నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడై యుండి - సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి - బ్రహ్మమై యుండు సం
స్తుత్యుడీ తిరువేంక - టాద్రివిభుడు

జూలై నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ ఎ లక్ష్మణరావు, విజయవాడ;
శ్రీమతి సత్యవతి, అమలాపురం;
శ్రీమతి వాణి, ఖమ్మం.

# కొత్త రామానందం




## కృష్ణం వందే జగద్గురుం

యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం

ఎప్పుడు ధర్మానికి చ్యుతి, అధర్మానికి విజృంభణం కలుగుతాయో అప్పుడు భగవంతుడు అవతరించి ధర్మ సంస్థాపన చేస్తాడని భగవద్గీత చెబుతోంది.

శ్రీకృష్ణుని అవతారానికి ధర్మ రక్షణ, శిష్ట శిక్షణ, ధర్మ సంస్థాపన అనే త్రిపుటే పరమార్ధం. ఈ ఉద్యమానికి శ్రీకృష్ణుడు విశ్వ రథ సారథ్యం వహించాడు. శ్రీకృష్ణునిలో ఒక పక్క మానవత్వం తొణికిసలాడగా, మరొక పక్క దివ్యత్వం ప్రకాశిస్తుంది. చూడగలిగినవారికి చూడగలిగినంతగా దర్శనమిచ్చే పరిపూర్ణ పురుషుడు శ్రీకృష్ణుడు. కృష్ణావతారమే లోక హితార్థం దిగివచ్చింది. కాబట్టి కృష్ణుడి జీవితంలో మనకోసం ఆచరించని ధర్మమంటూ ఏదీ కనిపించదు. తన స్వధర్మాన్ని లోక హితంగా ఆచరించడానికి సంకల్పించినవారు సాధువులు. స్వధర్మాన్ని స్వార్థానికి వినియోగించుకునేవారు దుష్కృతులు. శ్రీకృష్ణుడు అవ్యక్త ధర్మానికి వ్యక్త రూపం. ఆ మహాపురుషుని జీవితంలో-



నూ, బోధనలలోనూ భారతీయం ఆధ్యాత్మిక, లౌకిక ఆకాంక్షలకు సమాధానం లభిస్తాయి.

కృష్ణుడు పరమ నిరాడంబరుడు. కారాగారంలో దేవకీ వసుదేవుల పుత్రుడుగా జన్మించాడు. చతుర్భుజాలతో, శంఖు చక్రాలతో, శ్రీవత్స లాంచనంతో, వృషభ లగ్నంలో, శ్రావణ బహుళ అష్టమి నాడు అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో శ్రీకృష్ణుడు ఉదయించాడు. ఇంతటి చీకటిలో ఉన్న మిమల్ని వెలుగులోకి తెచ్చేందుకు నేను కూడా చీకటిలోనే వస్తున్నానంటూ, వెలుగే తానైనాడు. పరమానందరూపుడు, పరంజ్యోతి స్వరూపుడు మనకోసం చీకట్లోకి వచ్చాడు. బ్రతుకులో అందాలను ఆవిష్కరింపచేసేందుకు ఉద్భవించాడు. తనను ఎక్కడకు తీసుకెళ్ళాలో, యశోద వద్ద ఉన్న బిడ్డను ఎలా తేవాలో, అంతా క్షణంలో దేవకీ వసుదేవులకు చెప్పి, తాను తిరిగి మామూలు శిశువై పోయాడు. గోకులంలో పెరిగాడు. యశోద నందుల గారాల పట్టిగా, వారింట్లో పాలు, పెరుగు, వెన్న తిని తోటి గోపబాలురతో కలిసి మెలిసి పెరిగాడు.

నందుడు తమ బిడ్డకు జ్యోతి-

ష్య పండితుడైన గర్గముని ద్వారా 'కృష్ణ' అనియు, అన్నకు 'బలరాముడు' అని పేర్లు పెట్టారు. 'కృష్' అంటే ఎల్లప్పుడూ ఉండేదనియూ, 'ణ' అంటే ఆనందం అనియూ అర్థం. పోతన 'మహాభాగవతం' లో వర్ణించిన కృష్ణ జన్మ వృత్తాంతం జగద్విదితం. భాగవతమంతా శ్రీకృష్ణుడే. కృష్ణ తత్త్వం సముద్రం లాంటిదే. ప్రవాహం దగ్గరకు బిందెతో పోయినవారికి బిందెడు నీళ్ళు, వట్టి చేతులతో పోయినవార్కి చారెడు నీళ్ళు దొరుకుతాయి. ఆత్మబలంతో ప్రయత్నించిన వాళ్ళు మొత్తం ప్రవాహాన్ని తమపెరట్లోకి తెచ్చుకోగలరు.

చిత్రమేమంటే ఆయన జీవితం మొత్తం విషాదమయం. పుట్టడమే చెరసాలలో పుట్టాడు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో పెరిగాడు. నిత్యం ప్రాణాపాయంతో తిరిగాడు. ఎన్నో గండాలు దాటాడు. నిందలు మోశాడు. కుట్రలలో ఇరుక్కున్నాడు. పూతన ఇచ్చిన స్తన్యంతో పాటు ఆమె ప్రాణాలను కూడా హరించాడు బాలకృష్ణుడు. ఆమె దేహ కల్మషాలను ఆ అమృత బాలుడే తాగేశాడు. శ్రీకృష్ణుని స్పర్శతో ఆమె సరాసరి స్వర్గానికే వెళ్లిందని పురాణ కథనం. శకటాసురున్ని, అఘాసురున్ని, బకాసురుణ్ణి, త్రుణావర్తుడు మొదలగు రాక్షసులను మట్టుపరిచాడు.



నీటిమడుగుని దౌర్జన్యంగా ఆక్రమించుకుని 'కాళియహ్రద' మనే పేరుతో జీవిస్తూ అడ్డూ అదుపూ లేకుండా ఉన్న కాళీయుని తానే స్వయంగా అణచివేశాడు శ్రీకృష్ణుడు.

కృష్ణుని మాటకు, చూపుకు గోపెమ్మలు పరవశించిపోయి ఆలింగనం చేసుకుని ఎద నుంచి పొంగివస్తున్న క్షీరాన్ని తాగించేవారు.గోవులు సైతం కృష్ణుడి కోసం తపించిపోయేవి. ఆయన ఎక్కడుంటే అక్కడ ప్రేమ పొంగుతుంది. రాధా మాధవుల ప్రణయం జగత్తుకే ఆనందదాయకం. నిష్కల్మక భక్తితో, సమర్పణ భావంతో గోపికలు అందించారు కనుకనే ఆ గోపికల ఇళ్ళలోకి వెళ్లి వెన్న ఆరగించాలంటే శ్రీకృష్ణునికి ఇష్టం. వాళ్ళ ఇళ్ళల్లో భోంచేసింది వెన్న కాదు. వారి హృదయాలలోని ప్రేమనే ఆరగించాడు. శ్రీకృష్ణుడు నవనీత చోరుడుగా పేరుపొందినాడు.

అందరి చిత్తాన్ని తనవైపు మరల్చుకుని హృదయానందం కలిగించే దివ్య స్వరూపుడు శ్రీకృష్ణుడు. కట్టెలో దాగుండే అగ్నిలా, సర్వ భూతాలలో ఆత్మ స్వరూపుడు వాసుదేవుడని భాగవతం వివరిస్తోంది. అల్లరి చేష్టల వెనుక అనంతమైన దార్శనిక సూత్రాలు, ధర్మాన్ని నడిపించటం కోసం చేపట్టిన చర్యలు, మురిపించి మైమరిపించే ప్రేమాస్పద భావనలూ, జగదాచార్యునిగా దివ్యజీవన మాధుర్యాన్ని దర్శింపజేసే హితబోధలు ఇవన్నీ కృష్ణావతార పరిపూర్ణ నేపథ్యాన్ని అభివ్యక్తం చేస్తాయి.

శ్రీకృష్ణ పరమాత్మ తత్వమంతా 'గో' శబ్దంతో ముడిపడి ఉంది. శ్రీకృష్ణుడు - గోపాలుడు, గోవిందుడు, గోపీజన వల్లభుడు . అతనికి అత్యంత ప్రియమైనవారు గోపికలు. భూలోకంలో వారి నివాసం గోకులం. పాలించింది గోవులను. ఉద్ధరించింది గోవర్ధనం. ఆవిధంగా శ్రీకృష్ణ తత్వమంతా గోమయంతో నిండివుంటుంది. దశావతారాలలో కృష్ణావతారం

ఎనిమిదవది. స్వామి జన్మించింది ఎనిమిదవ నెలలో అష్టమి తిథి నాడు. వసుదేవుని కొడుకులలో శ్రీకృష్ణుడు ఎనిమిదవవాడు. శ్రీకృష్ణుని భార్యలు ఎనిమిదిమంది. ఎనిమిదిని గుణించగా వచ్చే పదహారువేల మంది గోపికలకు యితడు ప్రేమికుడు. కృష్ణ సావర్ణ మన్వంతరం ఎనిమిదవది. భీష్మ పితామహుడు అష్టమ వసువు. ఆయన ఉద్ధరించిన నామాలలో ప్రసిద్ధి చెందిన నామాలు ఎనిమిది.

పెరిగి పెద్దవాడైన తరవాత కూడా దుష్ట సంహారం కొనసాగించాడు. అపార ప్రకృతిలోని రజో తమో గుణాలను నిర్మూలించడానికి సంకేతంగా రజకుణ్ణి, కువలయా పీడనం అనే ఏనుగును సంహరించాడు. అలాగనే ముష్టిక చాణూరులనే మల్లయోధులను మట్టుపెట్టాడు. దుష్టుడైన మేనమామ కంసుని వధించాడు. కంస ముష్టిక చాణూరులను వధించటం లాంటివి మానవాతీత చేష్టలు. శిశుపాల దంతవక్త్రుల సంహారమే శ్రీకృష్ణ అవతారానికి కీలక హేతువు. హక్కుగా ప్రాప్తించిన రాజ్యాన్ని తాను అనుభవించక ఉగ్రసేనునికి అప్పజెప్పాడు. తల్లితండ్రులైన దేవకీ వసుదేవులను కారాగారం నుంచి విముక్తి చేసాడు.

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ధర్మ సంస్థాపనలనే త్రిపుటి కృష్ణావ-



తార పరమార్థం. ఈ ఉద్యమానికి శ్రీకృష్ణుడు విశ్వ రథ సారథ్యం వహించాడు. ఆయనలో ఒకపక్క మానవత్వం తొణికిసలాడగా, మరో పక్క దివ్యత్వం ప్రకాశించింది. కర్ణునికి ద్రౌపది దక్కకుండా, అర్జునుడే మత్స్య యంత్రం కొట్టగలిగేలా, ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో దుర్యోధనుడు ద్రౌపదిని 'కులట' 'పంచభర్తృక' అని నిందిస్తుంటే, అవన్నీ సరి కావని వస్త్రాలనిచ్చి మరీ ఆమెను పతివ్రతగా నిరూపించాడు.

అన్ని సందర్భాలలో పాండవులకు మార్గదర్శకునిగా వ్యవహరిస్తూ ధర్మ రక్షకునిగా, ధర్మ పక్షపాతిగా నిరూపించుకున్నాడు. నిరాశా నిస్పృహలలో, అచేతనావస్థలో పడివున్న అర్జునునికి చేసిన కర్తవ్య బోధ అత్యద్భుతం. రాబోయే కలియుగపు పాప - అధర్మ విధానం నచ్చక అవతారాన్ని చాలించాడు. చాలించేముందు మనం ఎలా ఉండాలో ఆ విషయాన్నంతటినీ భగవద్గీతలో మనకు అందించి మరీ వెళ్ళిపోయాడు. లౌకికంగా హేతువాదం ప్రకారం వందమంది కౌరవులు, ఐదుగురు పాండవుల్ని గెలిచి రాజ్యం పొందాల్సివున్నా , మానవబలం కంటే దైవానుగ్రహమే గొప్పదని నిరూపిస్తూ పాండవుల్ని గెలిపించాడు. ఏ అవతారంలోనూ, ఆ అవతారమూర్తి తన విరాట్ రూపాన్ని ప్రదర్శించలేదు. కాని శ్రీకృష్ణుడు కౌరవ సభలోనూ, కురుక్షేత్ర యుద్ధ ప్రారంభంలో చేసిన గీతాబోధ సమయంలోనూ తన విరాట్ రూపాన్ని ప్రదర్శించాడు. ఇది ఒక పరమాత్మకే సాధ్యం.

శ్రీకృష్ణ సుధాముల స్నేహం జగత్ ప్రసిద్ధమైంది. చిన్ననాటి బాల్య స్నేహితుడు, సహాధ్యాయి, నిరుపేద అయిన సుధాముడు, అత్యంత దయనీయ స్థితిలో శ్రీకృష్ణుని గృహాన్ని సందర్శించినప్పుడు సుధామునికి జరిగిన సత్కారం అనన్యమైనది. స్నేహితుని కష్టాలలో కష్టాన్ని, సుఖాలలో సుఖాన్ని పంచుకోవడమే సర్వోత్కృష్టమైన పరమోత్తమ గుణం.

కామ క్రోధాది అరిషడ్వర్గ నాశనం, సత్సాంగత్యం, ఇంద్రియ నిగ్రహం, ఆత్మజ్ఞానం జ్ఞానం గురించి తెలిపిన పురాణ పురుషుడైన గోవిందుని కృష్ణాష్టమినాడు భజిస్తే భవసాగరాన్ని తేలికగా దాటవచ్చును. ఆయన జీవితగాథ మధుర మనోహరం.

### ఉడిపి వాసుదేవుడు

కర్ణాటక రాష్ట్రంలోని 'ఉడిపి' పుణ్యక్షేత్రంలో శ్రీకృష్ణ స్వామిని దర్శించి పునీతులు అవ్వచ్చును. ఆలయం చూడముచ్చ-

టగా ఉంటుంది. ప్రతిరోజూ వేలాదిమంది భక్తులు దర్శనం చేసుకుంటారు. ఇచ్చట స్వామివారు బాలకృష్ణుని రూపంలో కొలువై ఉంటారు. ఇచ్చట కొలువై ఉండటం వెనుక ఒక అద్భుతమైన వాస్తవ గాథ ప్రచారంలో ఉంది.

ద్వైత సిద్ధాంతం కర్త శ్రీ మధ్వాచార్యులవారు భారతదేశమంతటా పర్యటిస్తూ ద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తుండేవారు. ఒక రోజున ఉడిపి పక్కనే ఉన్న మాల్పే అనే సముద్రతీర ప్రాంతంలో స్నానాదికాలు ముగించుకుని ధ్యాన నిమగ్నుడై ఉన్న సమయంలో తుఫాను వచ్చి, పెద్ద అలలు లేచి ఓ పడవ అలలలో చిక్కుకుని మునిగిపోవుచున్నది. పడవలో ఉన్నవారి హాహాకారాలు మిన్నుముట్టాయి. రక్షించండి అంటూ వేడుకున్నారు. ధ్యానములో ఉన్న మధ్వాచార్యులవారు తన అంగ వస్త్రాన్ని తీసి తుఫాను దిశగా విసిరారు. ఆశ్చర్యం! తూఫాను ఒక్క క్షణంలో మటుమాయమైపోయింది. తమను కాపాడిన మధ్వాచార్యులవారికి పడవ యజమాని ఎంత ధనమైనా కానుకగా ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. అతని అభ్యర్థనను సున్నితంగా తిరస్కరించిన మధ్వాచార్యులవారు, తన శిష్యులను పిలిచి, పడవలో ఉన్న చందనపు దుంగను తీసుకురమ్మని పుర-



మాయించారు. దానిని తీసుకు వచ్చి దగ్గరలో ఉన్న కొలనులో శుభ్రంగా కడగగా, ఆ చందనపు దుంగలోని చందనం అంతా కరిగిపోయి, ఓ అందమైన కృష్ణ ప్రతిమ బయటపడింది. భక్తి శ్రద్ధలతో ఆ విగ్రహ ప్రతిష్ఠ చేసిన ఉడిపి క్షేత్రంలో కాలక్రమేనా అపురూప ఆలయం రూపు దిద్దుకుంది.

ఉడిపి శ్రీకృష్ణాలయం ప్రవేశద్వారం ఓ ఎత్తైన ముఖద్వారంలా కనిపిస్తుంది. ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించగానే, కుడిచేతి వైపు మాధవ తీర్థం కానవస్తుంది. ఇచ్చట పర్వదినాలలో తెప్పోత్సవం జరుగుతుంటుంది. తీర్థం మధ్యలో ఉన్న మండపంలో ఉన్న మధ్వాచార్యుల విగ్రహాన్ని దర్శించుకోవచ్చును. గర్భాలయానికి ఎడమ వైపున చెన్నకేశవస్వామి పంచలోహ మూర్తి ఉంది. గర్భాలయంలో పశ్చిమాభిముఖుడై ఉన్న వాసుదేవమూర్తి స్వామివారిని నేరుగా దర్శించుకోలేము. స్వామివారి గర్భాలయ ద్వారాలు ఎప్పుడూ మూయబడేవుంటాయి. ఆ తలుపులకు చేయబడిన నలుచదరపు కంతలలో నుండి ఆ మూర్తిని దర్శించుకోవచ్చును. ఇందువెనక ఓ ఉదంతం చెప్పుబడుతుంది.

ఒకనాడు 'కనకదాసు' అనే భక్తుడు ఉడిపి చేరుకొని వాసుదేవుని కీర్తిస్తూ అనేక గీతాలు ఆలపించాడు. కనకదాసు తక్కువ కులానికి చెందినవాడైనందువలన, అతని ఆలయ ప్రవేశానికి ఒప్పుకోరు. ఆ భక్తునికి, అమ-





ర్యాద వల్ల, బహుచింతితుడై , దుఃఖంతో గొంతు పూడుకుపోయిన స్వరంతో 'కృష్ణా! నీ దృష్టిలో అంతా సమానులేనన్న విషయం ఈ దీనులకు తెలియటంలేదు. నాకు నీ దర్శన భాగ్యం కలిగించు తండ్రీ!' అంటూ గర్భాలయం వెనక సొమ్మసిల్లి పడిపోయాడు. అంతే ఒక్కసారిగా ఫెళ ఫెళ ధ్వనులతో గర్భాలయపు వెనుక గోడ కుప్పకూలిపోయింది. కనకదాసుకి దివ్య దర్శన భాగ్యాన్ని కలుగజేశాడు. స్వామి దర్శనంతో పులకించిపోయిన కనకదాసు, స్వామి కీర్తనలతో తన జన్మ ధన్యం చేసుకున్నాడు. అప్పటి నుండి ఉడిపి గుడిలో గర్భాలయ ద్వారాలు మూయబడి, భక్తులకు ఆ ద్వారంలో ఏర్పాటు చేయబడిన తొమ్మిది రంధ్రాల కిటికీ ద్వారా దర్శన భాగ్యం కలగజేయటం జరుగుతోంది. తొమ్మిది రంధ్రాలతో కనిపించే ఆ కిటికీని 'కనక కిటికీ' అని పిలుస్తూంటారు. ఆ కిటికీ లోనుంచి స్వామివారిని దర్శించుకునే భక్తులు సమస్త గ్రహ దోషాలనుంచి బయటపడతారు.

స్వామివారిని చూస్తే ఎంతో ఆకర్షణీయంగా వుంటుంది. ఎడమ చేతిలో కవ్వము, కుడి చేతిలో కవ్వపు తాడును పట్టుకుని దర్శనమిస్తోన్న బాలకృష్ణుడు సర్వాభరణాలతో వెలుగులీనుతుంటాడు. ఈ ఆలయంలో అనేక ఉపాలయాలు కొలువుతీరి ఉన్నాయి - శ్రీ వీరాంజనేయస్వామి మందిరం, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి మండపం, నవగ్రహ మంటపం, మధ్వాచార్య పీఠం, గోశాల మరియు మ్యూజియం కూడా ఉన్నాయి. ఆలయ అధికారులు ప్రతి దినం భక్తులకు అన్నదానాన్ని చేస్తారు. తన సన్నిధానానికి వచ్చిన భక్తులు, ఆలయంలో భోంచేసి ఇంటికి తిరిగి వెళ్ళాలని స్వామివారి అభిమతం. అందుకే స్వామివారిని 'అన్న బ్రహ్మ' అని కొలుచుకుంటారు.

ఈ కృష్ణాలయంలో నిర్మాల్య విసర్జన పూజనుంచి మొదలయ్యే పూజలు, రాత్రి ఏకాంతసేవ వరకు అత్యంత వైభవంగా జరుగుతుంటాయి. ఈ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి నాడు నిర్వహించే కృష్ణ లీలా ఉత్సవం, నవరాత్రి ఉత్సవం, మకర సంక్రాంతి సందర్భంగా రథోత్సవం కన్నుల పండుగగా జరుగుతుంటాయి.

ఆలయ స్థాపకులు మధ్వాచార్యులవారు, ద్వైత సిద్ధాంత పరిరక్షణ కోసం ఎనిమిది మంది శిష్యులకు దీక్ష ప్రసాదించారు. వీరందరూ ఆలయం చుట్టూ ఆశ్రమాలు ఏర్పరచుకున్నారు. ఇప్పటి కాలంలో ఒక్కొక్క మఠం వారు రెండేళ్లపాటు శ్రీ వాసుదేవుని పూజా కార్యక్రమాలు నిర్వహించుకునే ఏర్పాటు చేసుకున్నారు. ఈ మార్పు ప్రతి రెండేళ్లకొకసారి పుష్య మాసంలో జరుగుతుంటుంది. దీనిని పర్యాయ పూజ అని అంటారు. ఈ పూజే ఆలయంలో జరిగే ఉత్సవాలలో ప్రధాన ఉత్సవం. ఈ వేడుకలో పాల్గొనటానికి దేశం నలుమూలల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. జీవితంలో ఒకసారైనా ఉడిపిలోని శ్రీకృష్ణుని దర్శనం చేసుకోవాలంటారు.

ఓం నమో భగవతే వాసుదేవాయ

ది 23-8-2019 న శ్రీకృష్ణ జన్మాష్టమి




ENGLAND

RNI No. TELTEL/2011/39497 AUGUST 2019 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st August Date of Posting: 8th JAugust




Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-50000